# జ్యోతిర్లింగ యాత్ర

(వారణాసి, ఉజ్జయిని, ఓంకారేశ్వర్)

**మాస్టర్ కె. పార్వతీకుమార్**

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2005
శ్రీ పార్థివ -
ప్రతులు : 1,000

వెల : రూ॥ **20-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "*జగద్గురు మందిరము*" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# ముందుమాట

**మా**నవ జీవితమందు కష్టనష్టములు, సుఖదుఃఖములు సర్వసామాన్యము. కొందరి జీవితములలో కష్టములు, దుఃఖములు అధికమై భరించరానివిగ నుండును. ఇట్టివారి బాధను నివారించుటకు, ఉపశమనము గావించుటకు, కర్మ క్షయమునకు ఋషులు తీర్థ యాత్రలు, పుణ్యక్షేత్ర దర్శనములు పరమౌషధములుగ తెలిపిరి.

త్రేతా యుగమున శ్రీరాముడు, ద్వాపరమున పాండవాగ్రజు డైన యుధిష్ఠిరుడు ఆసేతు హిమాచల పర్యంతము కష్ట సమయ ములో తీర్థయాత్రలు గావించినవారే. శ్రీరాముని జీవితమందు, యుధిష్ఠిరుని జీవితమునందు కలిగిన ఆపదలు మరెవ్వరి జీవితము నందును గోచరింపవు. నలుడు, హరిశ్చంద్రుడుకూడ ఆ కోవలోని వారే !

తీర్థముల యందు, క్షేత్రముల యందు దివ్య సాన్నిధ్యము అమితముగ లభించును. సూక్ష్మ శరీరధారులై ఎందరో మహాత్ములు, సిద్ధులు, యోగిపుంగవులు కూడ అట్టి పుణ్య ప్రదేశములయందు వసించుచుందురు. దైవసాన్నిధ్యము, సద్గురు సాన్నిధ్యము ఒక్కమారుగ లభించి, జీవులకుగల ప్రారబ్ధకర్మము దహించబడును. తత్కారణముగ తీర్థయాత్ర, క్షేత్ర దర్శనము జీవుల కత్యావశ్యకరము. పుణ్యనదులలో స్నానమాచరించుట, పుణ్య క్షేత్రములయందు భక్తిశ్రద్ధలతో దైవము నారాధించుట, దానధర్మములు గావించుట అత్యంత శ్రేయోదాయక మని పెద్దలు తెలిపియున్నారు.

తీర్థయాత్రలకు శరీరశ్రమ తప్పనిసరి. శరీరశ్రమ కర్మక్షయము కావించగలదు. అందులకే యాత్రలు అరణ్యములలోనికి, కొండల మీదికి జరుగుట ఏర్పడినది. నిద్ర, ఆహారము, ప్రయాణ, వసతి సౌకర్యములయందు మనస్సు లగ్నము చేయక దైవముపై, గురువుపై మనసు లగ్నము చేయుట యిందలి అంతరార్థము. జ్యోతిర్లింగములు, అష్టాదశ శక్తి పీఠములు, మరెన్నియో విష్ణు క్షేత్రములు భారతదేశమున నలుదిక్కుల వ్యాపించి యున్నవి. సంవత్సరమునకొక క్షేత్రమును, తీర్థమును కుటుంబ సహితముగ దర్శించుట ఋషు లేర్పరచిన సంప్రదాయము. ఏలినాటి శని దశ నడచుచున్న కష్టకాలములో ఇవి ఎంతయో ఆవశ్యకము.

తీర్థయాత్రల నెట్లు గావించవలెనో తెలిసి యాచరించుట వలన తదనుభూతి పొందు అవకాశము ఎక్కువగ నుండును. మాస్టర్ పార్వతీకుమార్‌గారు తన అనుయాయులతో కలసి నిర్వర్తించిన రెండు యాత్రల ప్రత్యేకతలను, విశేషములను 'నావాణి'లో శీర్షికలుగా ప్రచురింపబడుచున్నవి. ఇవి అత్యంత స్ఫూర్తిదాయకముగ నుండుటచే వీనిని పుస్తకముగ ప్రచురింపవలెనని పలువురు కోరగ 'ధనిష్ఠ' ఈ సత్కార్యమును చేపట్టినది. ఆస్తిక్య బుద్ధితోపాటు భక్తి, శ్రద్ధ, వినయము గల సోదరులు శ్రీ బిళ్లా గంగునాయుడు గారు ప్రచురణా బాధ్యతను తనకు వరముగ నిమ్మని మాస్టరుగారిని వేడుకొనిరి. తత్ఫలితముగ ఈ పుస్తకము ఆవిష్కరింప బడుచున్నది. పరమగురువులు శ్రీ గంగునాయుడుగారి సమర్పణమునకు సంతృప్తులై, వారి కుటుంబము నకు ఆయురారోగ్య ఐశ్వర్యము లీయవలెనని ప్రార్థిస్తూ.

**– ధనిష్ఠ**

# కాశీ క్షేత్ర దర్శనం

# కాశీ క్షేత్ర దర్శనం

అతి ప్రాచీనకాలం నుండి భారతీయ సంస్కృతిలో కాశీ క్షేత్రానికి ప్రప్రథమ స్థానము, అత్యంత విశిష్టత కలదు. కాశీలో జీవించడం, కాశీలో మరణించడం, కాశీలో చితాభస్మాన్ని కలపడం, కాశీని దర్శించడం గూర్చి అనేకములైన, అతి విస్తారమైన రచనలు గలవు. ప్రాచీన భారతీయ విద్యాలయాలలో కాశీపీఠం అత్యంత పేరు ప్రఖ్యాతులు గడించినది. కాశీ ప్రాభవము వర్ణనాతీతము.

నాలుగు సంవత్సరాల క్రితం జగద్గురుపీఠం సోదరులొకరు శ్రీ పార్వతీకుమార్‌గారిని ఇలా వేడుకున్నారు. "మాస్టరుగారు! మమ్ముల నందరిని మీతోపాటు ఒక పుణ్యక్షేత్రానికి తీసుకొని వెళ్ళండి. మీ సాన్నిధ్యంలో దైవానుభూతిని పొందాలని మాకు కోరికగ నున్నది." అప్పటినుండి శ్రీ కుమార్‌గారు తన మనస్సులో పై తెలిపిన విన్నపాన్ని దాచి ఉంచారు. క్రిందటి సంవత్సరం అనగా వృషనామ(2001) సంవత్సరంలో 72 మంది మించకుండ ఒక బృందాన్ని కాశీ, ప్రయాగ క్షేత్రములకు తీసుకొని వెళ్ళెదనని, సంసిద్ధులైనవారి పేర్లను సోదరులు శివశంకర్‌గారికి అందించ వలసిందని, యాత్రకు సంబంధించిన సమస్త వివరములు, నియమములు శ్రీ శివశంకర్‌గారి ద్వారా ఆసక్తులకు అందుతా యని తెలియపరిచారు.

ఆశ్వయుజ మాసాంతము కార్తీక మాసారంభములో **నవంబరు 10 నుండి 18వ తేదీ** వరకు యాత్రను నిర్ణయం చేసారు. ఈ కాలం ఎన్నుకోవటంలో మాస్టరుగారి ముఖ్యోద్దేశము దివ్యాను భూతికి అనువైన కాలమును ఎన్నుకోవటమే. మాస్టరు గారు పైకి కనపడకుండ అనేక విధములుగ గ్రహ యోగములను గమనిస్తూ కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటారు. వారు విదేశాలు వెళ్ళినా, స్వదేశంలో ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నా ఆధ్యాత్మిక జ్యోతిషమును మిక్కుటముగ అనుసరిస్తుంటారు. పై తెలిపిన తేదీలలో అతి ముఖ్యమైన గ్రహయోగ మేమనగా, గురు-శుక్రుల పరస్పర శుభదృష్టి. ఈ శుభదృష్టి దివ్యానుభూతికి అతి ముఖ్యము. పై తెలిపిన రోజులలో గురు - శుక్రులకు నిశితమైన శుభదృష్టి ఏర్పడి యున్నది. ఇంకను మిగిలిన గ్రహాను కూల్యము కూడ విశిష్టముగ నున్నది. దివ్యానుభూతికి కాలము కూడ అనుకూలించవలెను. ఇట్లు వారంతర్గతమున ఎన్నియో గుణకము లుండును. దైవము, కాలము, గురువు, ప్రకృతి అనుకూలించినపుడే సమస్తము ఆనందము నీయగలదు.

కాశీ యాత్రకు సంసిద్ధులైన వారిలో విశాఖపట్నం, హైదరాబాదు, రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, బరంపురం సోదరులు కలరు. యాత్రావిశేషములు, అనుభవములు ఇట్లున్నవి.

**10 నవంబరు, 2001** ఉదయమునకే ఇతర ప్రాంతముల నుండి సోదర బృందమంతయు విశాఖను చేరిరి. అందరికిని వసతి, భోజన ఏర్పాట్లు చేయబడినవి. సాయంకాలము ప్రదోష కాల సమయమున బృందమంతయు ఏకవార రుద్రాభిషేకము

గణపతి పూజతో ప్రారంభించి శ్రద్ధాభక్తులతో నిర్వర్తించుకొని, భోజనము చేసి 9 గంటలకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి భువనేశ్వరమునకు పయనమైరి. జగద్గురుపీఠం కార్యవర్గ సభ్యులు శ్రీ ఏ.యల్.యన్.రావు, శ్రీ టి.వి.వి.యస్. రావు, శ్రీ సిహెచ్. సత్తిబాబు, శ్రీ బి.ఆర్.కె. రాజు హృదయపూర్వక వీడ్కోలు తెల్పిరి. అందరును ప్రశాంతమనస్కులై కాశీవిశ్వేశ్వరుని మనసులో భావించుకొనుచు రాత్రి రైలులో సుఖముగ నిద్రించిరి.

**11 నవంబరు 2001** తెల్లవారుజామున 4 గంటలకు బృంద మంతా నిద్రలేచారు. 5-15 గంటలకు గురుపాదుకాస్తవము, దుర్గా సప్తశ్లోకి, దుర్గాసూక్తము, గణపతిసూక్తములను పఠించారు. ఉదయం ప్రార్థనను నిర్వహించుకుంటున్న సందర్భంలో రైలు ఖుర్దారోడ్ చేరింది. బరంపురంలోని సోదరబృందం, సోదరులు రామకృష్ణశాస్త్రిగారి ఆధ్వర్యంలో ఖుర్దారోడ్ స్టేషనులో బృందానికి కాఫీ, తేనీరులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినారు. వాటిని సేవించి భువనేశ్వరానికి కోణార్క్‌లో ప్రయాణమయ్యారు. దారిలో పురుషసూక్తం, శ్రీ సూక్త బృందగానం చేస్తూ భువనేశ్వరం చేరారు.

భువనేశ్వరంలో స్నానాదికములకు, అల్పాహారములకు బరంపురం బృందం రైల్వే స్టేషనులోనే ప్రత్యేక ఏర్పాట్లు చేసినది. బృందమంతా స్నానపానాదులను ముగించుకొని 9 గంటలకు స్టేషను మొదటి అంతస్తులో రుద్రాభిషేకం నిర్వర్తించుకున్నారు.

**పూజావేదిక :**

పూజావేదిక ఈ యాత్రలో ఒక ప్రత్యేకము. ముఖ్యమైన

విషయమేమంటే గత 24 సంవత్సరములుగ రాధామాధవంలోని జగద్గురుమందిరములో మాస్టర్ ఇ.కె. గారిచే ఒక పూజావేదిక ఏర్పాటు చేయబడింది. మాస్టరుగారు తాను స్వయముగా ఎంతో కాలంనుండి పూజచేస్తున్న నరశింహ సాలగ్రామము, సుదర్శన చక్రము ఈ పూజావేదికలో స్థాపనం చేశారు. అటుపైన 1977 నుండి 1984 వ సంవత్సరం వరకు వారు రాధామాధవంలో ఉన్న సమయంలో మూడు స్ఫటిక లింగాలను కూడా ఏర్పాటు చేశారు. అటుపైన గత 18 సంవత్సరములలో శ్రీ కుమార్‌గారికి త్రిభంగి వేణుగోపాల పంచలోహ విగ్రహము, పంచలోహ శ్రీ లక్ష్మీనారాయణ విగ్రహము తంజావూరులో లభించాయి. భక్తరాజ్ మహారాజ్ గారి అనుగ్రహ ఆశీఃఫలంగా ఒక నల్లని నర్మద శివలింగం లభించింది. ఒక విచిత్రమైన సంఘటన ద్వారా మరియొక పెద్ద శక్తివంతమైన నర్మద శివలింగం లభించింది. అటుపైన శ్రీ కుమార్‌గారు ఖాట్మండులోని శ్రీ పసుపతినాథ్ దర్శనానంతరం ఒక సాధువునుండి సాలగ్రామ పాదుకలను ఆశీర్వచనంగా అందుకున్నారు. ఈ శక్తివంతము, చైతన్యవంతము అయిన దైవప్రతిమ లన్నింటికిని పూజ, అభిషేకము, అలంకరణము నిత్యము రాధామాధవంలో జరుగుతూ ఉంటాయి. శ్రీ కుమార్‌గారు వరకు మాస్టరుగారిచే స్థాపింపబడిన సాలగ్రామ సహిత ఈ పూజావేదికే "జగద్గురు పీఠము". కేవలము గురు పూజలకు మాత్రము ఈ పీఠమును సింహాచలం క్షేత్రమునకు తరలిస్తారు. కాశీక్షేత్ర దర్శనానికి ఈ మొత్తము పీఠమునంతను ఒక పెద్ద సూట్‌కేస్‌లో చక్కగ అమర్చి శ్రద్ధాభక్తులతో తీసుకొనివెళ్ళి అన్ని పుణ్యప్రదేశములలోను యథావిధిగ పూజ చేయటం ఒక

ప్రత్యేక కార్యక్రమంగా జరిగింది. శ్రీ కుమార్‌గారు చేయు పూజ ప్రత్యేక శ్రద్ధాభక్తులు కలిగి ఉంటాయి. దైవకళ పూజలో స్పష్టంగా గోచరిస్తుంది. అలంకరణ, దీపారాధన ఆకర్షణీయంగా ఉంటాయి. వారి స్తోత్ర పఠనశైలి భావయుక్తంగాను, భక్తిపూర్వకంగాను ఉంటుంది. దైవమును ఆహ్వానించు నప్పటినుండి వారు పూజా వేదికపైనే దృష్టి సారించెదరు. అందరికిని పూజా ప్రభావము ఆశీస్సులుగ అందునట్లు చక్కని ప్రయత్నం జరుగుతుంది. వారు పూజచేసే విధానం చూసి అనుభవించవలసినదే.

భువనేశ్వరం రైల్వేస్టేషనులో ఏకవార రుద్రాభిషేక పూజ జరిగింది. బరంపురం సోదరబృందంలోని కార్యకర్తలు మొదటి సారిగా పూజయందు పాల్గొన్నారు. తదుపరి వారు అందించిన ఇడ్లి, గారె ఉపాహారమును స్వీకరించి, 10-30 గంటలకు వారణాసి వెళ్ళు నీలాచలం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరినారు.

*రైల్వే రిజర్వేషన్లు :* ఈ యాత్ర సఫలీకృతం కావటానికి కృషి చేసిన కార్యకర్తలలో సోదరులు శ్రీ కె. శివశంకర్‌గారు ముఖ్యులు. వారు ప్రతి చిన్న విషయాన్ని కూడ శ్రీ కుమార్‌గారితో సంప్రదించి, శ్రద్ధతో బృందానికి సర్వసౌకర్యాలు ఏర్పరచినారు. ఈ యాత్రకి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని ముందుగా ఊహించి, తత్సంబంధిత సేవలందించడంలో శ్రీ శివశంకర్‌గారు తానే సాటి అని నిరూపించుకున్నారు. అందరి హృదయాలను చూరగొన్నారు. బృందమంతటికి రైలు ప్రయాణంలో ఒకే పెట్టెలో రిజర్వేషను గూర్చి, పెద్దవారి సామానులను మోయుటను గూర్చి, అన్ని చోట్ల బస్సులు, జీపుల అమరికను గురించి శుద్ధమైన

ఆహారము, పానీయముల గురించి, దేవాలయమందు చక్కని దర్శనమును గురించి వారు చేసిన ప్రయత్నము అత్యద్భుతము. కాశీయాత్ర బృందానికి గుర్తువచ్చినపుడల్లా, శ్రీ శివశంకర్‌గారు గుర్తురాక తప్పదు.

**11 నవంబరు, 2001 - ఆదివారం :**

రేడియో : నీలాచల్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన బృందానికి శ్రీ కుమార్‌గారి భాషణము అందించుటకై హైదరాబాదు బృందసభ్యులు ఎఫ్.ఎమ్. ఆధారంగా రేడియోలను ఏర్పాటుచేసి ప్రయాణం చేస్తున్న బృందానికంతా కుమార్‌గారి భాషణమును వినిపించేలా చేశారు. సోదరులు శ్రీ కె. ఎస్. ఆర్. గోపాల్‌గారి బృందము ఈ విషయంలో ఎంతో స్ఫూర్తితో ఏర్పాటు చేసినారు. రైలులోగాని, దేవాలయ ప్రాంగణములోగాని, గంగానది ప్రయాణములో గాని ఏమరక శ్రద్ధాభక్తులతో ఈ రేడియో ఏర్పాటును గావించారు. ఇది ఒక స్ఫూర్తివంతమైన చర్య.

భువనేశ్వర్ నుండి వారణాసికి ప్రయాణం దాదాపు 20 గంటలు. పదిన్నరకు బండి ఎక్కిన సోదరబృందానికి 11 గంటల నుండి ఒంటి గంట వరకు శ్రీ కుమార్‌గారు కాశీ మహాత్మ్యమును గూర్చి వివరించారు. అమర్చిన రేడియో ప్రసారం ద్వారా బృంద సభ్యులందరూ ఆలకించారు. ఆనందం చెందారు. చేసిన ప్రసంగాన్ని సోదరులు బాలకృష్ణమూర్తి (హైదరాబాదు) రికార్డు చేశారు. శ్రీ కుమార్‌గారి ప్రసంగంలోని ముఖ్యాంశములు ఈ విధంగా ఉన్నాయి.

**కాశీ మాహాత్మ్యము :**

1. 'కాశీ' అనగా వెలుగుతో కూడిన క్షేత్రమని అర్థము. 'కాస్' అనగా వెలుగు. ఆకాష్, వికాష్, ప్రకాష్ కూడ ఆ వెలుగు సంబంధితములే. ఈ భూగోళము మొత్తమంతా మునిగినపుడు కూడ ఈ రెండు క్షేత్రాలు వెలుగు ముద్దలవలె ఆకాశంలో కనబడుతూ ఉంటాయి. అందులో మొదటిది కాశి, రెండవది శంబళ. కాశీ జీవు లందరికిని వెలుగును ప్రసాదించగల క్షేత్రము.

2. కాశీ క్షేత్రము విష్ణు నిర్మితము. విష్ణువు శివుని ఆరాధించుట మన పురాణములలో స్పష్టముగ కనపడు చుండును. త్రేతాయుగమున రాముడు సైకత లింగము నేర్పరచి, శివుని పూజించి, ధర్మ స్థాపనమునకు రావణునిపై యుద్ధమునకు సంకల్పించెను. అది కారణముగ రామేశ్వరం ఏర్పడినది. అట్లే మహాభారత సంగ్రామమునకు ముందు 12 సంవత్సరములు శ్రీకృష్ణుడు శివుని గూర్చి తపస్సు చేసెను. శివుడు విష్ణువు తేజస్సు. విష్ణువు శివుని మోహనరూపము. ఈ రెండిటి మధ్య అవినాభావ సంబంధము కలదు. ఇందొక దానిని నిరాదరణ చేయువారు రెండవ దానిని పొందలేరు. అంతర్యామి సాధకులకు మాత్రమే ఇది అవగతమగు విషయము. విష్ణు నిర్మితమగు కాశీ క్షేత్ర మందు విశ్వేశ్వరుడు మరణించుచున్న జీవుల చెవిలో రామ నామము ఉపదేశము చేయునట. తత్కారణముగ జీవులకు ఉత్తర జన్మలు ఉత్తమమైనవిగ ఏర్పడునట.

3. కాశీ క్షేత్రమందు నివసించు సమస్త జీవులు పుణ్య ప్రదమైనవే. అందుచేత కాశీ క్షేత్రమున అగుపించు మనుషులను,

జంతువులను, పక్షులను, వృక్షములను అసహ్యించుకొనుట తగదు. అవియన్నియు శివరూపములని భావింపవలెను. సమస్తము నందు శివునే దర్శించుట ముఖ్యమైన కర్తవ్యము. ఏవగించుకొనినను, అసహ్యించుకొనినను, నిందించినను, అపవిత్రముగ నున్నదనుకొనినను ఆ భావన కారణముగ కాశీ దర్శనము జరుగదు.

4. కాశీ ప్రవేశము పాపహరణమునకు పరిష్కారము. కాశీ యందు సమస్త దృశ్యముల, ప్రవర్తనలయందు శివునే దర్శించుట యాత్రికుని కర్తవ్యము. ఇతర భావనలు కాశీ దర్శన ఫలము నీయజాలవు.

5. కాశీలో స్వల్ప ధర్మమును నిర్వర్తించిన విశేష ఫల ముండును. అటులనే స్వల్ప అధర్మము కూడ తత్ఫలితముల నిచ్చును. కావున కాశీయందు విరివిగ దానధర్మములు, తపములు, జపములు, మంత్రములు నిర్వర్తించుకొనుట యుక్తము.

6. కాశీ క్షేత్రమంతయు సాలగ్రామములతోను, శివ లింగములతోను నిండియున్నది. అందుచేత క్షేత్రమున అడుగు పెట్టినది మొదలు పుణ్యభావముతో మెలగవలెను. అచట భూమిని తన్నుట, మర్దించుట చేయరాదు.

7. దేవతా దర్శనము, గురు దర్శనము కాశీ క్షేత్రమందు విశేషించి అనుగ్రహింపబడును. ఈ విషయమును వివరించుటకై శ్రీ కుమార్‌గారు వేద ధర్ముడను గురువు, దీపకుడను శిష్యుడు కాశీ యందు నివసించినప్పటి వృత్తాంతము విపులముగ

వివరించిరి. ఆత్మ సాక్షాత్కారము కొరకు కృషి చేయు సజ్జనులకు కాశీ క్షేత్రము మిక్కిలి అనువైన ప్రదేశము.

8. కాశీ యందు అనేకమంది యోగులు, సిద్ధులు, తపస్వి జనులు నివసించు చుందురు. శ్రద్ధాభక్తులు కలిగినవారిని వారు అనుగ్రహించు చుందురు. సప్తర్షులు సహితము నిత్యము విశ్వేశ్వరుని దర్శనమునకు బ్రాహ్మీకాలమున కాశీ దర్శనము చేయుదురు.

9. జీవులకు గల ప్రారబ్ధ కర్మలలో కొన్నిటిని ప్రాయశ్చిత్త ముచే తొలగించుకొనవచ్చును. మరికొన్నిటిని గురువనుగ్రహ ముతో దాటవచ్చును. కొన్ని పాపములు మాత్రము అనుభవించడం వల్లనే పరిష్కరింపబడతాయి. కాశీక్షేత్రం పాపహారిణి అగుటచే ఈ ప్రారబ్ధకర్మ త్వరితగతిన అనుభవించి, జీవుడు కర్మను క్షయం అగునట్లు చేసుకొనవచ్చును.

తన కర్మలను ఇతరులెవరైనా సంక్రమింప జేసుకొని అనుభవించడానికి సిద్ధపడినను, అట్లు చేయుట వలన ఋణము పెరుగుతుంది కాబట్టి తానే అనుభవించవలెను. అట్లు అనుభ వించవలసిన కర్మను పుణ్యక్షేత్రంలో సులభముగ త్వరితగతిన అనుభవించవచ్చును.

10. పతితుడైన వాడు కూడ కాశీవాసము చేస్తూ గంగా స్నానము, విశ్వేశ్వర దర్శనము నిత్యము చేస్తున్నట్లయితే అతని సమస్త దుఃఖాలను హరించి, అనుగ్రహిస్తానని విశ్వేశ్వరుడు ప్రతిజ్ఞ చేసియున్నాడు.

11. చిరకాలము గురుసేవ చేసినవారు, గురుభక్తితో జీవించుచున్నవారు కాశీ క్షేత్రంలో దేవతా దర్శనమునకు అర్హు లవుతారు.

12. కాశీ పుణ్యక్షేత్రానికి 'ఆనందవన'మని పేరు. ఈ క్షేత్రంలో భక్తితో జీవించువారికి శీఘ్రకాలంలో జ్ఞానోదయం అవుతుంది. తత్కారణంగా కాశీ క్షేత్రము అతనికి ఆనందవనంగా దర్శనమిస్తుంది.

13. కాశీలో చిరకాలం శ్రద్ధాభక్తులతో జీవించువారికి ధర్మాచరణ బుద్ధి, పాపాచరణ పట్ల అరుచి, సజ్జన సాంగత్యము, ప్రవృత్తియందు దానగుణము, అపరిగ్రహము, తృప్తి చేకూరు తాయి. జీవు డంతర్ముఖు డగుటకు వలసిన బలము లభిస్తుంది.

14. కాశీలో కలిని నిందించరాదు. కలిమలము కాశీ క్షేత్రమందు మాయావరణముగ నుండును. కలిమాయ చేతనే ఎక్కువ యాత్రికులు కాశీని సరిగా దర్శనము చేయజాలక ఉన్నారు.

పై విధంగా కాశీక్షేత్ర దర్శన ప్రాశస్త్యమును శ్రీ కుమార్ గారు బృందమునకు వివరంగా తెలియపరిచారు. అదేవిధంగా గంగానదీ స్నాన ప్రాముఖ్యతను కూడ వివరించారు. అది ఈ విధంగా ఉంది.

**గంగాస్నాన ప్రాముఖ్యత :**

1. కాశీక్షేత్రమందలి గంగానదిలో సప్త నదుల ప్రజ్ఞ కలదు.

2. అచ్చటి గంగ దర్శన, స్పర్శన, స్నానపానాదులు జీవుని పవిత్రీకరిస్తాయి.

3. అచట గంగ ప్రవహించే ప్రదేశంలో అనేకమైన శివలింగములు ఉన్నాయి.

4. గంగాస్నాన అనంతరము విశ్వేశ్వరుని దర్శించుట ఔచిత్యము. విశ్వేశ్వర అనుగ్రహము గంగా స్నానానంతరమే సులభం.

5. ప్రతిదినము యాత్రికులు గంగాస్నానము చేయుట ముఖ్యం. కనీసము గంగా దర్శనమైనను చేయవలెను.

ముందు తెలిపిన విధంగా కాశీక్షేత్ర మాహాత్మ్యమును వివరించిన తరువాత బృందమంతయు భోజనాదికములను గావించారు. బరంపురం సోదరబృందం ఉదయం 10 గంటలకే అందరికిని భోజనమును, త్రాగునీటిని భువనేశ్వరంలో రైలులో ఏర్పాటు గావించారు. భోజనాదికములు గావించుకున్న బృందము మధ్యాహ్నము విశ్రాంతి గొనినది. నాలుగు గంటల సమయంలో అందరికిని ముందుగా తయారు చేసి హైదరాబాదు, విశాఖ పట్నంల నుండి తీసుకువచ్చిన బూంది, చిప్స్‌లతోపాటు టీ, కాఫీలను యువకులు ఉత్సాహంతో ఏర్పాటు గావించారు. సాయంకాలానికి రైలు ఖడ్గపురం (ఖరగ్‌పూర్) చేరింది.

**ఖడ్గపురం బృందం :** ఖడ్గపూర్ రైల్వేప్లాట్‌ఫారం భారత దేశంలో కెల్ల అతి పెద్ద ప్లాట్‌ఫారం. రెండు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లు ఒక దాని వెనుక ఒకటి నిలచినా ఇంకా ప్లాట్‌ఫారం మిగిలే

ఉంటుంది. బృందంలో చాలామందికి అది ప్రథమ దర్శనం. ఉత్సాహంగా అందరూ ప్లాట్‌ఫారం చూస్తుంటే అంతకు పదిరెట్ల ఉత్సాహం కలిగించే రీతిలో దాదాపు వందమంది ఖడ్గపురం సభ్యులు సోదరులు జి.యస్.యన్.మూర్తిగారి నేతృత్వంలో ప్లాట్‌ఫారంమీద వేచియున్నారు. వారు యాత్రా బృందము నందరిని పుష్పమాలాలంకృతులను గావించారు. శ్రీ కుమార్‌గారి దంపతిని పుష్పమాలలతో ముంచివేసినారు. శ్రీసూక్తము, పురుషసూక్తము ఉచ్ఛైస్వరములతో గానం చేశారు. యాత్రా బృందమంతా నూతన తేజాన్ని పొందింది. ఖడ్గపురం బృందం భక్తిశ్రద్ధలను చూసి అందరు విస్తుపోయారు. సోదరులు శ్రీ పి. కామేశ్వరరావుగారు పుష్కరకాలం వారి కందించిన శిక్షణ వారిలో ఇనుమడించి కనిపించింది. యాత్రా బృందానికంతటికీ వారు విరివిగ రాత్రికి సరిపడ భోజనాలు ఏర్పాటు గావించారు. కమలాలు, ఏపిల్ పండ్లు, రసగుల్లాలు, ప్రత్యేకమైన పెరుగు కప్పులు, చపాతీలు, పెరుగన్నం అందించారు. అందించిన భోజనంలో మూడవ వంతు మాత్రమే బృందం తినగలిగింది. మిగతా పదార్థములన్నీ పేద వారికి మరునాడు వారణాసి రైల్వేస్టేషన్‌లో పంచబడ్డాయి. మాస్టర్ సి.వి.వి. గారు నిర్వర్తించిన భోజన కార్యక్రమములు బృందానికి గుర్తు వచ్చేటట్లుగ ఖడ్గపూర్ బృందం తన హృదయ సమృద్ధిని చాటి చెప్పింది. ఆ రాత్రి ఇష్టాగోష్ఠి కార్యక్రమంతో 10 గంటలకు ముగిసింది. అందరు భుక్తాయాసంతో నిద్రకు ఉపక్రమించిరి.

**12-11-2001** తెల్లవారుజామున 4 గంటలకే సభ్యులంతా రైలులో నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని గం॥ 5-15 ని॥ల కల్లా

గురుపాదుకాస్తవం, గణపతి సూక్తము, పురుష సూక్తము, శ్రీ సూక్తముల పారాయణ గావించినారు. తెలతెలవారుతుండగ ప్రార్థనా కార్యక్రమము, గాయత్రి మంత్రగానము నిర్వర్తించ బడింది. అతి ప్రాచీనమైన నాగరికతగల ఆర్యావర్తపు భూమిని సూర్యోదయ కాంతిలో పొగమంచుతో దర్శించటం జరిగింది.

ఆర్యావర్తము పుణ్యభూమి. అత్యంత పవిత్రమైనది. ఎన్నో దివ్య సంఘటనలు జరిగిన స్థలమది. వేదకాలం నుండి ఋషులు, తపస్విజనులు సంచరించిన ప్రదేశము. గంగానది నాగరికతతో దేదీప్యమానంగా భాసించిన ప్రదేశం. ప్రస్తుతం కాలప్రభావముచే అంతయు నివురుగప్పియున్న ప్రదేశము. పేదరికము, నిరక్షరాస్యత, సంఘ దురాచారములు కారణముగ నిద్రించుచున్న ప్రాచీన సంస్కృతి, భారతీయ ప్రాచీన సంస్కృతి యంతయు రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లయందు ఒకప్పుడు వెల్లివిరిసి ఆర్యావర్తపు ప్రభలను భూగోళమంతయు వెదజల్లినది. తక్షశిల, పాటలీపుత్రము, వారణాసి, మధుర, ఉజ్జయిని ఉత్తమోత్తమ విద్యాకేంద్రములుగ నుండెడివి. నేడీ ప్రాంతము లన్నియు అంతర్గతముగ అదే శోభను కలిగియున్నవి. చూచుటకు లోదృష్టి కావలెను. బహిర్గతముగ ఏమియు కనపడదు. అంతేకాదు, అనాగరికముగ కూడ కనిపించును. నిజమునకు ప్రస్తుతము భరత సంస్కృతి నివురు గప్పబడిన సంస్కృతి. పరమగురువుల దృష్టిలో భరతదేశము జ్ఞానజ్యోతిని అంతర్గతముగ ఇప్పటికిని కాపాడుచున్న దనియు, సమయము వచ్చినపుడు ఆ జ్యోతియే ప్రపంచమునకు దారి చూపునని పేర్కొనిరి.

జీవనపు లోతులు తెలిసినవారికి, లోదృష్టి కలవారికి ఆర్యావర్తమింకను స్ఫూర్తి నిచ్చుచునే యున్నది. పై మెరుగులకు, భ్రమలకు, పేలవమైన జీవనమునకు లోబడినవారికి భరత దేశము అనాగరికముగను, అపరిశుభ్రముగను గోచరించును. విలువైన విషయములన్నియు ఎప్పుడును గుప్తముగనే ఉంచబడును.

ఉత్తర ప్రదేశమందలి పుణ్యభూములను ఉదయ భానుడు స్పృశించుచుండగ చూచుచు పై భావములు హృదయమున మెదలిన శ్రీ కుమార్‌గారు గాయత్రి మంత్రగానమును ఇనుమడించిన భక్తిశ్రద్ధలతో గావించిరి.

వారణాసి సమీపించుచుండగ గంగానదిని దర్శించుటకై బృందమంతయు వేయి కనులతో ఎదురు చూచుచున్నది. భరత సంస్కృతికి గంగ, గోవిందుడు, గీత ప్రధాన చిహ్నములు. మహోన్నతమైన సంస్కృతి వెలసిన గంగానది తీరమందు పయనించి, నదిని దాటి వారణాసి పట్టణమున రైలుబండి ఆగినది. అందరు ఉత్సాహముతో రైలు నుండి దిగిరి.

**వారణాసి :**

ప్రప్రథమముగ వారణాసి రైల్వేస్టేషనులో, బృందములోని సభ్యులు అన్నదాన కార్యక్రమమును నిర్వర్తించినారు. ఖరగపూర్ సోదరబృందము అందించిన భోజనమంతయు మూడింట రెండువంతులు పంచబడినది. అటుపైన అందరును వారి వారి సామానులను అందుకొని సోదరులు శివశంకర్‌గారిచే ఏర్పరచిన

టాటాసుమో వేను లెక్కి జయపూరియా ధర్మ సత్రమును చేరుకొనినారు. ఈ సత్రము రామభక్తులచే ఏర్పరచబడినది. ఇచ్చట వసతి, భోజనము, స్నానపుగదులు అత్యంత పరిశుభ్రముగ నుండును. ఈ సత్రము దేవాలయమునకు రెండు వందల గజముల సమీపమున నుండును. దీనికి మూడువందల గజముల దూరములో దశాశ్రమేధ ఘట్టము. యాత్రికులకు గంగానది స్నానము, విశ్వేశ్వర దర్శనము, అన్నపూర్ణ దర్శనము, విశాలాక్షి దర్శనము అంతయు రెండు ఫర్లాంగుల దూరములో (400 గజముల పరిధిలో) నుండును. బృందమంతయు సత్రమును చేరి కాఫీ, టీ లను, దేహ పరిస్థితినిబట్టి కొందరు ఉపాహారమును గూడ సేవించిరి. అటుపైన అందరును ఉత్సాహముతో గంగా స్నానమునకు బయలుదేరిరి.

దశాశ్వమేధ ఘట్టమునుండి పడవల నేర్పాటు చేసుకొని గంగానది మధ్యనగల ఇసుకతిన్నెను చేరి అందరును స్నానమాచ రించుటకు ఉద్యుక్తులైరి.

**గంగాస్నానము :**

నదీ మధ్యమునగల ఇసుకతిన్నె తీరమున నీరు అంతః శుచి, బహిః శుచి కలిగియున్నవి. గంగ ఎప్పుడును పవిత్రమే. బహిర్ముఖముగ శుచి లేనట్లు గోచరించును. అది కేవలము మానవజాతి సంస్కార చిహ్నము. సృష్టిలో సొంతబుద్ధి కలవాడు మానవుడు. ప్రస్తుతము ఆ బుద్ధి దుర్వినియోగ మగుచున్నది. బహిర్ముఖమగు శుచిని ఆచరించుటయందు సగటు భారతీయు నకు శ్రద్ధలేదు. అశ్రద్ధ, నిర్లక్ష్యము, సమష్టి సంపదయందు

ఆదరము లేకపోవుట సగటు భారతీయుని లక్షణములు. వారి అశుచి, అపవిత్రత, మాలిన్యమే గంగా ప్రవాహముపై తేలుచు దర్శన మిచ్చుచుండును. శుచి, శౌచము కరువై చిత్తము మలినపడి, అంతఃకరణ అదృశ్యమై బాహ్య పటాటోపములందు జీవించు చున్న మానవులకు గంగాజల పవిత్రతను, దివ్యస్పర్శను పొందు అర్హత యుండదు. తా నపవిత్రుడు గనుక తన కదియే కనుల యందు గోచరించును. ఇది సత్యము. నిజమునకు గంగానది స్నానము ఉత్తేజమును కలిగించును. చేతన వికసించును. భావనామయ లోకము పవిత్రీకరింపబడును. శరీరము తేలిక యగును. మనసు సులభముగ దివ్యత్వమునకు ఉన్ముఖ మగును. ప్రతి జీవనది స్నానము ఇట్టి అనుభూతి కలిగించగలదు. గంగ విశేషించి అట్టి అనుభూతి కలిగించుటకు కారణము సర్వోత్కృష్టమైన హిమాలయ పర్వతముల నుండి ప్రవహించి వచ్చుటయే.

బృందమంతయు పంచాక్షరి మంత్రము, రుద్రసూక్తము పఠించుచు తూర్పు, ఉత్తర ముఖములుగ స్నానము చేసిరి. శ్రీ పార్వతీకుమార్‌గారు, వారి కుమారుడు పూజావేదిక యందలి (మునుపు తెలిపిన) శివలింగములను, సాలగ్రామములను, విగ్రహములను వెండి పళ్ళెములో నిడుకొని, రుద్రనమకము పారాయణము గావించుచు, అభిషేకము నదిలో నిలబడి గావించిరి. అది గమనించిన కొందరు సభ్యులుకూడ అభిషేకము గావించిరి. స్నానము శ్రద్ధాభక్తులతో సభ్యులందరు గావించు కొనిరి. ఒకరిద్దరు మాత్రము (వయసుతో సంబంధము లేని) చిన్నతనము వలన నదిలో ఆడిరి.

## శ్రీ విశ్వేశ్వరుని దర్శనము :

అందరును స్నానమాచరించిన వెనుక 12 గంటల సమయమునకు విశ్వేశ్వరుని దర్శనమునకై దేవాలయమును చేరిరి. మధ్యాహ్నము 12 గంటల సమయమున విశ్వేశ్వరాలయమున మహా నైవేద్యము జరుగుచున్నది. బృందమంతయు పంచాక్షరి మంత్రమును గానము చేయుచు ముఖ మండపమున వేచియుండిరి. మహానైవేద్య మనంతరము అందరును దైవ దర్శనము గావించుకొనిరి. ఆ రోజు సోమవారము, ద్వాదశి తిథి, కృష్ణ పక్షము. చంద్రుడు హస్తా నక్షత్రయుక్తుడై యుండెను. కుంభలగ్న ఘడియలలో బృందమున కంతయు విశ్వేశ్వర దర్శనము జరిగినది.

శివదర్శనముతో స్ఫూర్తి చెందిన బృందము సమీపమున గల శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయమునకు బయలుదేరిరి. అన్న పూర్ణాలయమున, అన్నపూర్ణ దర్శనము కూడ వివరముగ జరిగినది.

విశ్వేశ్వరాలయమున విశ్వేశ్వరుడు గర్భాలయ ఈశాన్య భాగమున మూడడుగుల లోతున యుండును. అందరును మోకాళ్లపై కూర్చొని వంగి లింగమును స్పృశించి నమస్కరించు కొనవచ్చును. అన్నపూర్ణాలయమున పార్వతీదేవి శివునకు భిక్షనొసగు భంగిమలో నుండును. అందుచేతనే ఆమె 'అన్నపూర్ణ' అని పిలువబడుచున్నది. కాశీక్షేత్రమున విశ్వేశ్వరుడు మోక్షప్రదాత. అతడు ఆత్మల నుద్ధరించి పరమాత్మ తత్త్వమునకు చేర్చును. అన్నపూర్ణదేవి వరప్రదాత. దేహధారియైన జీవునకు వృద్ధి, సంవృద్ధి

కలిగించి జీవనము సుఖప్రదము చేయును. జీవుల దేహములను సంరక్షించుట, వృద్ధిచేయుట, స్వస్థత నందించుట అమ్మ పని. ఆత్మ తత్త్వములోనికి ఉద్ధరించుట అయ్య పని.

కాశీ క్షేత్రమందలి విశాలాక్షిదేవి శక్తి స్వరూపిణి. ఆమె శక్తిప్రదాత. కాలభైరవుడు సంకట మోచనుడు. జీవులకు కలుగు సంకటములను నిర్మూలించువాడు. ఢుంఢి గణపతి విఘ్నేశ్వరుడు. అతడు విఘ్నములను తొలగించును. ఈ ఐదు దేవాలయములు కాశియందు ముఖ్యములు. బృందము విశ్వేశ్వరుని, అన్నపూర్ణను దర్శించుకొని విశ్రాంతి గృహము చేరి భోజనము గావించుకొని విశ్రాంతిని గొనిరి.

విశ్రాంతి అనంతరము బృందము స్ఫూర్తివంతముగ నుండుటచే అందరును సాయంత్రం 4 గంటలకు గంగాతీరము చేరిరి. దశాశ్రమేథ ఘట్టము నుండి నావలో నది మధ్యన గల ఇసుకతిన్నెలను చేరిరి. సాయం సమయమున మరల అందరు గంగా స్నానము గావించిరి. ఇసుకతిన్నెలపై సర్వాంగ సుందర ముగా పూజావేదికను ఏర్పరచిరి. సూర్యుడు పశ్చిమమున అస్తమించుచున్న సమయమున బంగారు కిరణములను ప్రసరింపజేయుచుండగ, ఉత్తేజముగ భవానీ శంకరుల షోడశోప చారపూజ జరిగినది. మహామృత్యుంజయ మంత్రమును పఠించుచు బృందమంతయు మారేడు దళములను శివునకు సమర్పించిరి. ఆ సాయం సమయమున జరిగిన రుద్రాభిషేకము బృందమందలి సభ్యులకు దివ్యానుభూతి కలిగించినది. అందరును అలంకరింపబడిన శివుని, లక్ష్మీనారాయణులను,

శ్రీ కృష్ణుని గాంచుచు చాల తడవు తదేకదృష్టితో నుండిరి. స్త్రీలు భక్తిశ్రద్ధలతో ఏర్పరచిన సహస్ర దీపముల కాంతిలో దైవము పరిపూర్ణముగ అందరిని అనుగ్రహించు చున్నట్లుగ గోచరించినది. ఆ సాయంకాలము జరిగిన మైత్రేయ స్తోత్ర పఠనము ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగించినది. చల్లని గాలి మందస్మిత ముగ బృందమును తాకినది. ఆకాశమున నిర్మలముగ తారలు మిరిమిట్లు గొల్పుచున్నవి. సూర్యుడస్తమించి చీకటియను దివ్య స్త్రీ ఆవరించగా నదీమధ్యము నుండి కాశీ క్షేత్రమును గంగా తీరమున గమనించినపుడు ఆనందము అవధులు దాటినది. కాశీక్షేత్రము సమస్త తీర్థములతో, కాంతులతో మిరిమిట్లు గొల్పుచు బృందము హృదయములను ఆకర్షించినది.

పూజానంతరము బృందమంతయు మరల క్షేత్రమును చేరి విశ్వేశ్వరుని, అన్నపూర్ణాదేవిని ప్రశాంత వాతావరణమున దర్శించిరి. అన్నపూర్ణాలయమున లలితా సహస్రనామ పారాయణ మును గావించి జ్యోతులను వెలిగించిరి. విశ్వేశ్వరుని ఆలయ మందు, అన్నపూర్ణ ఆలయమునందు బృందము చూపిన క్రమ శిక్షణ, చేసిన వేదగానము, స్తోత్రపఠనము దేవాలయ పురోహితుల నాకర్షించి, ప్రత్యేక సమీప దర్శన, స్పర్శనములకు దారిచూపినది. అన్నపూర్ణాలయమున బృందమునందలి సభ్యులు వారి వారి భక్తి మేరకు అన్నదాన పథకములకు విరాళముల నొసగిరి. బృందమంతయు కలిసి భూరివిరాళముల నందించిరి.

అటుపిమ్మట శక్తిస్వరూపిణియగు విశాలాక్షి ఆలయము నకు చేరి స్తోత్రగానము చేసి దర్శన భాగ్యమును పొందిరి. 9

గంటల ప్రాంతమున ధర్మసత్రమును చేరి ఉపాహారమును గైకొని నిద్ర కుపక్రమించిరి.

## ప్రయాగ తీర్థము :

**13-11-2001** మంగళవారము త్రయోదశి, చిత్తా నక్షత్ర కాలము. తెల్లవారుజామున బృందము 3 గంటలకే నిదురలేచి కాలకృత్యములు గావించుకొని 4 గంటల సమయమునకు ముందుగా ఏర్పరచిన రెండు బస్సులలో అలహాబాదు సమీపమున గల ప్రయాగ తీర్థమునకు జనిరి. ప్రయాణమున నిత్యము కావించు వేదసూక్త పారాయణము, సహస్రనామ స్తోత్రపారాయణము భక్తిశ్రద్ధలతో గావించిరి. అటుపైన మంగళవారమగుటచే పదునొకండుమార్లు హనుమాన్ చాలీసాను పఠించిరి. ఆ రోజు మాసశివరాత్రి మరియు సాయంకాలము నరక చతుర్దశి ప్రారంభం.

ప్రయాగ తీర్థము, త్రివేణి సంగమ తీర్థముగ అనాది కాలము నుండి ఆస్తికులచే ఆరాధింపబడుచున్నది. అశోకుని కోట తీరమున చంద్రగుప్తమౌర్యుల ప్రాభవము, ప్రతిష్ఠ చాటునట్లుగ ఈనాటికిని గోచరించుచుండును. అచట నిలబడి ప్రయాగ తీర్థమును చూచిన బృందమునకు మహత్తరమగు త్రివేణీ సంగమ దృశ్యము శాంతగంభీర దివ్య చేతనమువలె గోచరించినది. శరదృతువు, కార్తీకమాసము అగుటచే జలము లత్యంత నిర్మలములై తోచినవి. ఆవలి తీరము అగుపింపనంత విశాలమై గంగ నిర్మలముగ, నిశ్శబ్దముగ, అతినెమ్మదిగ ప్రవహించుచున్నది. ఆకాశము, నీరు కలసిన తీరము దృశ్యాదృశ్యముగ ఏర్పడినది. ఆనాటి ఉదయము ప్రయాగ తీర్థము అనుగ్రహించిన దర్శనము

విశ్వకర్మయొక్క నైపుణ్యమును ప్రతిబింబింప జేసినది. భూమ్యా కాశముల నడుమగల జీవులు అణువులవలె గోచరించిరి.

బృందమంతయు తీరమును చేరి నావలెక్కి సంగమ ప్రదేశమునకు ప్రయాణమైరి. ఆనాటి గంగ నిర్మలమైన జలముతో విశాలమైన తటాకమువలె గోచరించి బ్రహ్మమానస సరోవర మును మరపింపజేసినది. నీటియందు వందలాది స్వచ్ఛమైన తెలుపురంగు పక్షులు రాజహంసలవలె తేలియాడుచు స్వాగత మును పలికినవి. బృందములోని కొంతమంది సభ్యులు ఉత్సాహ వంతులై పక్షులకు ఆహారమందించిరి. నలుబది నిముషముల ప్రయాణము, ఆ ఉదయ సమయమున ముహూర్తకాలముగ గోచరించినది. ఉదయారుణ కాంతులు ప్రవాహమున ప్రతిబిం బించుచు చూపరుల కనులకు ఆనందము కలిగించినది. నావయందు శ్రీ కుమార్‌గారు గద్గద స్వరముతో మైత్రేయ స్తోత్రమును గావించిరి. ప్రయాగ తీర్థము మైత్రేయ నివాసముగ అభివర్ణించిరి. భాగవతోత్తముడైన విదురుడు, జగద్గురువైన మైత్రేయుని ప్రయాగ తీర్థమునందు దర్శించుట, భాగవతోప దేశమును పొందుట సభ్యులకు వివరించి తీర్థ మాహాత్మ్యమును వివరించిరి.

గంగ, యమున, సరస్వతి మహానదుల సంగమ ప్రదేశము ఇడ, పింగళ, సుషుమ్న చైతన్యముల సమాగమముగ వివరించిరి. సరస్వతి అంతర్వాహినియై ప్రవహించుటను గమనింపుడని స్నానము చేయుటకుముందు అందరిని హెచ్చరించిరి. ఆ చేయు స్నానము అత్యంత పవిత్రతను చేకూర్చగలదని, శ్రద్ధాభక్తులతో

స్నాన మాచరింపుడని హెచ్చరించిరి. అందురును ప్రయాగతీర్థ మున త్రివేణి సంగమమున భక్తిశ్రద్ధలతో స్నాన మాచరించి తృప్తి చెందిరి. సరస్వతి అంతర్ ప్రవాహమును అనుభూతి చెందిరి. శిరస్సునంతను నీటిలో ముంచి స్నానము చేయుటలో కొందరు ఇడ, పింగళ, సుషుమ్న ప్రవాహ చైతన్యముల వర్ణములు (శ్వేత ఆకుపచ్చ, బంగారము, నీలిరంగులు) దర్శించిరి.

స్నానము చేయు బృందములో ఒక పుణ్య స్త్రీని స్పృశించిన చైతన్య మామెకు స్మృతి లోపము గావించెను. ఆమె వివశయై, మలమూత్రములను విసర్జించి మూర్ఛిల్లెను. ఆమె భర్త ఆందోళన చెందుచుండగ, శ్రీ కుమార్‌గారు భ్రూమధ్యమును స్పృశించి గురుస్మరణ గావించిరి. ఆమె క్రమశః స్మృతి చెందినది. ఆమె విసర్జించిన మలమూత్రములతో కూడిన వస్త్రమును తీసి, ఆమెను, నావను శుభ్రపరచి ఆమెకు మరల నూతన వస్త్రములను ధరింప జేసిన సోదరి ఒకరు తన సేవా తత్పరత, సమభావముతో సోదర బృందమును ఆశ్చర్యచకితులను గావించినది. ఆ సమయమున లోకహితులగు మాస్టరుగారు ఆ సోదరిని హృదయపూర్వకముగ తృటికాలములో ఆశీర్వదించి అదృశ్యమైరి. బృందమంతయు నావలపై తిరుగు ప్రయాణమున తీరమును చేరిరి. అప్పటికి సమయము 9 గంటలు దాటినది. తీరమున సూర్యుని వెలుగు తీవ్రముగ నుండెను. క్రిందటి సాయంకాలము గంగానది ఇసుక తిన్నెలపై జరిగిన శివపూజనము అందరి హృదయములందు లోతైన ముద్ర వేయుటచే ప్రయాగతీరమున కూడ, ఎండ తీవ్రముగ నున్నను శివపూజనమునకు బృందము ఉత్సహించి

నది. మరల సభ్యులు కొందరు పూజావేదికను ఏర్పాటు గావించిరి. రెండు గంటలసేపు అభిషేకము, శివ పూజనము సాగినవి. ఎండబారి నుండి బృందమును కొంత పరిరక్షించుటకు యువకులు కొందరు దుప్పట్లను ఆచ్ఛాదముగ నేర్పరచినారు. పూజనము స్ఫూర్తిమంతముగ సాగినది. పూజా సమయమున ఒక స్త్రీ మూర్తికి ప్రయాగ తీరమంతయు సాలగ్రామ శిలలతో నిండినట్లుగ దీర్ఘకాలము దర్శన మిచ్చినది. పూజాదికములు పూర్తియగుసరికి సమయము 11 గంటలకు చేరువైనది. అందరికిని అమితమగు ఆకలి కలిగినది. వివేకవంతులైన కార్య కర్తలు కొందరు ఆ సమయమునకే తీరమువద్దకు ఉపాహారము, కాఫీలను కొనివచ్చిరి. అందరును సేవించి, దైహికముగ కూడ తృప్తి చెందిరి. అటుపైన మరల అశోకుని కోటవద్ద నిలుప బడిన బస్సులలో అలహాబాదు నగరమును చేరిరి. నగర పర్యటనము గావించుకొని భోజన సమయమునకు జవహర్‌లాల్ నెహ్రూ నివాస భవనమైన ఆనంద భవనమును చేరిరి. అచటనే గల హోటలునందు భోజనము గావించిరి. కొంత విశ్రాంతిగొని మరల కాశీమీదుగా బుద్ధ క్షేత్రమగు సారనాథ్‌కు నాలుగుగంటల ప్రయాణమును చేసిరి.

## సారనాథ్ :

గౌతమబుద్ధుడు సిద్ధుడై ఆర్యావర్తమున మొట్టమొదటిగా కాశీక్షేత్ర సమీపమున గల సారనాథ్‌నందు దివ్యప్రబోధము గావించెనని చరిత్ర తెలుపుచున్నది. బుద్ధుని సంస్పర్శ చేత, వాక్కుచేత పవిత్రమైన ఆ పుణ్య ప్రదేశమును అశోక చక్రవర్తి

కాలము నుండి భారతీయులు సంరక్షించుకొనిరి. ఆ ప్రదేశ మంతయు ఈనాటికినీ, బౌద్ధ ముని సంఘములు పవిత్రముగ నుంచినారు. ఆకర్షణీయమగు ఉద్యానవనమువలె తీర్చిదిద్దినారు. కేంద్రమున ఒక రమణీయమగు దేవాలయము నిర్మించి అందు ఎత్తైన ఆసనమున, మనోహరమగు గౌతముని బంగారు విగ్రహము నేర్పరచినారు. దేవాలయము మరియు పరిసర ప్రాంతము అంతయు ప్రశాంతతను విరజిమ్ముచు నుండును. ఉదయము నాలుగు గంటలనుండి తీరుబడి లేక యాత్రను సాగించిన బృందము, బుద్ధుని ఉద్యానవనమున సేద దీర్చుకొని నది. సాయంకాల సమయమున అచ్చటి వాతావరణము దేహమునకు, మనస్సుకు ఆహ్లాదము కావించినది. అందరికిని బౌద్ధ సన్యాసులు ఏలకుల సువాసనతో కూడిన వేడివేడి తేనీరు అందించిరి. అటుపైన క్షేత్రము నంతటిని దర్శించుట జరిగినది. గౌతముడు ప్రథమముగ ఉపన్యసించిన ప్రదేశమున ఒక మఱ్ఱి చెట్టును ఏర్పరచిరి. బృందము కోరికమేరకు శ్రీ కుమార్‌గారు గౌతమబుద్ధుని అవతరణము, ఆవశ్యకత, సిద్ధాంతము మొదలగు విషయములను వివరించిరి.

కాశీక్షేత్రమునందలి వాతావరణమునకు, సారనాథ్ క్షేత్రము నందలి వాతావరణమునకు అమిత వ్యత్యాసము కలదు. కాశీ యందలి దివ్యత్వము నిగూఢము. సారనాథ్ యందలి పవిత్రత ప్రస్ఫుటము. కాశీయందు లోదృష్టి గలవానికే అనుభూతి. అది అంతఃకరణ శుద్ధికి సంబంధించిన విషయము. కాశీయందలి దివ్యత్వపులోతు అనూహ్యము. అనుభవించువారి ఆనందము

అపరిమితము. సారనాథ్ బహిర్గతము కాబడిన దివ్యత్వమువలె బహిఃకరణములను ముందు అలరించును. అటుపైన సాధకులు ఆత్మానుభూతికై ప్రయత్నించవలెను. సారనాథ్ క్షేత్రము తీర్చిదిద్ద బడిన ఉద్యానవనమైతే, కాశీ మహాక్షేత్రము నైమిశారణ్యమువలె దుర్భేద్యము. కాశీయందు అనుభూతికి జీవుని అన్వేషణ అత్యవసరము. సారనాథ్ యందు అన్వేషణకు శ్రమ అవసరము లేదు కాని లోతైన అనుభూతికి ప్రయత్నము తప్పదు. ఒక క్షేత్రము నిగూఢము, అవ్యక్తమై యుండగా, మరియొక క్షేత్రము వ్యక్తమైన దివ్యత్వముగ గోచరించును. సారనాథ్ క్షేత్రము రాముని చరిత్రవలె విస్పష్టము. కాశీ మహాక్షేత్రము కృష్ణుని చరిత్రవలె అనూహ్యము.

సారనాథ్ దివ్య క్షేత్ర దర్శనమైన వెనుక బృందమంతయు 9 గంటలకు కాలభైరవ దర్శనార్థమై కాశీ పట్టణమును చేరిరి.

**కాలభైరవ దర్శనము :**

కాలభైరవుడు కాశీ దివ్య క్షేత్రమునకు క్షేత్రపాలకుడు. నిజమునకు క్షేత్రమున కాలుమోపు సమయముననే కాలభైరవుని స్మరించి, నమస్కరించి, అనుమతి పొంది కాలూనవలెను. అది సంప్రదాయము. ప్రతి క్షేత్రమునకు క్షేత్రపాలకుడుండును. ఆ క్షేత్రమున ప్రవేశించినపుడు, ఆ క్షేత్రపాలకుని స్మరణము చేయ వలెను. దర్శనము గూడ చేయవలెను.

కాలభైరవుడు కాశీనగరమున గ్రామసింహము (కుక్క) రూపమున తిరుగాడు చుండును. జీవుల ప్రవర్తనమును

కనిపెట్టుచుండును. సాక్షీభూతుడుగా క్షేత్రమునంతను వ్యాపించి పరికించు చుండును. అతని అనుగ్రహము లేనిచో కాశీయందు దేవ దర్శనము, గంగా స్నానము, జపతపాదులు సానుకూలపడవు. సీతారామ లక్ష్మణ పరివార దర్శనమునకు హనుమంతుడెట్లు ముఖద్వారమో, సమస్త దేవతా దర్శనమునకు గణపతి ఎట్లో, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి మరియు విశ్వేశ్వరుల దర్శన సౌలభ్యమునకు కాలభైరవుడట్లు.

బస్సులు దిగి బృందము ఐదారుగురు ఒక గుంపుగా కాలభైరవ ఆలయ మార్గమును బట్టిరి. శ్రీ కుమార్‌గారితో నడచు చున్న మార్గమున ముందుగా జాతికుక్క ఒకటి అవిరామముగా మేడపై నుండి మొరిగి స్వాగతము పలికినది. ‘‘ఇది శుభ శకునమే. జాతికుక్క రూపమున కాలభైరవుడు సాదరముగ ఆహ్వానించుచున్నాడు.’’ అని శ్రీ కుమార్‌గారు పలికిరి. అటుపైన ఆలయ ప్రాంగణమువద్ద పూర్ణగర్భిణియగు మరియొక జాగిలము వారిచుట్టునూ ప్రదక్షిణము గావించుచు వెడలిపోయినది. ఆలయమున ప్రవేశించిన శ్రీ కుమార్‌గారికి సరాసరి కాలభైరవ గర్భాలయములోనికి ప్రవేశ మేర్పడినది. గర్భాలయము నందు కాలభైరవుడు, పురోహితుడు తప్ప మరెవరును లేరు. తమ వెంట వచ్చిన వారితో కలసి శ్రీ పార్వతీకుమార్‌గారి దంపతి గర్భాలయమున ప్రవేశించి, కాలభైరవాష్టకమును ఉచ్ఛైస్స్వరమున శ్రద్ధాభక్తులతో పఠించిరి. పురోహితుడు కూడ ఆనందముగ స్వరము కలిపెను. కాలభైరవుని పాదములను నుదిటితో స్పర్శించి, నమస్కరించుకొనుటకు అనుమతి నిచ్చెను. అందరును కాల

భైరవుని చరణములను నుదిటితో స్పృశించి పొంగిన హృదయ ములతో ఈవలకు వచ్చిరి. ఆలయమున మణికట్టులను ధరించు కాశీత్రాడును బంధుమిత్రులకు గూడ సరిపోవునట్లుగా కొనుగోలు చేసి కాలినడకనే బయలుదేరి జయపూరియా ధర్మ సత్రమును చేరి, ఆహారమును స్వీకరించి విశ్రమించిరి.

13, నవంబరు మంగళవారం, చిత్తా నక్షత్రము, త్రయోదశి, చతుర్దశి తిథులతో కూడిన ఆ రోజు బృందమెంత శ్రమపడినదో, అంత ఆనందమును కూడ పొందినది. ప్రయాగకు మూడు గంటలకే లేచి ప్రయాణమగుట, సంగమ పుణ్యస్నానము, శివ పూజనము, సారనాథ్‌కు ప్రయాణము, గౌతమబుద్ధ దర్శనము, కాశీకి ప్రయాణము, కాలభైరవ దర్శనము ఆనాటి కార్యక్రమము. మరునాడు దీపావళి. విశ్వేశ్వర దర్శనమునకు తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయము వద్ద ఉండుటకై ఉత్సహించుచు, రాత్రి 12 గంటలకు బృందము నిదుర కుపక్రమించినది.

**14 నవంబరు 2001** ఆశ్వయుజ కృష్ణ చతుర్దశి మరియు అమావాస్య తిథులతో కూడిన పర్వదినము, బుధవారము, స్వాతీ నక్షత్రయుక్తమైనది. నరకచతుర్దశి, దీపావళి కలసివచ్చిన పుణ్య దినము. కాశీ మహాక్షేత్రము నందు దీపావళి అమావాస్య అత్యంత ముఖ్యమైన పర్వదినముగ పరిగణింపబడుతున్నది. ప్రత్యేకముగా ఈ రోజునకై దూరప్రాంతము లందలి భక్తులు విశ్వేశ్వరుని దర్శనమునకై ఏతెంతురు. కాశీపట్టణము సహజముగనే క్రిక్కిరిసి ఉన్న పట్టణము. ఈ పర్వదినమున కనీసము 5 లక్షలమంది ప్రజానీకము వివిధ ప్రాంతముల నుండి ఏతెంచి గంగాస్నాన

మొనరించి, విశ్వేశ్వరుని దర్శించి, అన్నపూర్ణా విశాలాక్షిల ఆశీర్వచనము పొంది, సాయంసమయమున గంగామాతకు హారతినిచ్చి, అర్ధరాత్రి సమయమునకు వారివారి ప్రాంతములకు తిరిగిపోవుదురు.

కాలయోగమున మన బృందము ఈ పర్వదినమున కాశీక్షేత్రమున యుండుట జరిగినది. సోదరులు శ్రీ శివశంకర్ ముందుగా చేసిన శ్రద్ధాపూర్వక ప్రయత్నము కారణముగా ప్రప్రథమ దర్శనము విశ్వేశ్వరాలయమున మన సోదరబృందము నకు అనుగ్రహింపబడినది. అందులకుగాను బృందమంతయు తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతమున దేవాలయ ముఖ ద్వారమున బారులు తీరి నిలుచుటకు సంకల్పింపబడినది. బృందమంతయు ముందురోజు రాత్రి 12 గంటలకు నిద్రించిన వారు రెండు గంటలకే లేచి కాలకృత్యములు తీర్చుకొని, స్నానాదికములు గావించి, వేదసూక్తములను పఠించుచు కాశీ విశ్వేశ్వరాలయ ముఖద్వారమున బారులు తీరి వేచియుండిరి. సరిగా 4 గంటలకు లోనుండి ముఖ్య పురోహితులు ద్వారము తెరిచి బృందమునంతను ముందుగా వరుసగా లోనికి పంపినారు. గర్భాలయమున శ్రీ కుమార్‌గారు కుటుంబము నుత్తిష్ఠింపజేసి రుద్రసూక్త పారాయణతో బృందమంతయు అభిషేకము గావించు కొనినారు. ముందు ఆలోచనగల సభ్యులు దాదాపు రెండు పీపాల ఆవుపాలను గర్భాలయములోనికి తెచ్చినారు. అందరును తృప్తిగా కాశీ విశ్వేశ్వర లింగమునకు ఆ పర్వదినమునాడు క్షీరాభిషేకము గావించుకొనినారు. సభ్యుల ఆనందమునకు

అవధులు లేకపోయినవి. ఒక గంటసేపు పై విధముగ ఆలయ మున ప్రత్యేకించి ఆ దినమున అభిషేకము గావించుకొనుట ఈశ్వరానుగ్రహమే. అది సద్గురు అనుగ్రహముగ నిర్వర్తింప బడినది. పై కార్యక్రమమునకు దోహదకారియైన సోదరులు శివశంకర్‌ను సభ్యులందరు కొనియాడిరి. ఆలయము నుండి ఈవలకు వచ్చిన బృందమునకు ఆలయ పురోహితులు ఆశీః పూర్వకముగ విశ్వేశ్వరుని చిత్రపఠము, విభూతి, చందనము అందించిరి. ఆ రోజున ప్రత్యేకముగ కైలాసేశ్వరుని ఆలయము తెరువబడునట. ఆ ఆలయమునకు గూడ పురోహితులు దారి చూపించి ప్రథమ దర్శనమును అనుగ్రహించినారు. ఈ ఆలయ మున శివపంచాయతనముగ ఈశ్వరుడు, గౌరి, గంగ, గణపతి, కుమారస్వామి వారివారి వాహనములతో విలసిల్లు చుందురు. తద్దర్శనమును గావించుకొనిన బృందమునకు పురోహితులు విశ్వేశ్వరుని ప్రసాదమును గొనివచ్చి బృందముచే స్వీకరింపజేసి దైవదర్శనా కార్యక్రమమును పరిపూర్తి కావించిరి. విశ్వేశ్వరాలయ మున పురోహితులు మన బృందముయొక్క క్రమశిక్షణను, రుద్రసూక్త పారాయణమును హృదయపూర్వకముగా శ్లాఘించిరి.

విశ్వేశ్వర దర్శనమును పై విధముగ గావించుకొని బృందము సంతుష్టితో అన్నపూర్ణాలయమునకు బయలుదేరిరి.

**బంగారు అన్నపూర్ణ దర్శనము :**

పర్వదిన మగుటచే అన్నపూర్ణాలయమున బంగారు అన్నపూర్ణ దర్శనమునకు కూడ తలుపులు తెరువబడినవి. సంవత్సరమున మూడు, నాలుగు పర్వదినములలో మాత్రమే

బంగారు అన్నపూర్ణ దర్శనము అందరికి అనుగ్రహింపబడునట. ప్రతినిత్యము శివుడు అన్నపూర్ణాలయమునకు విచ్చేసి భిక్షను గొని మరల తన తపస్సునకు ఉపక్రమించునని ఇచ్చటి ప్రధాన భావము. అందుచే భిక్షాపాత్రధారియై విశ్వేశ్వరుడు నిలుచుండ, భిక్ష నందించుచూ అన్నపూర్ణాదేవి నిలబడి యున్నది. జగన్మాత జగదీశ్వరునకు భిక్ష యొసగుట అనగా సర్వలోకములకు, లోకస్థులకు కూడ భిక్ష యొసగుచున్నదని విశేష భావము. అందుచేతనే జగన్మాతను ఈ ఆలయమున 'అన్నపూర్ణ' అని సంబోధింతురు. సకల సమృద్ధికి అధిష్ఠాన దేవతగా అన్నపూర్ణాదేవి విరాజిల్లుచున్నది. అన్నపూర్ణాదేవి మూలవిగ్రహము దగ్గరకు మరియు బంగారు అన్నపూర్ణ వద్దకు సన్నిహిత దర్శనము బృందమునకు అనుగ్రహింపబడినది. అందరును దర్శనము గావించుకొని ప్రసాదమును స్వీకరించి అన్నదాన పథకమునకు శక్తి మేరకు రుసుమును చెల్లించిరి. అప్పటికి క్రమశః తెల్లవారుట జరిగినది.

బృందమంతయు ఉదయ కాంతులలో కాశీ పట్టణము ననే గల సంకటమోచన హనుమంతుని ఆలయమునకు ఉత్సాహముగ బయలుదేరిరి. శరదృతువు, ఉత్తరాది అగుటచే వాతావరణము చాల ప్రసన్నముగ గోచరించినది.

**సంకటమోచన హనుమంతుని దర్శనము :**

సంకట మోచన హనుమంతుడు ప్రసిద్ధ రామభక్తుడైన తులసీదాసు గోస్వామిని అనుగ్రహించినవాడు. తులసీదాసు ఈ హనుమంతుని సాన్నిధ్యముననే హనుమాన్ చాలీసాను అనుగ్రహ

ముగ పొంది ప్రపంచమున కందించినారు. ఈ దేవాలయముననే ఉండి 'రామచరిత మానస్' అను పేరున హిందీ భాషయందు రామాయణమును రచించినాడని కూడ తెలుపుదురు. కాశీ పుణ్య క్షేత్రమున విశ్వేశ్వరున కెంత ప్రాముఖ్యము గలదో సంకటములను విమోచనము గావించు హనుమంతునికి గూడ అంత ప్రాముఖ్యమును గలదు. ఈ దేవాలయపు ప్రాంగణము విస్తారముగ నుండును.

మన సోదరబృందము భాగ్యమెట్టిదోగాని పై తెలిపిన పుణ్యతిథి (చతుర్దశి, దీపావళి) హనుమంతుని జయంతిగా ఉత్సవము జరుపుకొందురట. గుడియంతయు సర్వాంగ సుందరముగా అలంకరింపబడినది. తండోపతండములుగా హనుమద్భక్తులు గుడియందు చేరియున్నారు. తాళములు, తప్పెట్లు, బృందగానములు, నృత్యములు అమితోత్సాహముగ జరుగుచున్నవి. బృందమంతయు ప్రథమ దర్శనము గావించుకొని ఆగ్నేయముగ నున్న ఒక మండపమున చేరి శ్రీ కుమార్‌గారి నేతృత్వమున పదునొకండు మార్లు హనుమాన్ చాలీసా గానమును చేసిరి. బృందము స్వరము, ముక్త కంఠము మరియొక భక్త బృందము నాకర్షించినవి. వారును అదే స్వరము ననుసరించుచూ, తప్పెట్లతో, తాళములతో, తబలాలతో, గానము చేయుచు నృత్యము గూడ చేసినారు. మనబోటి వారందరికిని అదియొక వినూత్నమైన స్ఫూర్తి. హనుమద్భక్తుల ఉత్సాహముతో గూడిన గానము బృందమునకు వర్ణనాతీతమైనది. ఆనందము కలిగించినది. హృదయము పొంగి ఆనంద బాష్పములు కురిసినవి.

ప్రార్థనానంతరము అందరును హనుమంతుని ప్రసాదమును గైకొనిరి. ముఖద్వారము వద్ద ఎన్నియో బృందములు ఎన్నో రకములుగ తీపి, కారము పిండి వంటలను, కాఫీ, తేనీరును విరివిగ పంచినారు. ప్రసాద వితరణము విషయమున ఉత్తరాది వారికి గల విశాల హృదయమును చూచి బృందమంతయు విస్తుపోయిరి.

అటుపైన దగ్గరనే గల దుర్గాదేవి ఆలయమును కూడ దర్శించి 9 గంటల ప్రాంతమునకు విశాలమగు రామ ప్రార్థనా మందిరమును చేరిరి. కార్యకర్తలు అచ్చటికి అందరికిని ఉపాహారము గొనివచ్చిరి. కాశీపట్టణమునగల ఒక దక్షిణ బ్రాహ్మణ హోటలు నుండి ప్రతిదినము ఉదయము ఇడ్లీ, వడ ఇత్యాది పదార్థములను కార్యకర్తలు ఉపాహారముగ నేర్పరచి ఆత్మారాముని సంతృప్తిపరచిరి. ఉపాహారము గైకొన్న బృందము రామ మందిరమును అంతటిని పరిశీలనాత్మకముగ దర్శించి విశ్రాంతిగొని మెల్లగా ధర్మసత్రమును చేరిరి.

మరల మధ్యాహ్నము వరకు కార్యక్రమమేమియు నిర్దిష్ట ముగ లేకపోవుటచే క్షేత్రమున స్ఫటిక లింగములు, రుద్రాక్ష మాలలు, సాలగ్రామములు ఇత్యాది వస్తు సేకరణకు ఎవరికి వారుగ ఉపక్రమించిరి. భోజనానంతరము విశ్రాంతి గొనిరి.

## త్రైలింగస్వామి దర్శనము :

తెలుగుజాతి అదృష్టవశమున ఆ జాతియందు ఉద్భవించి జగద్గురువై, మహనీయులకు గూడ మార్గదర్శకులుగ నిలచిన

త్రైలింగస్వామి సమాధి కాశీపట్టణము నందలి గంగాతీర ఘట్టము లలో అత్యంత ప్రధానమైనది. రామకృష్ణ పరమహంస, లహరీ మహాశయులవంటి యుగపురుషులు సైతము త్రైలింగస్వామి దర్శనము గావించుకొని వారి అనుగ్రహము పొందిరి. దాదాపుగ మూడు శతాబ్దములు ఒకే దేహమున నుండి ఎందరో యోగి పుంగవులకు, మహనీయులకు, మహాత్ములకు, సిద్ధులకు దారి చూపిన జగద్గురువు త్రైలింగస్వామి. యోగులు, ఆత్మదర్శనాభి లాషులు, భక్తులు, జ్ఞానులు, వైరాగ్య సంపన్నులు అందరును బ్రహ్మత్వము పొందుటకు త్రైలింగస్వామి నాశ్రయించెడివారు. బ్రహ్మమే శరీరము దాల్చినచో ఎట్లుండునో ఆ ఘట్టమే త్రైలింగ స్వామి ఆవిర్భావము. తెలుగువారీ మహాత్ముని ప్రత్యేకముగ శ్రద్ధాభక్తులతో ఆరాధించవలెను.

బృందమంతయు నాలుగు గంటలకే రాజేంద్రప్రసాద్ ఘట్టమును చేరి, పడవలలో నదీ ప్రవాహమున ప్రయాణము చేసి, త్రైలింగస్వామి ఘట్టమును చేరిరి. నదీతీరము నుండి స్వామివారి సమాధికి ఒక పెద్ద ఆరోహణము చేయవలెను. ఈ ఆరోహణము దాదాపు సప్తగిరులలోని మోకాళ్ల పర్వతమువలె నుండును. శ్రీ కుమార్‌గారు బృందము నుద్దేశించి ఇట్లు పలికిరి: “అందరును శ్రద్ధాభక్తులతో మౌనము వహించి పరమోత్కృష్టమైన జగద్గురు దర్శనమునకై మనస్సు నున్ముఖము చేసి, ఆత్మభావ ముతో స్వామివారి సమాధిని చేరుడు. ఇప్పుడు మీరు పొందు సాన్నిధ్యము జగద్గురువు మైత్రేయుని సాన్నిధ్యము కన్న భిన్నము కాదు. కాశీ పట్టణమున విశ్వేశ్వరుని దర్శనమెంత విశిష్టమో,

త్రైలింగస్వామి సమాధి దర్శనము కూడ అంతయే విశిష్టము. హెచ్చరికగ సాగుడు."

మిక్కిలి ఎత్తైన ఆ నదీ ఘట్టమును బృందమంతయు మౌనముగ ఆరోహణము గావించిరి. త్రైలింగస్వామి సన్నిధాన మును చేరిరి. అది ఒక అద్భుతమగు దేవస్థానము, గురుస్థానము. అచ్చట త్రైలింగస్వామి ఆరాధించిన త్రిభంగి కృష్ణ విగ్రహము కలదు. ఆ కృష్ణుని శిరస్సుపై శివలింగ ముండును. అది యొక విశిష్టత. నల్లరాతి త్రిభంగికృష్ణుని అందము వర్ణనాతీతము. స్వామి వారు శ్రీకృష్ణుని ప్రతినిత్యము ఆరాధించెడివారట. స్వామివారి సన్నిధానమున స్వామివారిచే మలచబడిన ఏడడుగుల హను మంతుని ప్రతిమతో కూడిన కొండరాయి ఒకటి ఉన్నది. హనుమంతుడు సిందూర వర్ణము కలిగియున్నాడు. స్వామివారు మలచిన నల్లరాతి పంచాక్షరీ యంత్రము, శ్రీచక్రము బృహత్తర మైనవి కూడ ఆ స్థానమున గలవు. అవి ఒక్కొక్కటి రెండడుగుల వ్యాసముతో కూడిన వృత్తాకారపు యంత్రములు. స్వామివారు ప్రతినిత్యము శ్రీ చక్రార్చనము, శివపూజ గావించెడివారట. ఇవి యన్నియు ఒక ఎత్తు, ఆ స్థానమున గల శివలింగము మరియొక ఎత్తు. బృహత్తరమైన శివలింగమొకటి దేవస్థాన మధ్యమున ప్రతిష్ఠింపబడినది. అది ఒక పెద్ద సాలగ్రామశిల. పదిటన్నుల కన్న బరువైన శివలింగము! గంగయందు స్నాన మాచరించు చున్న త్రైలింగస్వామికి ఆ శివలింగము లభ్యమైనదట. దానిని చంకన నిడుకొని స్వామివారు అత్యంత ఎత్తైన ఘట్టమును ఆరోహణ చేసి, తమ ఆస్థానమునకు గొనివచ్చి ప్రతిష్ఠించిరట!!

ఆ లింగమును చూసిన బృందము పై విషయములు తెలిసి, దిగ్భ్రాంతి చెంది, నిశ్చేష్టులైనారు.

ఇవన్నియు గాక సకల విద్యలతో పాటు శిల్పనైపుణ్యము గల త్రైలింగస్వామివారు తమ రూపమును తామే మరియొక నల్లని పెద్ద శిలను మలచి ఏర్పరచినారు. ఆ విగ్రహము క్రింద వారి సమాధి యున్నది. ఆ సమాధికి సొరంగములోనికి పోవునట్లు మెట్లు కూడ యున్నవి. స్వామివారు స్వచ్ఛందముగ తమ శిష్యులతో బయలుదేరి గంగయందు జలసమాధి గావించినారట. కొన్ని దినముల తరువాత అట్లు జలసమాధియైన స్వామివారు తమ ఆస్థానమున శిలా విగ్రహము క్రింద అంతస్తులో గల సమాధి గదియందు ఆసీనులై కన్పించిరట. అప్పటినుండి వారి సాన్నిధ్యము ఆ సమాధియందు భక్తులకు లభించుచున్నది.

బృందమంతయు త్రైలింగస్వామివారి సమాధి చుట్టునూ ఆశీనులై భక్తిశ్రద్ధలతో ధ్యానము గావించిరి. చాలమందికి చక్కని అనుభూతులు కలిగినవి. అటుపైన త్రైలింగస్వామి ఆస్థానము నుండి శలవుగైకొని బయలుదేరుతున్న బృందమునకు మఠాధికారి ప్రసాదమును, స్వామివారి చిత్రపఠమును అందించినారు. శ్రీ త్రైలింగస్వామి నివసించినది పంచగంగ ఘట్టము. వారు జన్మించినది పుష్య శుక్ల ఏకాదశి. వారు దేహమును త్యజించినది కూడ పుష్య శుక్ల ఏకాదశియే. 1607 సంవత్సరములో జన్మించి 1887లో దేహమును త్యజించినారు. 280 సంవత్సరములు జీవించి ఎందరినో ముముక్షువులను గావించిన ఈ మహనీయుని సమాధి దర్శనము, స్పర్శనము విశేష పూర్వపుణ్య ఫలము.

పంచగంగా ఘట్టంలో త్రైలింగస్వామి సమాధిని దర్శించి బృందము మరల గంగాతీరము చేరి పడవలపై తమకుగా ఎంచుకున్న నది మధ్యమున గల ఇసుకతిన్నెను చేరినారు. అందరును మూడవసారి నదీ స్నానము గావించి ప్రదోషపూజ చేసినారు. నదీ మధ్యమున ఇసుకతిన్నెపై సాయం సమయమున శివునికి ప్రదోషపూజ ఒక ప్రత్యేక ఆకర్షణగ బృందమున కేర్పడినది. సోమవారము ప్రదోషపూజ జరిగినది. మంగళవారము ప్రయాగ యందు సంగమ తీరమున శివపూజ జరిగినది. మరల బుధవారము సాయం సమయమున ప్రదోషపూజ జరిగినది. దీపావళి పర్వదినమగుటచే ఇసుకతిన్నెనుండి వారణాసి క్షేత్ర మంతయు దేదీప్యమానముగ గోచరించినది.

త్రైలింగస్వామి దర్శనమైన తరువాత నావపై కాశీ దివ్యక్షేత్ర మున గల సమస్త ఘట్టములను బృందము దర్శించి అటుపైన ప్రదోషపూజ గావించుకొని మరల కాశీనగర తీరము చేరినది. ఆ రోజు సాయంకాలము నక్షత్రకాంతిలో నదిపై మైత్రేయ స్తోత్రము స్ఫూర్తివంతముగా గానము చేయబడినది. రాత్రి సమయమున అందరును మరియొకమారు అన్నపూర్ణా దేవిని, విశ్వేశ్వరుని, విశాలాక్షి దేవిని దర్శించిరి. కొనుగోళ్లు చేసిరి. విరివిగ ఎవరికి వారుగ భిక్షుకులకు దక్షిణలు వేసిరి. విశ్రమించిరి.

**15-11-2001 గురువారం** ఉదయముననే నిదురలేచిన బృందము విశ్వేశ్వరుని, అన్నపూర్ణాదేవిని దర్శించి చీకటి ఉండగనే హుటాహుటిన గంగాతీరము చేరి నావలో నదీ మధ్యమున గల ఇసుకతిన్నెను చేరి తెల్లవారు లోపల మరల స్నానాదికములు

గావించిరి. వారణాసి క్షేత్రమున అది చివరి రోజు. మరల గంగా నదీ దర్శనము, స్నానము ఎపుడు ప్రాప్తించునో ఎవరికెరుక. అందుచే భక్తిశ్రద్ధలతో తనివితీర స్నాన మాచరించిరి. ప్రాతః సమయముననే మరల పూజావేదికను అలంకరించి యథావిధిగ శివపూజనము గావించిరి. చూడముచ్చటగా పుష్పాలంకారము, దీపాలంకారము గావించిరి. అభిషేకము గూడ అందరునూ గావించిరి. మారేడు దళములను మహా మృత్యుంజయ మంత్రం చదువుచు సమర్పించిరి. 9 గంటలకు శివపూజనము పూర్తియైనది. అటు పైన శ్రీమతి రమణి, శ్రీ గోపాల్ దంపతి ప్రార్థన మేరకు ఆ ఇసుకతిన్నెపై మాస్టర్ పార్వతీకుమార్ దంపతికి గురుపూజ గావింపబడినది. కార్యకర్తలు కొందరు ముందుగ కాశీనగరము చేరి అందరికిని ఇడ్లీ, వడ ఉపాహారమును, పూజ గావించిన చోటుకే తీసుకొనివచ్చి అందించిరి. శివపూజ - గురుపూజ జరిగిన వెనుక ఫలహారము, కాఫీగొని బృందము నెమ్మదిగా మరల కాశీ నగరము చేరినది.

ఈ యాత్రలో ముందు తెలిపిన దైవప్రతిమలు, శివ లింగములు, ఇతర పూజాసామాగ్రి ఒక పెట్టెలో నుంచబడి బృందముతో పాటుగా కొనిరాబడినది. కొందరు ఉత్సాహవంతు లైన బృందము అత్యంత బరువైన ఈ పూజా పెట్టెను తాము స్వయముగ మోయుచు ఉదయము, సాయంత్రము చేయు పూజలకు సిద్ధముగ నుంచెడివారు. శ్రీమతి కృష్ణకుమారిగారు (శ్రీ కుమార్‌గారి ధర్మపత్ని) పూజావేదిక నమర్చుట, అలంకరించు టలో సిద్ధహస్తులు. వారి పనివేగము గూడ అందరికిని తెలిసినదే.

ఆమె, శ్రీ కుమార్‌గారి సోదరి పార్వతి మరియు శ్రీమతి రమణి పూజావేదికను భక్తిశ్రద్ధలతో అలంకరించు చుండెడివారు. పిన్న వయస్సులోని యువతీ యువకులు సహాయకులుగా నుండెడి వారు. బృందమంతయు ఒకే కుటుంబముగ మెలిగెడిది.

కాశీయాత్ర **14 నవంబరు,** ఆశ్వయుజ అమావాస్య గురువారం మధ్యాహ్నమునకు ముగిసినది. బృందమంతయు మధ్యాహ్న భోజనాదికములు గావించుకొని సుమో వేనులలో మొగల్‌షరాయి నగరమును చేరిరి. అచట సాయంకాలము నీలాచల్ ఎక్స్‌ప్రెస్‌నందు తమకు ముందుగా కేటాయించిన బోగీలో చేరిరి. తిరుగు ప్రయాణమున పూరీజగన్నాథుని దర్శించు కార్యక్రమ మున్నది. కాశీ మహాక్షేత్రము దర్శించుట, వారణాసి పుణ్యనదీ స్నానము జీవితమున ఒక చక్కని మలుపు కలిగించు నని పెద్దలు చెప్పుదురు. అటులే ప్రయాగ తీర్థ స్నానమున్నూ. పూరీజగన్నాథుని దర్శనము గూడ అట్టిదే. కాశీలో గడిపిన మూడు పగళ్లు, మూడు రాత్రుళ్లు నెమరువేసుకుంటూ ఉల్లాసముగ నొకరితో నొకరు భాషణము చేయుచుండగ 9 గంటల ప్రాంత మున రైలు ఖరగ్‌పూర్ చేరినది. అచట మన సోదరబృందము ప్రేమానురాగములతో భోజనమందించిరి. ఖరగ్‌పూర్ సోదర బృందముయొక్క భక్తి, శ్రద్ధ, హృదయ వైశాల్యము, బృంద సభ్యుల హృదయములలో శాశ్వతముగ చోటు చేసుకొన్నది. భోజనానంతరము అందరును విశ్రమించిరి.

రైలు భువనేశ్వరము మరునాడు ఉదయం 11-30 గంటలకు చేరును. అభ్యాసము ప్రకారము అందరును 5 గంటల

లోపునే నిదురలేచి కాలకృత్యములు గావించి వివరముగ ప్రార్థన, స్తోత్రాదికములు గావించిరి. అందరును కాఫీలు సేవించి ఉల్లాస ముగ కబుర్లు చెప్పుకొనుచుండగా రైలు భువనేశ్వరము చేరినది.

భువనేశ్వరమున బరంపురం బృందం స్వాగతము పలికి తిరుమల తిరుపతి దేవస్థానము కల్యాణ మండపమునకు బస్సులలో గొనిపోయి, స్నానాదికములకు ఏర్పాటు గావించిరి. అందరూ స్నానములు గావించి 1-30 గంటలకు భోజనముకు ఉపక్రమించిరి. ఆంధ్రా భోజనము అరటియాకులలో వడ్డించి బృందమును సంతృప్తి పరచిరి. మూడు గంటలకు బయలుదేరి పిప్పలి మీదుగా పూరీ దివ్యక్షేత్రమును 5-30 గంటలకు చేరిరి. సముద్రతీరమున నున్న యాత్రీనివాస్‌లో బసచేసిరి. విశాలమైన యాత్రీనివాస్ ముఖ ప్రాంగణమునగల తోటలో సాయంకాల ప్రార్థనము గావించిరి. అటుపైన స్నానాదికములు గావించుకొని జగన్నాథ దర్శనమునకై బయలుదేరిరి.

జగన్నాథపురము పురి జగన్నాథుగను, అటుపైన వాడుకలో పూరీ జగన్నాథునిగను మారినది. ఈ ఆలయము నీలాచలమను కొండపై నున్నది. ఆ కొండ దివ్యప్రభావముతో కూడినది. భారత దేశమునకు తూర్పు దిక్కునగల ఈ దివ్యక్షేత్రము తూర్పు సముద్రమును కట్టడి చేయు క్షేత్రముగ భావింతురు. ఉత్తరమున బదరీనాథుడు, దక్షిణమున శ్రీరంగనాథుడు, పశ్చిమమున ద్వారకానాథుడు, తూర్పున జగన్నాథుడు హైందవ సంస్కృతికి, భరతదేశమను దేవాలయమునకు నాలుగు గోపురముల వంటివి. ఇందు పూరీజగన్నాథుడు అత్యంత మహిమాన్వితముగ మహాత్మ్య

లచే కొనియాడ బడుచున్నాడు. సిద్ధపురుషులు, యోగులు జగన్నాథుని దర్శించి తీరుదురు. భరతదేశమున జగన్నాథుని దర్శింపని మహాత్ము డొక్కడును లేడు. మహారాష్ట్ర, రాజస్థానముల నుండి గూడ జగన్నాథ దర్శనమునకు తండోపతండములుగ ఆస్తికజనులు వచ్చిపోవు చుందురు.

ఇచ్చట జగన్నాథుడు అంతర్యామియగు దైవము. సుభద్రా దేవి దైవ మాయ. బలరాముడు కాలమూర్తి. వీరి ప్రతిమలు దారువుచే చేయబడి ప్రతి 12 సంవత్సరముల కొకమారు మార్చబడుట ఒక ప్రత్యేకత. పూరీక్షేత్ర మహిమను తెలుసుకొన వలె నన్నచో విస్తారముగ అధ్యయనము చేయవలసి యుండును. జగన్నాథుని సాన్నిధ్యము ప్రతి నిత్యము భక్తులు దేవాలయమున అద్భుతమగురీతిలో అనుభూతి చెందుచు నుందురు. ఈ దేవాలయము ప్రస్తుత కట్టడము వెయ్యి సంవత్సరముల వెనుక నిర్మించబడినది. భారతీయ శిల్ప నైపుణ్యమునకు ప్రతీకగా జగన్నాథుని ఆలయము, లక్ష్మీదేవి ఆలయము గోచరించును.

సూక్ష్మ దర్శనము చేయగలిగిన వారికి దేవాలయ శిఖరము పైన నీలివర్ణ సుదర్శన చక్రము ఆకాశములో తిరుగాడుచు క్షేత్రమును పరిరక్షించు చున్నట్లుగ గోచరించును. గర్భాలయ మున జగన్నాథుడు, సుభద్ర, బలరాములు సాన్నిధ్యమిచ్చు పీఠము క్రింద అత్యంత శక్తివంతమైన సాలగ్రామములు లక్షకుపైగా నున్నవి. వాటి ప్రభావము శ్రీ కృష్ణుని కనులద్వారా వెలువడుచుండును. అందుచే ఈ క్షేత్రమున నేత్ర దర్శనమునకు ప్రాముఖ్యత మెండు.

ఈ దేవాలయ ప్రవేశము స్థానిక పండాల అధీనములో నుండి యాత్రికులకు యిబ్బందికరముగ నుండుట జగమెరిగిన సత్యము.

## పూరీ జగన్నాథ దర్శనము :

**15-11-2001 గురువారము,** అమావాస్య తిథి వెడలి పాడ్యమి తిథి ప్రవేశించగ, బృందము దివ్యక్షేత్రమున చేరినది. సాయంకాలము విశాఖ నక్షత్రము ముగిసి, అనూరాధ నక్షత్రము ప్రవేశించుచుండగ బృందము దేవాలయమున చేరినది. స్థానిక జగద్గురుపీఠము సభ్యులు, సోదరులు ఆనందరావుగారి సారథ్యమున పండాల బారినుండి తప్పించుకొని (ప్రథమ దర్శనము ముగించుకొని) దేవాలయ ప్రాంగణమున, గుడికి దక్షిణముగ బృందము ఒక విశాల ప్రదేశమున ఆశీనులై విష్ణు సహస్రనామ స్తోత్ర పఠనము గావించిరి. అటుపైన శ్రీ కుమార్‌గారి సూచన మేరకు కృష్ణాష్టోత్తరమందలి "*సుభద్రాపూర్వజో విష్ణుర్భీష్మముక్తి ప్రదాయకః। జగద్గురు ర్జగన్నాథో వేణునాద విశారదః॥*" అను శ్లోకమును అనుశ్యుతముగ 108 సార్లు పఠించిరి. ప్రదక్షిణముగ బయలుదేరి మహాలక్ష్మి దేవాలయమువైపుకు నడచు చుండగా, రెండు తెల్లని గ్రద్దలు బృందము మీది నుంచి ఎగురుచు, దేవాలయ శిఖరమందు గల గూడులోనికిచేరి స్థిరపడినవి. కొందరు సభ్యులకు ఆ సన్నివేశము ఆనందము కలిగించినది.

మహాలక్ష్మి దర్శనము కూడ గావించుకొని బయటకువచ్చి జగన్నాథుని ఎడమ ప్రక్కగా ఆశీనులైన బృందమును తిలకించి పలకరించుటకై ప్రధాన పూజారిగారు వచ్చిరి. వారు బృందము

యొక్క సుస్వర విష్ణు సహస్రనామ గానమును, క్రమశిక్షణమును మెచ్చుకొనినారు. శ్రీ కుమార్‌గారి వద్దకు వచ్చి ఇట్లు పలికినారు. “ఈ సాయంకాలం కార్తీకమాసమున ప్రథమమైనది. జగన్నాథునికి అత్యంత ప్రీతికరమైనది. ఈ క్షేత్రమున నేటి సాయంకాలమొక పర్వదినము. మీ బృందమునకు నేను ప్రత్యేక, సామీప్య దర్శన స్పర్శనములను ఏర్పాటు చేయుదును. మీరిక్కడనే దైవమును కీర్తించుచు ఆశీనులై యుండుడు” అని తెలిపిరి.

బృందమున సభ్యులకు ఆశ్చర్యానందములు కలిగినవి. మరల పర్వదిన దర్శనము! కాశీక్షేత్రమందిట్లే జరిగినది. మరల యిచ్చటగూడనట్లే జరుగుచున్నది. శ్రీకృష్ణునికి కార్తీక శుద్ధ ప్రతిపత్తు, ఆ మరునాడు ద్వితీయ పర్వదినములట. ఆ రోజు గురువార మగుట, జగద్గురువగు శ్రీకృష్ణుని దర్శనమగుట మరల ప్రత్యేక దర్శనమునకు అవకాశము. సభ్యులలో కొందరికి ఆనందముతో పాటు గర్వము రాకపోలేదు. అందరునూ వేచియుండిరి.

వేచి యుండుట రెండు గంటలపాటు సాగినది. రాత్రి 10 గంటల ప్రాంతమున ప్రధాన పురోహితులు, మరియు ప్రధాన పండా వచ్చి బృందము నంతను గర్భాలయమున ప్రవేశపెట్టిరి. ప్రవేశము కేవలము బృందమునకు మాత్రమే పరిమితి చేసిరి. అందరును బలరామ కృష్ణ సుభద్రల పాద స్పర్శనము చేసిరి. తులసీ దళములతో పూజించిరి. వేదిక చుట్టునూ ప్రదక్షిణము చేసిరి. దాదాపు గంట సమయము గర్భాలయమున నుండిరి. 11-30 గంటలకు దేవాలయమును వీడి 12 గంటల ప్రాంతమున యాత్రీనివాస్‌కు చేరిరి.

జగన్నాథ క్షేత్రమున భోగమొక ప్రత్యేకత. అన్నముతో వివిధములైన ప్రసాదములను చేసి, పిండితో తీపి వంటలు చేసి విరివిగ దైవమునకు భోగము జరుపుచుందురు. తిరుపతి వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదమెంత ప్రసిద్ధి గాంచినదో జగన్నాథుని భోగము కూడ అట్లే ప్రసిద్ధి గాంచినది. ఈ భోగము ఒక విందు భోజనమును మించి యుండును. భోగము, వడ్డన, వార్పు అంతయు లోహ పాత్రలతో కాక మట్టి పాత్రలతో నిర్వర్తించుట మరియొక విశేషము. బ్రాహ్మణులొక్కరే ఈ భోగమును వండుట, నైవేద్యము పెట్టుట కాక వడ్డన కూడ వారే చేయవలెనట.

రాత్రి 12 గంటలైనది. అది భోజన సమయము కాదు. దేవస్థానపు బ్రాహ్మణులు అన్ని రకముల భోగములను, తామే స్వయముగ వడ్డించుటకు తీసుకొని వచ్చినారు. ప్రసాదము కాదన రాదు. ప్రసాదముగ మాత్రమే స్వల్పముగ తీసుకొనుటకు సభ్యులు అంగీకరించిరి. నిలబడి తినరాదు. అందరును ఆశీనులైరి. కడిగి శుభ్రము చేసిన విస్తళ్లు పరచిరి. నామ మాత్రముగ ప్రసాదము వడ్డించిరి. రుచి చూసిన సభ్యులకు ముఖము విప్పారినది. మరల మరల పెట్టించుకొనుచు పొట్టలను బిర్రుగ నింపిరి! ఆశ్చర్యము కలిగినది. జగన్నాథుని ప్రసాదము మరువరానిదిగ మిగిలినది. "సర్వం జగన్నాథం" అనుచు బరువెక్కిన పొట్టలతో నిద్రించిరి.

ఈ మొత్తము యాత్రయందు సభ్యులకు కరువైనది ఒకటియే. అది నిద్ర. యాత్ర యందు నిద్ర సుఖముండరాదను నియమము క్షుణ్ణముగ పాటింపబడినది. ఏ రోజునూ రాత్రి 12

గంటలకు ముందు నిద్రపోలేదు. తెల్లవారుజామున 3 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమయ్యేది. కేవలము రైలు బండిలోనే కొంతవరకా సౌకర్యము కలిగినది.

కడుపునిండా తిని ఒంటిగంట ప్రాంతమున నిద్రా ప్రయత్నము చేసిననూ మరల సుప్రభాత దర్శనమునకు మూడున్నర గంటలకే లేవవలెను అను భయము చేత సగము సభ్యులకు నిదుర పట్టలేదు. కొందరికి భయము లేకపోయినను నిదుర రాలేదు. మరికొందరు రెండుగంటలే పరుండినను పది గంటలసేపు నిద్రించినట్లుగ తృప్తిగ నిద్రించి లేచిరి. ఉదయము 5 గంటలకు దేవాలయ ప్రవేశమునకు 4-30 గంటలకే ముఖద్వారము వద్ద ఉండవలెను. బృందము యొక్క సమయ పాలనము యాత్ర యంతయు అద్భుతముగ నడచినది. బృంద మున అందరికన్న పెద్దవారగు శ్రీమతి కంభంపాటి రామలక్ష్మిగారి దగ్గర నుండి (78 సం॥లు) అందరికన్న చిన్నవాడైన చిరంజీవి కార్తికేయ వరకు అందరును సమయపాలన మొనర్చిరి. ఉదయ మున జగన్నాథుని మరల సంతృప్తిగ దర్శనము గావించుకొని మహాలక్ష్మి అనుగ్రహమును పొంది యాత్రీనివాస్‌కు 7 గంటల ప్రాంతమున తిరిగి వచ్చిరి. ఉపాహారముగొని, కాఫీ త్రాగి మరల తుది పూజ భవానీశంకరులకు, లక్ష్మీనారాయణులకు, శ్రీకృష్ణు నకు భక్తిశ్రద్ధలతో గావించిరి. బృందము కోరిక మేరకు మరల పాదనమస్కార కార్యక్రమము సాగినది. బరంపురం బృందము నకు ఆశీఃపూర్వకముగ శ్రీ పార్వతీకుమార్ దంపతి వస్త్ర ప్రదానము గావించిరి. 11 గంటలకు అందరును యాత్రీ నివాస్‌ను ఖాళీచేసి

బస్సులలో మధ్యాహ్నామునకు భువనేశ్వరము చేరి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నందు ప్రవేశించిరి. రైలు బరంపురం చేరగానే సోదర బృందమునకు బరంపురం సోదరబృందము కాఫీ, టీలు అందించి, రాత్రి భోజనమును గూడ అందించిరి.

యాత్రను సర్వవిధముల పరిపూర్తి గావించుకొని ఉత్సాహ ముతో తిరిగివస్తున్న బృందమునకు విజయనగరం వద్ద కాల పురుషుడు రెండు గంటలు ప్రయాణమును అరికట్టినాడు. మొత్తము ప్రయాణములో రైళ్లు గాని, బస్సులు గాని, సుమో వేనులుగాని, ఆఖరికి పడవలు గాని ఆలస్యము కాలేదు. సభ్యులుకూడ కాలమును శ్రద్ధతో పాటించినారు. విజయ నగరము చేరిన రైలు మాత్రము ఇంజను చెడి ఆగినది. విశాఖ చేరుటకు ముందు బృందమునకు కొంత శిక్షణ ఈయబడినట్లుగ వేచియుండుట జరిగినది. రాత్రి 11 గంటలకు విశాఖ చేరినది. విశాఖవారు ఇళ్ళకు బయలుదేరగా రాజమండ్రి, విజయవాడ, హైదరాబాదు సోదరులు ప్రయాణము కొనసాగించినారు.

మర్నాడుదయము ముందుగా ఏర్పరచిన కార్యక్రమము ప్రకారము శ్రీ పార్వతీకుమార్‌గారు, జగద్గురుపీఠము సోదరులు డా॥ టి.వి.వి.యస్. రావు బృందముచే నిర్వర్తింపబడు ఏకాదశ రుద్రాభిషేకమును ఉదయము 6 గంటల ప్రార్థనతో ప్రారంభించినారు. ఆ రుద్రాభిషేకము కార్యక్రమమునే కాశీ సమారాధనముగ యాత్రా పరిసమాప్తి గావించినారు.

# ఉజ్జయిని, ఓంకారేశ్వర యాత్ర

# ఉజ్జయిని, ఓంకారేశ్వర యాత్ర

నర్మదానది సర్వపాపహారిణి. "ఓ నర్మదాదేవి! నీవు మా పాపములను హరింపుము" అనుచు ఆస్తికజనులు నర్మదలో స్నానము చేయుట సంప్రదాయము. హిందీ భాషలో "నర్మదే హర్ హర్ హర్" అనుచూ శిరస్సు మునుగునట్లుగా మూడుసార్లు పవిత్ర నదీ జలములయందు భక్తులు ఉదయము, సాయంత్రము స్నాన మాచరింతురు. 'నర్మద' అనగా పాపములను హరించునది అని అర్థము.

నర్మద నదికిని, కర్కాటకమాస చైతన్యమునకు సంబంధ బాంధవ్యమున్నది. కర్కాటక రాశియందు బృహస్పతి సంచరించు చుండగా నర్మద పుష్కరములు జరుగును. కర్కాటకరాశి బృహస్ప తికి ఉచ్చస్థానము. బృహస్పతి అనుగ్రహము ఈ రాశియందు మెండుగా నుండును. సంచారమున బృహస్పతి కర్కాటకమును చేరునపుడు నర్మదానదికి పుష్కరములుగా ఋషులు చేసిన నిర్ణయమునందు ఎన్నియో రహస్యములు యిమిడి యున్నవి. కర్కాటకరాశికి చంద్రుడు అధిపతియగుట కారణముగ కర్కాటక రాశి స్వభావముకల నర్మద చంద్రతత్త్వమును, బృహస్పతి తత్త్వమును తన ప్రవాహము ద్వారా జీవుల కందజేయు చుండును.

కర్కాటకరాశి 4వ రాశి యగుటచే మాతృస్థానము కూడ నర్మద కంటినది. నర్మద నదీ తీరములయందు లెక్కకు మిక్కుట ముగా సిద్ధుల ఆశ్రమములున్నవి. ఎందరో మహానుభావులు నర్మద యందు, నర్మద నదీ తీరములయందు స్వచ్ఛంద సమాధిని పొందినారు. నర్మద నది, నదీతీరములు అత్యంత పుణ్యప్రద ములు. కర్కాటక రాశియగు ఆషాఢ మాసమందే 'గురుపూర్ణిమ' గూడ ప్రాచీన కాలమునుండి నిర్వర్తింపబడుచున్నది. జ్యోతిషమున చంద్రుడుగూడ ఆచార్యత్వము వహించునని వివరింతురు. సద్గురువగు హనుమంతుడు సముద్రమును లంఘించి రాత్రి సమయమున లంకలో ప్రవేశించునపుడు అతనిని వాల్మీకి మహర్షి చంద్రునితో సరిపోల్చెను. రాత్రియందు వెలుగు నిచ్చువాడు చంద్రుడు. అజ్ఞానము నందు వెలుగు దీపము పెట్టువాడు సద్గురువు. చంద్రుని వెన్నెల ఆహ్లాదకరము. సూర్యుని వెలుగు తాపమును కలిగించగలదు. అట్టి తీవ్రమగు వెలుగును తాను గ్రహించి ఆహ్లాదమగు వెన్నెలగా దానిని భూమిజీవుల కందించు వాడు చంద్రుడు. సద్గురువు కూడ నట్లే దైవత్వమును తానుపొంది పామరులగు జీవులకు సంతర్పణము చేయును. ఈ విధముగా కర్కాటకరాశి అధిపతియగు చంద్రుడు, అందు ఉచ్ఛ స్థితిగొను బృహస్పతి, నర్మదా నదీ తరంగముల నుండి జీవులను స్పృశించి తరింపజేయుదురు. నర్మద యందు పై కారణముగా సోమవారము, గురువారము స్నానము లాచరించుట ప్రసిద్ధి గాంచినది.

భారతదేశమున పశ్చిమ తీరమున పుట్టి, తూర్పు సముద్ర మున సంగమము చేసిన పుణ్యనదు లెన్నియో కలవు. గోదావరి,

కృష్ణ, కావేరి అట్టి నదులు. గంగ, యమున, సరస్వతి నదులు ఉత్తరమున పుట్టి తూర్పు సముద్రమున సంగమము చేసినవి. నర్మద మాత్రము పశ్చిమమున పుట్టి తూర్పున కేగి, ఓంకారేశ్వరు నకు ప్రదక్షిణము కావించి మరల పశ్చిమమునకే ప్రవహించినది. ఇది నర్మదయొక్క మరియొక విశేషము. సత్పురుషులు తపస్సు చేసి దైవమును దర్శించి దివ్యప్రభతో మరల తిరిగివచ్చి జీవుల ననుగ్రహింతురు. నర్మద ప్రవాహ మట్టి విశేషము కలది.

నర్మద ప్రవహించు తీరములయందుగల అరణ్యములలో శతాబ్దముల తరబడి తపస్సు చేయుచు నగ్నముగా సంచరించు సిద్ధు లెందరో యున్నారు. వారి దర్శన మాత్రముననే జీవులలో జ్ఞాన ముద్భవించగలదు. జీవితములు చక్కని మలుపు తిరగ గలవు. ఈ ఆధునిక యుగమున అవధూతలను చూడ నిచ్చగించు వారు నర్మద అడవులలో తప్పక ప్రవేశించి, వారి దర్శన స్పర్శన ములు పొంది కృతకృత్యులు కాగలరు.

అట్టి నర్మద నదీ సందర్శనము, ఉజ్జయిని, ఓంకారేశ్వర జ్యోతిర్లింగ దర్శనము కావించుకొనుటకు 113 మందితో కూడిన సోదరబృందము శ్రీ **చిత్రభాను కార్తీక శుద్ధ అష్టమి, మంగళవారం (12-11-2002)**నాడు విశాఖ యందు సమావేశమైనది. బృందమున గల సభ్యులు విశాఖపట్నం, బరంపురం, తాడేపల్లిగూడెం, బెంగుళూరు, సామర్లకోట, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, మంగళగిరి, కొత్తగూడెం, నాగర్‌కర్నూలు, హైదరాబాదు నగరము లకు చెందినవారు. అందరును ఉదయముననే జగద్గురుపీఠము నకు చెందిన రిట్రీట్ సెంటరులో అన్ని మార్గముల నుండి వచ్చి

చేరిరి. 8 గంటలకు ఉపాహారము స్వీకరించిన వెనుక సమావేశ మొకటి ఏర్పరచి, సభ్యు లందరికి దైనందిన నియమావళిని, యాత్రయందు తీసుకొనవలసిన జాగ్రత్తలు, వారందించవలసిన సహకారము సోదరులు కంభంపాటి శివశంకర్‌గారు తెలియ పరిచిరి. ప్రణవారాధనము అనంతరము భోజనము, విశ్రాంతిగొని సాయంత్రము మాస్టర్ సి.వి.వి. ప్రార్థన అనంతరము 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణము చేసి, రాత్రి భోజనానంతరము 9 గంటలకు ధనిష్ఠా ధ్యానము గావించి, మరునాటి తెల్లవారు జామున ప్రయాణమునకై నిద్రకు ఉపక్రమించిరి.

**కార్తీక శుద్ధ నవమి బుధవారం, శతభిషా నక్షత్రం, తేది 13-11-2002** ఉదయం బృంద మంతయూ 3 గంటలకే నిదుర లేచి స్నానాదికములు కావించుకొని కాఫీ, టీ పానీయములు సేవించి గం॥ 4-15 ని॥లకు రైల్వేస్టేషన్‌కు బయలుదేరినది. గం॥ 5-30 ని॥లకు సమతా ఎక్స్‌ప్రెస్, విశాఖ నుండి భోపాల్‌నకు బయలుదేరినది. రైలులో మూడు పెట్టెలలో బృంద మంతయూ ఆసీనులు కాగా, అందరికి ప్రార్థన, స్తోత్ర పారాయణములు, మాస్టరుగా రందించు యిష్టాగోష్ఠి వినపడుటకు రేడియోలు హైదరా బాదు బృందము, సోదరులు కె.యస్.ఆర్. గోపాల్ ఆధ్వర్యమున ఏర్పాటు గావింపబడినవి. రైలు బయలుదేరిన వెంటనే యథా ప్రకారము మాస్టరుగారు గణపతి సూక్తముతో ప్రార్థన నారంభిం చిరి. అటుపై దుర్గా సప్తశ్లోక్తి, గురుపాదుకా స్తవము పఠించిన పిమ్మట ఓంకారోచ్చారణ (ఏడుమార్లు) గావించి, మాస్టర్ సి.వి.వి. ప్రార్థనను నిర్వర్తించిరి. గాయత్రి మంత్రగానము, శ్రీసూక్తము,

పురుష సూక్తము, శ్రీకృష్ణాష్టోత్తరములను పారాయణము చేసిరి. 7 గంటలకు ప్రార్థన పూర్తికాగా, ఉత్సాహవంతులగు యువతీ యువకులు అందరికినీ మరల కాఫీ, టీ పానీయము లందించిరి. 8 గంటలకు ఉపాహారము, 12 గంటలకు ప్రణవోచ్చారణము గావించిరి.

ప్రణవోచ్చారణ సమయమునకు రైలు ఒక నదీతీరము నందలి చిన్న స్టేషనులో ఆగుట జరిగినది. 30 నిమిషములపాటు ప్రణవోచ్చారణము, ధ్యానము సాగినది. నదీ తీరమునగల కొండలలో సాధు సమూహములుకూడ బృందముతో ప్రణవమును ఉచ్చరించున్నట్లు కొందరు సభ్యులకు చక్కని అనుభూతి కలిగి నది. నల్లని మబ్బు యొకటి చల్లదనము కూర్చినది. ప్రణవోచ్చారణ కార్యక్రమము ముగియువరకు రైలు కదలలేదు. అందరునూ కన్నులు తెరువగా మరల కూతవేసి రైలుబండి నదిపైగల వంతెన ద్వారా నదిని దాటి ఒంటిగంట ప్రాంతమునకు టిట్లాఘర్ చేరినది.

ముందు చేసుకొనిన ఏర్పాట్ల ననుసరించి టిట్లాఘర్‌లోని తమిళ బ్రాహ్మణ కుటుంబ మొకటి మసాళాలు, యితర ఘాటు వాసనలు లేని దక్షిణభారత బ్రాహ్మణ భోజనము నందించిరి. బృందము ఊహకుమించిన రుచికర భోజనము లభించుటచే ఆత్మారాముడు తృప్తి చెందినాడు. అటుపైన అందరునూ కొంత సేపు విశ్రమించిరి. 4 గంటలకు కాఫీ, టీ, టిఫిన్లు సరఫరా కాగా భుజించి ప్రకృతి రమణీయతను బృందము గమనించుచు ప్రయాణించుచుండగా 5 గంటలకు రాయపూరు చేరినది. రాయపూరునందు బృందమునకు సంబంధించిన వారిలోని ఒక

సభ్యునకు బంధువొకరు వశించియున్నారు. వారు రైల్వేలో పని చేసిన ఉన్నత ఉద్యోగి. పదవీ విరమణానంతరము రాయపూరు నందే స్థిర నివాస మేర్పరచుకొనిన విజయనగరం జిల్లా తెలుగు బ్రాహ్మణులు. వారు రాయపూరునందు ఒక దివ్యమైన రామాలయ మును, హనుమంతుని ఆలయమును నిర్మాణము గావించి, నిర్వహించుచు, ఆస్తికులకు తోడ్పడుచు కాలము గడుపుచున్నారు. 113 మంది సభ్యులతో నున్న బృందము నంతటికిని రాత్రికి వలసిన భోజన సదుపాయమంతయూ వారు స్వయంగా వండించి పొట్లములు కట్టి అందించినారు. వారి ఆప్యాయత సభ్యులకు అమితానందము కలిగించినది. వారు చేయుచున్న దైవీకార్యము లకు తోడ్పడుటకై మాస్టరుగారు తగు విరాళము నందించినారు.

రాయపూరునుండి రైలుబండి కదలగా సాయంకాలము ప్రార్థనా సమయ మాసన్నమైనది. ప్రార్థనానంతరము సభ్యు లందరూ యిష్టాగోష్ఠిని కోరిరి. యిష్టాగోష్ఠి యందు తీర్థయాత్రల ప్రాముఖ్యము, అందు యాత్రీకులకు గల నియమములను గూర్చి మాస్టరుగారు ప్రసంగించిరి. 8 గంటలకు స్వల్పముగ ఆహార మును, అటుపైన ఫలములను భుజించి 9 గంటల కల్లా బృందము విశ్రమించిరి. రోజంతయూ ప్రయాణము సాగిననూ కార్యక్రమములు నిండుగ నుండుటచే సమయము సునాయాస ముగ గడచినది.

**కార్తీక శుద్ధ దశమి, పూర్వాభాద్ర నక్షత్రము, గురువారము, 14-11-2002** తెల్లవారుజామున గం॥ 4-30 ని॥లకే బృందము మేల్కాంచి, కాలకృత్యములు తీర్చుకొని, సామానులన్నియు రైలు

పెట్టెలలోని ముఖద్వారము వద్దకు గం॥ 5-30 ని॥లకు చేర్చిరి. సామాను లొకవైపునుండి యువకుల బృందము రైలునుండి దింపుటకు, మరియొక ద్వారమునుండి బృందము దిగుటకు ఏర్పాటు గావించిరి. గం॥ 5-45 ని॥లకు నియమావళి ప్రకారము సమతా ఎక్స్‌ప్రెస్ భోపాళము చేరినది. అదృష్టవశాత్తూ మొదటి ఫ్లాట్‌ఫారమునకే చేరినది. 10 నిముషములే నిలచునని తెలిసి బృందము చటుక్కున 5 నిమిషములలో సామానంతయూ దించిరి. అచట నుండి 4వ ఫ్లాట్‌ఫారమునకు సామానును చేర వేయు బాధ్యత యువకులు చేపట్టగా, మిగిలిన బృందమంతయూ స్టేషనులోని విశ్రాంతి గదులలో స్నానాదికములు గావించుకొనిరి. 7 గంటల కందరును కాఫీ, టీ పానీయాదులు గ్రోలిరి. గం॥ 7-30 ని॥లకు మహాపుణ్య క్షేత్రమగు ఉజ్జయినిని చేరుటకు మాళ్వా ఎక్స్‌ప్రెస్ నందు ఆసీనులైరి. 8 గంటలకు భక్తరాజ్ మహారాజ్ వారి శిష్యబృందము ముందుగా చేసిన ఏర్పాట్ల ప్రకారము ఉపాహారము నందించిరి. భోపాళము నుండి ఉజ్జయినీ మహా పుణ్యక్షేత్రము చేరుటకు 4 గంటలు ప్రయాణము సాగినది.

బృంద మంతయు మాళ్వా ఎక్స్‌ప్రెస్‌నందు ఉదయం ఉపాహారము గావించుకొని, మాస్టరుగారు తెలిపిన ఉజ్జయిని ప్రాశస్త్యమును గూర్చి వినుట జరిగినది.

**ఉజ్జయిని ప్రాశస్త్యము :**

ఉజ్జయిని నగరము పూర్వకాలమున అవంతీ నగరముగా పేరుగాంచినది. విక్రమాదిత్యుడు, భోజరాజువంటి మహత్తర రాజయోగులు పరిపాలించిన అవంతీ దేశమునకు అవంతీ మహా

నగరము రాజధానిగా యుండెడిది. తేజోవంతమై ఉత్తేజమును కలిగించు ఉజ్జయిని మహానగరమున పరమశివుడు మహా కాలేశ్వరుడుగా జ్యోతిర్లింగ రూపమున ఆవిర్భవించినాడు. అవంతి యందే మహాశక్తి హరసిద్ధి రూపమున వెలసినది. ఇచ్చటనే మహాకవి కాళిదాసును అనుగ్రహించిన మహాకాళీ దేవాలయము కూడ గలదు. సుప్రసిద్ధ యోగి, కవియగు భర్తృహరికూడ యిచ్చటి గుహలయందే సిద్ధి పొందినాడు.

ఈ మహానగరమందే సాందీపని మహర్షి గురుకులము నేర్పరచుకొని పురాణ పురుషుడు శ్రీకృష్ణునికి బాల్యమున 64 విద్యలను నేర్పినాడు. ఇచటనే శ్రీకృష్ణునికి కుచేలుడు పరిచయమై నాడు. ఈ నగరము నుండియే మోక్షదాయిని యగు క్షిప్రానది ప్రవహించుచున్నది. ఉజ్జయినీ మహాపుణ్యక్షేత్రము చుట్టునూ 8 కాలభైరవుల దేవాలయము లున్నవి. మంత్రమునకు, తంత్రము నకు, వేదమునకు, యోగమునకు ప్రసిద్ధిగాంచిన పురాతన విశ్వవిద్యాలయము కూడ యున్నది. ఉజ్జయినీ మహానగరము యొక్క వైభవము భారతీయులు ప్రతి ఒక్కరికీ తెలియవలసినదే. నేటికిని ఉజ్జయిని ప్రశాంత మనస్కులకు, లోదృష్టిగల భారతీయు లకు, అమితమగు అనుభూతినిచ్చు పుణ్యక్షేత్రముగా నిలచి యున్నది. భోపాల్‌నగరము కూడ భోజపాల్ (భోజరాజు) స్మరణ మాత్రముగ నేర్పరచుకొన్న మహానగరము.

బృందము శ్రద్ధగా వినుచుండ మాస్టరుగారు మహాకాలేశ్వర జ్యోతిర్లింగ మాహాత్మ్యమును ఈ క్రింది విధముగా బోధించిరి.

## మహాకాళేశ్వర జ్యోతిర్లింగ మాహాత్మ్యము :

ప్రాణులందరికి మోక్షము నొదవజేయు అవంతీ నగరమున వేదప్రియుడను బ్రాహ్మణ పుంగవుడు నివసించుచుండెను. ఆతడు వేద వేదాంగపారగుడై సంధ్యావందన బ్రహ్మయజ్ఞ దేవర్షి పితృతర్ప ణాది వైదిక కర్మలను నిత్యమాచరించుచు పుణ్య కార్యముల జేయుచును, అగ్ని హవనమును పార్థివ శివలింగార్చనమును గావించుచుండెను. వేదప్రియుడు శివారాధనముతో సమస్త కర్మఫలము నొందినవాడై చిత్తశుద్ధిన శివజ్ఞాన సంపన్నుడై ప్రారబ్ధాంత మున మరణించి శివసాయుజ్యము నొందిన వాడయ్యెను.

అతని నలుగురు కుమారులును తల్లిదండ్రులబోలె శివ భక్తులై ప్రతిదినము శివునారాధించు చుండిరి. దేవప్రియుడు, ప్రియమేధుడు, సుకృతుడు, ధర్మవాహి యనబడు వేదప్రియ కుమారుల పుణ్య ప్రభావము వలన భూలోకప్రజలకు సుఖము శుక్లపక్ష చంద్రునివలె పెంపొందుచుండెను. అవ్వారి సద్గుణములు వ్యాపించుటచే ఉజ్జయినీ నగరవాసు లందరును సత్ప్రవర్తనము గలవారగుచుండిరి. ఆ పట్టణ మంతయు బ్రహ్మతేజోభరిత మగుచుండెను.

రత్నమాల పర్వతమున దూషణుడను రాక్షసరాజు బలవంతుడై ధర్మద్వేషము కలిగియుండెను. బ్రహ్మదేవుని వరము వలన ప్రపంచమును తుచ్ఛముగా భావించుచు అమరులను వారి వారి స్థానములనుండి వెడలగొట్టినవాడై సింహము కుందేళ్ళను పారద్రోలునట్లు భూమిపై వేదశాస్త్ర విహితములగు ధర్మకార్యము

లను చేయనీయక, పుణ్యతీర్థములయందు స్నానదానాది సుకృత ముల నాచరించుటకు విఘ్నములను కల్పించుచుండెను.

ప్రపంచమున పదునాలుగు లోకములలో దూషణాసురుని ప్రతాపము ప్రసరించెను కాని ఒక్క ఉజ్జయినీ నగరము మిగిలి యుండెను. అచ్చటగూడ వైదిక ధర్మమును లోపింపజేతునని దైత్యుడు సంకల్పించి గొప్ప సైన్యమును తోడ్కొనిన వాడై అవంతీ నగర ప్రాంతమున నివసించియు బ్రహ్మద్వేష కారణముగ మహా వీరులైన నలుగురు రాక్షసులను నగరములోనికి పంపుచు ఈ దుర్మార్గ బ్రాహ్మణులు నా శాసనమును ధిక్కరించి వేదధర్మము లను పాటించుచు శివారాధనము నొనర్చుచున్నారు. వీరికి జీవింప వలెనని యిష్టము కలదేని సమస్త సదాచారములను పరిహరించి నా యానతిని ప్రవర్తింపుడనియు లేనిచో మరణము తప్పదనియు ఆదేశించి వారు విననిచో బాధింపుడని నియమించెను.

అగ్నుల బోలిన నలుగురు దైత్యులు దూషణాసురుని శాసనమును తలదాల్చి యవంతీనగరము బ్రవేశించి నాలుగు వైపుల నాక్రమించుచుండిరి. దేవప్రియుడు మున్నగు బ్రాహ్మణోత్త ములు రాక్షసుల దుండగములను గమనించియు వెరువనివారై శివధ్యానము జేయుచు ధైర్యము నవలంబించియు నొక్కగీఅంత మాత్రము శివధ్యాననిష్ఠ నుండి కదలక శివుని ముందు నీచులైన వీరెంతవారని తలచుచుండిరి.

ఇంతలో దైత్యభటులు నలుదిశల ప్రజలను పీడించుచు బ్రాహ్మణుల జేరుచుండ పౌరులు సమీపించి “స్వామీ! ప్రస్తుతము కర్తవ్యమెద్ది? ప్రజలు వెతల జెందుచున్నారు” అని విన్నవించిరి.

అంత బ్రాహ్మణులు "దుర్మార్గులను శిక్షించుటకు సైన్యము గాని, ఆయుధములుగాని మావద్ద లేవుగదా ! సామాన్యు నాశ్రయించు తఱి ఆతడు ఆశ్రితులను రక్షింపబూని తన యవ మానము నెంతమాత్రము సహింపజాలడు. ఇక సర్వ సమర్థుడగు శంకరు నాశ్రయించితిమి గావున నా భగవానుడు మనను తప్పక కాపాడును. భక్తవత్సలుడైన శివుడుదక్క నితరులెవరును రక్షకులు కాజాలరు." అని వచించి పార్థివ శివలింగము నఖండభక్తి నారా ధించుచు శివధ్యాన నిమగ్నులగు చుండిరి.

అంత దూషణాసురుడు తన బలమును తోడ్కొని యేతెంచి "కొట్టుడు! వధింపుడు!" అని కేకలు వేయుచుండెను. అట్టి భయంకర ధ్వనిని విప్రోత్తములు శివధ్యాన వశమున వినకుండిరి.

దూషణాసురుడు బ్రాహ్మణులను సమీపించి సంహరింప నుద్యుక్తు డగునంతలో పార్థివలింగ స్థానమున నొక గుంట నుండి శంకరుడు వికటరూపమున నావిర్భవించి మహాకాలుడై ప్రత్యక్ష మయ్యెను.

"దుష్టా! నీవంటి దుర్మార్గులను శిక్షింప సంసిద్ధుడనై వచ్చితిని. మొదట బ్రాహ్మణుల వద్దనుండి దూరము తొలగుము!" అని శంకరుడు వక్కాణించి దూషణాసురుని, వాని సైన్యమును హుంకారముతోడనే భస్మమొనర్చెను. సంహరింపగ మిగిలిన సైనికులు దూర దూరములకు పరుగెత్తిరి. సూర్యుడు చీకటిని పారద్రోలునట్లు మహాదేవుని కరుణా కటాక్షము అసురులను మడియజేసెను.

ఆ శుభసమయమున అమరులు దుందుభులను

ప్రయోగించుచు శంకరునిపై దివ్య పుష్పముల గురిపించిరి. హరి బ్రహ్మాది దేవతలందరును నచ్చోటున కేతెంచి లోకక్షేమంకరుడగు శంకరుని దివ్య పాదారవిందములకు మ్రొక్కులిడి యంజలి ఘటించియు వివిధ స్తోత్రములతో నుతించుచుండిరి.

మహాకాల స్వరూపుడగు మహేశ్వరుడు బ్రాహ్మణుల నోదార్చి వరము నడుగుడని యనుగ్రహింప నవ్వారు కృతాంజలులరై సాష్టాంగములనిడి తలలు వంచి యిట్లు ప్రార్థించిరి.

మహాకాలా ! మహాదేవా ! సంసార సముద్రమునుండి మమ్ము ఉద్ధరింపుము ! మోక్షమును ప్రసాదింపుము ! ఇచ్చోట దయగలవాడవై నివసింపుము ! నిన్ను దర్శించువారిని తరింప జేయుము !

అంత శంకరుడు భూసురుల ప్రార్థనను మన్నించి యచ్చోట జ్యోతిర్లింగ స్వరూపుడై మహాకాలుడను పేరుతో నివసించెను. మరియు భూసురుల ననుగ్రహించి నందున వేదప్రియ పుత్రులు తదితర భక్తులును ప్రారబ్ధాంతమున శివసాయుజ్యము నొందినవారైరి.

శివుని ప్రాదుర్భావ కారణముగ అవంతీక్షేత్రము నలువైపుల యందు ఒక్కొక్క క్రోసు మాత్రము శివమయమై పావనంబయ్యెను. అప్పటినుండి మహాకాలుడని ప్రసిద్ధిజెందిన మూడవ జ్యోతిర్లింగమును భక్తితో చూచినవారికి, శ్రద్ధతో పూజించిన వారికిని స్వప్నమున గూడ దుఃఖము సంభవింపదు. మరియు కోరికలు సిద్ధించును. మరణానంతరము శివపదము లభించును.

*(శ్రీ శివ మహాపురాణము)*

శ్రీ మహాకాలేశ్వరుని ఆవిర్భావము వివరించిన పిమ్మట మాస్టరుగారు మహాకాలేశ్వర జ్యోతిర్లింగ ప్రభావమును కూడ వివరించుట జరిగినది. అది ఈ క్రింది విధముగా నున్నది.

**శ్రీ మహాకాలేశ్వర జ్యోతిర్లింగ ప్రభావము :**

చంద్రసేనుడను మహారాజు ఉజ్జయినీ నగరమును రాజధానిగ చేసుకొని ప్రజలను పాలించుచుండెను. చంద్రసేనుడు శాస్త్రము లన్నిటిందగు సారమును గుర్తెరిగినవాడై ఇంద్రియము లను వశపరచుకొని శివభక్తి కలిగియుండెను. మణిభద్రుడను శివగణముఖ్యుడు చంద్రసేనునకు స్నేహితుడై యుండుకతన నొకప్పుడాతడు ప్రసన్నుడై చింతామణి యనబడు గొప్ప రత్నము నొసగెను. చింతామణి కౌస్తుభమణి బోలినదై సూర్యునివలె ప్రకాశించుచు తలచుకొనినవారికి, చూచినవారికిని శుభము నొనగూర్చుటయేగాక అద్దాని కాంతి సోకినంతవరకు కంచుగాని, రాగిగాని, సీసముగాని, తగరముగాని, ఱాయి మొదలగునవి గాని వడిగా బంగారము నొనర్చుచుండెను.

శివునాశ్రయించి ధైర్యముతో నుండు చంద్రసేనుడు చింతామణిని కంఠముపై ధరించి యమరుల సమావేశమున సూర్యునివలె సభాప్రదేశమున రాణించుచుండెను.

ఉజ్జయినీ ప్రభువు చింతామణిగ్రీవుడని రాజులందరు తెలుసుకొని చింతామణి యందలి యపేక్షచే తమ హృదయమున పరితపించు "చంద్రసేనునకు చింతామణి దైవదత్త" మని గుర్తింపనివారై అసూయతో అనేకవిధములగు నుపాయములతో చింతామణి నిమ్మని యాచించిరి.

చంద్రసేనుడు మహాకాలునియందు దృఢమైన భక్తి గలవాడగుటచే ఎవరికిని వెఱగందక రాజులందరికి చింతామణి నీయనందున నవ్వారు నలుకజెంది యుద్ధ సన్నద్ధులై గజాశ్వరథ పదాతి సైన్యములను వెంటనిడుకొని యవంతీనగరము జేరి యద్దాని నాలుగు ద్వారముల చెంత తమలో తాము నొక యొడంబడిక నొనర్చుకొని పట్టణము ముట్టడించిరి.

క్షత్రియులందరును తన రాజధాని నాక్రమించుకొనిన యుదంతమును చంద్రసేనుడు భటులద్వారా గుర్తించి పెక్కురతో నొక్కడు వైరము బూనుట పాడికాదని మహాకాలేశ్వరుని శరణముగా నాశ్రయించి ఎట్టి చిత్తవిక్షేపము లేనివాడై ఆహారమును స్వీకరింపక రేయింబవళ్లు ఆరాధించుచుండెను.

అట్టి తఱి మహాకాలేశ్వరుడు చంద్రసేనుని రక్షింపనొక నుపాయము నేర్పఱచెను. అద్దానిని చెప్పుచున్నాను. అవధరింపుడు!

చంద్రసేనుడు మహాకాలేశ్వరుని పూజించుచున్న సమయముననే ఒకానొక గొల్లది ఉజ్జయినీ నగరమున సంచరించుచు మార్గవశమున మందిరములోని కరుదెంచి ఐదు వత్సరముల కుమారుని చంకనిడుకొని రాజు చేయుచున్న శివపూజనముందగు వైభవమును కనులారగాంచినదై నమస్కరించి తన గుడిసెకు వెళ్లినదయ్యెను.

ఆ సమయమున తల్లికంటె నెక్కువ నిష్ఠతో పిల్లవాడు రాజుచేసిన శివపూజనమును చూచినందున వాని మనస్సునందు పూజా క్రమమంతయు నాటియుండెను. తన గుడిసె చెంత

నెవరును లేనట్టి మరియొక గుడిసెలో పిల్లవాడు ఇంపైన గుండ్రాయి నొక దానిని శివలింగముగ భావించి శుద్ధ జలమున నభిషేకించి, విభూతి గంధాక్షత పుష్ప బిల్వాదుల తోడను, ధూప దీప నైవేద్యముల తోడను పూజించుచుండెను. మాటి మాటికి పుష్పములను, బిల్వ దళములను శివలింగముపై సమర్పించుచు మ్రొక్కు లిడుచును నాట్యమాడుచుండెను.

ఇంతలో వాని తల్లి భోజనమునకై పిలచుచుండ బాలుడు మారు పలుకనందున తల్లి పిల్లవానిజేరి వాని చేష్టితమునంతయు చూచెను. అప్పుడా బాలుడు కనులు మూసుకొని శివునియందే తన చిత్తమును నిలిపియున్న కతమున తల్లి బాలుని కరము లాగి కోపముతో కొట్టినను బాలుడు లేవనందున వాడు చేసిన శివపూజనము నంతయు చెరచి శివలింగమును విసరి పారవేసెను. అందువలన బాలుడు హాహాకారముతో పరితపించుచుండ వానిని తల్లి తూలనాడుచు గుడిసెలోనికి పోయెను.

పిల్లవాడు తల్లి చెరచిన శివపూజగాంచుచు ''దేవదేవా! క్షమింపుము!'' అని క్రిందబడి మూర్ఛితుడై ముహూర్తకాలముననే మేలుకొని చూచుచుండెను. అప్పుడా పాడుగుడిసె సుందరమైన శివమందిరముగా పరిణమించెను. మందిరమునకు పెద్ద పెద్ద ద్వారములు, ద్వారములకు బంగారు తలుపులు, తలుపులపై మణిరత్నముల తోరణములు, మందిర ప్రదేశమున గొప్ప వెలగల నీలమణులతో, వజ్రములతో చెక్కబడిన గద్దెలును, మందిరపు పైభాగమున (అప్పుడు కాచబడిన) బంగారపు కలశములు కట్టబడియుండుటయు మిగుల రాణించు మణులతో నిండిన

స్తంభములును, నేలయంతయు స్ఫటికములతో కప్పబడి యుండుటయు, మందిర మధ్యభాగమున రత్నలింగము ప్రతిష్ఠింపబడి యుండుటయు, అట్టి శివలింగముపై తాను సమర్పించిన పత్రపుష్పాదు లుండుటయు బాలునకు కనుపడి నందున అచ్చెరువు నందుచు పరమానందసాగర నిమగ్నునివలె కొంత తడవు తన్ను తాను మరచి జాగరూకుడై మహాదేవునకు వందనము నిడుచు, నుతించుచును సూర్యాస్తమయము కాగానే శివాలయమునుండి బాలుడు వెడలినవాడై తన యిల్లు చేరుసరికి నయ్యది దేవేంద్రుని నగరము బోలినదై బంగారపు తలుపులు, సువర్ణద్వారములు, మణుల రాసులతో, సువర్ణఖనుల తోడను నిండియుండు ప్రదేశములును కలిగియుండెను.

అట్టి దివ్యదేహమున ప్రదోషకాలమునందు ప్రవేశించిన బాలునకు తల్లి - ప్రత్యక్ష దేవతా స్త్రీవలె రత్నాలంకారములను దాల్చి నిద్రించుచు శివానుగ్రహ పాత్రురాలుగ కనుపడు చుండెను. బాలుడు అట్టి జననింజేరి మేలుకొలుపగ నామె తన గృహము నవలోకింప నద్ది యపూర్వముగ నద్భుతముగ నగుపడు చున్నందున సంతోషాతిశయమున కుమారుని కౌగిలించుకొనెను.

గోపవనిత తన కుమారుని వలన శంకరుని కృపాకటాక్ష మహిమ నంతయు తెలుసుకొని యట్టి సమాచారమును చంద్ర సేన మహారాజున కెరిగింపనేగి చెప్పగా నాతడు మహాకాలేశ్వరుని పూజావిధానము నంతయు ముగించి యదే అర్ధరాత్రి సమయ మున నేతెంచి బాలుని శివభక్తి ప్రభావముచే నేర్పడిన దివ్య శివాలయ రత్నలింగమును దివ్యభవనమును గాంచుచు, మంత్రుల

తోడను, పురోహితుల తోడ నాశ్చర్యపడుచు బాహ్య విషయముల యందలి మనస్సును మరల్చి పరమానంద సముద్రమున మునిగి తేలినవాడై అనురాగముచే కన్నీరు విడచుచు భక్తిపరవశమున 'శివ! శివ!' అని యుచ్చరించుచు గోపబాలు నక్కున జేర్చుకొనెను. రాజు, రాజుమంత్రులు, పరివారజనము, ప్రజలందరును మహేశ్వరుని కీర్తించుచుండ శివభక్తి మహావైభవము చెలరేగెను. ఇట్టి ఆశ్చర్య వార్తవలన, శివానుగ్రహముందగు అనుభవము వలన, పురజనుల సందడి వలనను ఆ రాత్రి క్షణమువలె గడచెను. యుద్ధ సన్నద్ధులై పట్టణమును ముట్టడించియున్న రాజులందరు తెల్లవారునపుడు భటులవలన సమాచారమును గుర్తెరిగి చకితులై యొకచో కూడి యిట్లు ముచ్చటించిరి.

ఉజ్జయినీ నగరాధిపతియగు చంద్రసేనుడు శివభక్తి కారణముగ మనయందరికిని జయింప నలవిగాకున్నాడు. గోపబాలునివంటి శివభక్తులీ పురమున నెందరో యుందురు కాబోలు. చంద్రసేనుడన్నచో ఏకాగ్రమైన శివనిష్ఠ గలవాడని చెప్పవచ్చును. ఈతని విరోధించుటచే శంకరుడు మనపై క్రోధము గలవాడగును. కావున నందరము నశింపగలము. అందువలన నీ రాజుతో మనము మైత్రి నేర్పరచుకొనిన యెడల మహాదేవుడు మనపై అనుగ్రహము గలవాడగును.

భూపాలకు లందరు పై విధముగా నిశ్చయించుకొని మదినుండి వైరమును పారద్రోలియు, శస్త్రాస్త్రములను పారవైచియు, చంద్రసేనుని సంప్రదించినవారై అవంతీనగరమున బ్రవేశించి భక్తితో మహాకాలేశ్వరుని పూజించిరి. పిదప గొల్లదాని

యింటికేగి చంద్రసేనుని అఖండ భక్తి ప్రభావమును, గోపబాలుని భాగ్యోదయమును ప్రశంసించుచుండ చంద్రసేను డెదురేగి యవ్వారి నాదరించుచు సింహాసనములపై కూర్చుండజేసెను. అంతనా రాజులందరు చంద్రసేను నభినందించి గోపబాలుని శివాలయమును, శివలింగమును దర్శించి యప్పటినుండి శివునియందు ఏకాంతభక్తి గలవారై బాలునకు పరమ సంతోషమున శివానుగ్రహకాములై నానావిధములైన కానుకల నొసగి దేశ దేశముల యందుగల గొల్లవారి కధిపతిగ బాలు నామోదించిరి.

ఇంతలో నమరులచే సత్కరింపబడువాడు, వానరశ్రేష్ఠుడు, మహా ప్రభావశాలియునగు హనుమంతుడచ్చోట సాక్షాత్కరింపగ రాజులందరును భక్తిచే తలలు వంచి లేచి వందనము నాచరించిరి. అంత ఆంజనేయుడు రేడుల నడుమ నొక ఎత్తుపీటపై కూర్చుండి గొల్ల పిల్లవానిని దరిజేర్చుకొనినవాడై రాజుల నుద్దేశించి దిగువ విధము వక్కాణించెను.

రాజులారా! ప్రజలారా! మీకు ఇహపర శ్రేయముల నొసగుమాట చెప్పుచున్నాను వినుడు!

*శ్లో॥ ఋతే శివం నాన్యతమో - గతిరస్తి శరీరిణామ్ ॥*

శరీరధారులగు జీవులందరికి శంకరుడు దక్క నితరు డెవడును రక్షకుడు కాజాలడు. భోగమోక్షములను ప్రసాదించు వాడు శివుడేయని తెలియుడు!

ఈ బాలుడు శివభక్తి ప్రవరుడు కావున గోపాలకుల కీర్తి నినుమడింప జేయుటేగాక జీవితకాల మంతయు ననేక దివ్య సుఖముల ననుభవించి చివరన శివసాయుజ్యము నొందును.

మరియు నీతడు దైవవశమున చంద్రసేనుని శివపూజా విధాన మును చూచి మంత్రములు తెలియక మూఢభక్తిని శివుని పూజించి తత్కాలముననే యభివృద్ధిని పొందిన యంశమును మీరు గుర్తించి యున్నారు. ఈ బాలుని వంశములో ఎనిమిదవవాడు నందుడను వాడు జన్మించును. నారాయణుడు నందునికి కుమారుడుగ నవత రించును. ఈ రోజు నుండి యీతడు 'శ్రీకరు'డను పేరుతో ప్రఖ్యాతిని పొందును.

శివాంశ సంభూతుడగు హనుమంతుడు మరల నొకతూరి రాజులను, ప్రజలను దయతోచూచి గోపబాలునకు దిగువ విధమున శివ పూజావిధానమును, సదాచారము నుపదేశించెను.

కుమారా! సావధానుడవై వినుము!

"ప్రతిదినము ఉదయమున స్నానము నొనర్చి భస్మరేఖల దాల్చియు సూర్యునికి నమస్కరించి ఆసనముపై కూర్చుండి శివపంచాక్షరీ మహామంత్రమును ఆరువేల వరకు జపించుము! శివభక్తుల నాదరించు చుండుము! ధర్మము తప్పక గోప ప్రజలను పాలించుము! నీతి నియమములతో ప్రవర్తించుము! అబద్ధము, అన్యాయము, అవివేకము, మోసము, అపకారము మొదలగు దుర్గుణములను దరికి రానీయకుము! శివలీలా విలాసము నెల్ల కాలము వినుచుండుము. వివాహితుడవై ధర్మపత్నియందు సత్సంతానము బడయుము! దేశభక్తి, రాజభక్తియు గలవాడవై లోకోపకారము చేయుచుండుము!

శివుడే పరమాత్మయని భావించుము! వేదశాస్త్రములను

విశ్వసించుచు సద్బ్రాహ్మణులను గౌరవించుము! పెద్దలను సత్కరించుము! శివమందిరములలో, శివక్షేత్రములయందును సౌకర్యములను కల్పించుము!"

ఇట్లు ఆంజనేయస్వామి శ్రీకరునకు బోధించి చంద్ర సేనుడు మొదలగు రాజులు చూచుచుండ నచ్చోట నంతర్ధానము జెందెను. రాజులును చంద్రసేనుని సంప్రదించి సంబరమున తమ తమ నెలవులకు జనిరి.

ఇక శ్రీకరుడు హనుమంతుని యుపదేశము ననుసరించి వేదశాస్త్ర సంపన్నులగు విప్రుల వైదిక మంత్రోచ్చారణముతో, రుద్రాధ్యాయ కథనము తోడను శంకరు నఖండభక్తి నారాధించు చుండెను.

చంద్రసేనుడు, శ్రీకరుడును శివభక్తి ప్రభావమున మహాకాలేశ్వరుని యనుగ్రహమునకు పాత్రులై ముక్తి నొందిరి. భక్తవత్సలుడు, సజ్జన రక్షకుడు నగు మహాకాలేశ్వరుని ప్రభావము ఇట్టిదని తెలియవలెను. *- శ్రీ శివమహాపురాణము.*

శ్రీ మహాకాలేశ్వర జ్యోతిర్లింగ ఆవిర్భావము, ప్రభావముల వివరణము పూర్తియగు సరికి మాళ్వా ఎక్స్‌ప్రెస్ సరిగ్గా 11-30 గంటలకు ఉజ్జయిని చేరినది. శ్రీ భక్తరాజ్ మహరాజ్ ఆశ్రమ వాసులు మన సోదరబృందమున కంతటికిని మహాకాలుని దేవస్థానమునందే వసతి, భోజనము ఏర్పాట్లను గావించినారు. వారే మూడు బస్సులనుగూడ తేది 14-11-02 నుండి 20-11-02 వరకు బృందము కొరకు కాంట్రాక్టు పద్ధతిన ఏర్పాటు చేసినారు. రైల్వేస్టేషను నుండి బృందము, బస్సుల సహాయమున దేవస్థానము

చేరి, ముందుగా కేటాయించిన గదులలో సామానంతయు భద్రపరచుకొని మరల స్నానమాచరించి, భోజనాదికములు గావించుకొని, మధ్యాహ్నం 4 గంటల వరకు విశ్రాంతి గొనినారు. తదుపరి అందరికిని టిఫిన్, కాఫీ, టీలు ఏర్పాటు చేయబడినవి.

5 గంటలకు దేవస్థాన పురోహితులు, బృందము చేరియున్న ప్రవచన మండపమునకు విచ్చేసి వేదోక్తముగా మాస్టరుగారిని, వారి సతీమణిని సత్కరించి దేవాలయమున కాహ్వానము గావించి నారు. ఈ ఆహ్వానము బృందమున కంతటికి ఆనందము కలిగించి నది. 6 గంటలకు ప్రార్థన గావించుకొని, బృందమంతయు మహాకాలేశ్వర దేవాలయము వైపునకు బారులుగా కాలినడకన సాగినది.

**బడా గణేష్ మందిరము :**

ఆలయ ప్రాంగణమునకు దక్షిణవీధిలో ఒక పెద్ద గణేషుని విగ్రహముగల ఆలయ మున్నది. విగ్రహము అతి పెద్దదగుటచే హిందీభాషలో ఆ గణేశుని 'బడా గణేష్' అని పిలుచుట పరిపాటి అయినది. బృందమంతయూ ముందుగా గణేషుని దర్శనమునకు ఆలయమున ప్రవేశించినది. ఈ ఆలయ ప్రాంగణము నేటికిని సాందీపని మహర్షి వంశమునకు చెందియున్నది. పరంపరగా మహర్షి కుటుంబములే యిచ్చట, ఈ ఆలయమును నిర్వర్తించుచున్నవి. వేల సంవత్సరములనుండి, ఈ ఆలయ ప్రాంగణమును ధ్యానము నకు, జ్యోతిర్వేద శిక్షణమునకు వినియోగించు చుండెడివారట. సంస్కృతముకూడ బోధించెడి వారట. నేటికిని సాందీపని మహర్షి కుటుంబము వారిచే ఉజ్జయిని నుండి జ్యోతిషశాస్త్రముతో కూడిన

పంచాంగ మొకటి నిర్వర్తింపబడుచున్నది. ఆ పంచాంగము పేరు *"శ్రీ నారాయణ విజయ పంచాంగము."*

ఈ దేవాలయ ప్రాంగణమున గల గణేషుడు ఎంత పెద్ద మూర్తియో, అంత సుందరమైన మూర్తి కూడ. మాస్టరుగారు ప్రారంభించగా, అందరునూ కలిసి అధర్వణ వేదమందలి గణపతి ఉపనిషత్తును స్వరయుక్తముగ ఉచ్చరించిరి. తీర్థ ప్రసాదములను గొనిరి. ఆలయ లోపలి భాగమున పంచముఖ ఆంజనేయస్వామి మందిరము, నవగ్రహ మంటపము కూడ నున్నవి. వారిని గూడ దర్శించి, బృందము సంధ్యాసమయము దాటి, కార్తీక దీపములు దేవాలయమున ఏర్పాటు చేయు సమయమునకు మహాకాలేశ్వర జ్యోతిర్లింగ దర్శనమునకై ఆలయమున ప్రవేశించెను.

**మహాకాలేశ్వర ఆలయము :**

*"ఆకాశే తారకం లింగం పాతాళే హాటకేశ్వరం ।*
*భూలోకేచ మహాకాలోః లింగత్రయే నమోస్తుతే ॥"*

అని పఠించుచూ ఆలయమున ప్రవేశించుట యిచ్చటి సంప్రదాయము. ఇచ్చటి జ్యోతిర్లింగము అదృశ్యముగ ఆకాశములోనికి, పాతాళ లోకములోనికి కూడ నిట్టనిలువుగా వ్యాపించి యున్నదని పెద్దల అవగాహన. అన్ని లోకములు తన ప్రతాపముచే ఆక్రమించిన దూషషాసురుని సంహరించుటకు శివుడిచట ఊర్ధ్వ అధోముఖములుగ, అమితముగ వ్యాప్తిచెంది నిలచెనని దర్శనము. ఇది ఒక జ్యోతిర్లింగము. పరమశివుడు భక్తుల ననుగ్రహించుటకై భూమిపై అవతరించినపుడెల్ల, అతడంతర్ధానమగు సమయమున,

భూమి అతని స్పర్శతో పులకించి పొంగుటవలన జ్యోతిర్లింగము లేర్పడునని పెద్దల అభిప్రాయము. ఉజ్జయిని పాలకు లందరు మహాకాలేశ్వరుడే పాలకుడని, తాము కేవలము అతని ప్రతినిధుల మని భావింతురు.

మహా కాలేశ్వర లింగము దక్షిణ ముఖముగ నుండును. అనగా దక్షిణమును చూచు చుండును. దక్షిణమును చూచు మూర్తి దాక్షిణ్యమూర్తి. అనగా దక్షిణామూర్తి. అందువలన మహా కాలేశ్వరుడు దాక్షిణ్యమే ప్రధానముగా కలవాడని తెలియవలెను. ఆలయ ప్రాంగణము బహు విస్తారమైనది. ప్రదోష కాలా నంతరము వెలిగింపబడిన దీపములతో దేవాలయ ప్రాంగణము, గోపురములు, గర్భగుడి దేదీప్యమానములై, సభ్యుల హృదయము లను బాగుగా ఆకర్షించినవి. అందరునూ భక్తిప్రపత్తులతో శివనామ స్మరణ చేయుచూ ఆలయమున ప్రవేశించిరి. జ్యోతిర్లింగమిచట భూగర్భమున నుండును. లింగముకూడ చాల ప్రాచీనమైనదిగా గోచరించును. ఆకారము రెండడుగుల ఎత్తు, అడుగు వెడల్పు గలిగి, అలంకారము చేయబడి అద్భుతముగ గోచరించును. గర్భగుడి యందు మాస్టర్ దంపతి, మరికొంతమంది సభ్యులు చేరగా పురోహితులు మాస్టరుగారిచే దైవమునకు క్షీరాభిషేకము గావించిరి. మరునాడు ఉదయమున అందరిచే క్షీరాభిషేకము గావింతుమని తెలిపిరి. జ్యోతిర్లింగ దర్శన మాత్రము చేతనే సభ్యుల హృదయము పొంగినది. జగద్గురువగు పరమశివుని గురువారము, కార్తీక శుద్ధ దశమినాడు ప్రదోషకాలమున దర్శించితి మని ఆనందించిరి.

**భస్మహారతి :**

మహాకాలేశ్వరునకు చేయు దైనందిన సేవలలో ప్రతి దినము ఉదయం 4 గంటలకు చేయు భస్మహారతి అత్యంత ప్రాధాన్యము వహించియున్నది. శ్రావణమాసము, శివరాత్రి పర్వదినములుగా గమనింపబడుచున్నవి. ఉజ్జయిని పుణ్య క్షేత్రములయందు, పరిసరముల యందు జటాధారులైన శివ భక్తులు మెండు. అట్లే శివభక్తి పరాయణులగు సాధుసజ్జనులు కూడ మెండుగ కలరు. వీరు తమ మరణానంతరము చితాభస్మము శివుని కర్పణ చేయవలసినదిగా సన్నిహితులకు తెలిపి స్వచ్ఛందముగ మరణింతురట. అట్టి సిద్ధుల చితాభస్మ ములే ప్రతినిత్యము మహాకాలేశ్వరునకు భస్మహారతి సమయ మున ఈ భస్మమునే వాడుదురట. ప్రాచీనకాలము నుండి ఈ విధముగనే భస్మహారతికి వలయు భస్మము శివున కందు చుండునట. ఇది కేవలము మహాకాలేశ్వర జ్యోతిర్లింగమునకే జరుపు సేవ. ఈ భస్మహారతిని తిలకించుటకు భక్తులు దేశము నలుమూలలనుండి వత్తురు. అప్పుడు మహాకాలేశ్వరుని భస్మముతో అభిషేకించి రకరకములగు రూపములు దిద్దుదురు.

**గర్భగుడి :**

గర్భగుడి విశాలముగ నుండును. నందదీపములు రెండు శివున కటునిటు దేదీప్యమానముగా నిరంతరము వెలుగు చుండును. ఆ దీపదర్శనము ఆనందదాయకమని భక్తుల నమ్మకము. పశ్చిమమున, దక్షిణమున గణపతి, కార్తికేయుడు,

పార్వతీదేవి మూర్తులు వెండితో చేయబడినవి ఉన్నవి. పైభాగ మంతయు రుద్రయంత్రము తీర్చిదిద్దబడి యుండెను. ఆ యంత్రమునకు వంద కిలోల వెండితో చేసిన కవచ మొకటి యుండెను. యంత్రమునకు, కవచమునకు రుద్రనమక మందలి సమస్త నామములును సంస్కృత లిపియందు కలిగి యున్నవి. ఈ రుద్రయంత్రము కూడ మహాకాలేశ్వరుని దేవాలయమందలి విశిష్టతగా తెలియవచ్చును. మరియెచటనూ యిట్టి రుద్ర యంత్రము కానరాదు.

మహాకాలేశ్వరుడు మృత్యువు నుండి రక్షించు దైవము. కాలుడనగా మృత్యుదేవతయైన యముడు. యముడు కూడ మన్నించు దైవమగుటచే శివుని మహాకాలు డందురు. దక్షిణ ముఖముగ నుండు శివలింగము నర్చించినచో మృత్యుభీతినుండి జీవుని ఉద్ధరించును. పై కారణముగా మహాకాలేశ్వర జ్యోతి ర్లింగము దక్షిణముఖము కలిగియున్నది.

**పూజ, అభిషేకములు :**

ఉత్తర భారతమున దేవాలయములలో భక్తులు స్వయముగ దైవమునకు అభిషేకము చేసుకొనవచ్చును. పురోహితులు సహాయకారులుగ నుందురు. బృందము మూడు మార్లు- ఉదయం, సాయంత్రం, మరల ఉదయం శివునికి స్వయముగా అభిషేకము గావించుకొనిరి. అంతియేగాక రాధా మాధవమునందు నిత్యము పూజలందుకొను సాలగ్రామములకు, నర్మద శివలింగమునకు, లక్ష్మీనారాయణులకు ఆలయ ప్రాంగణ

మున ఒక సువిశాల ప్రదేశమున పూజాభిషేకము లొనర్చు కొనుటకు దేవస్థానమువారు అంగీకరించుటచే, అచట పీఠము లేర్పరచుకొని, ఉజ్జయినియందున్న నాలుగు పూటలు పూజాభి షేకములు మాస్టరుగారి కుటుంబము ఆధ్వర్యమున జరిగినవి.

పై విధముగా సంతృప్తికరముగ మహాకాళేశ్వర ఆలయమున గురువారము సాయంత్రము, శుక్రవారము ఉదయము, సాయంత్రము, శనివారము ఉదయము (14, 15, 16 తేదీలలో) అభిషేకము, పూజ బృందము జరుపుకొనిరి.

**కార్తీక శుద్ధ ఏకాదశి, శుక్రవారము 15-11-2002** ఉదయ మున భస్మహారతి, అభిషేకము బృందమునకు ప్రత్యేకముగా ఏర్పాటుచేయబడినది. బృందసభ్యులు అందరికిని క్షీరపాత్రలు అందింపబడినవి. భస్మహారతి అనంతరము అభిషేకము జరిగినది. అటుపైన భర్తృహరి గుహలు, గఢకాళికా దేవాలయము, కాలభైరవ దేవాలయము, మంగళనాథుని దేవాలయము, సాందీపని మహర్షి ఆశ్రమము దర్శించుట జరిగినది.

భర్తృహరి విక్రమాదిత్య చక్రవర్తికి జ్యేష్ఠ సోదరుడు. భట్టి కనిష్ఠ సోదరుడు. భర్తృహరి మొదట రాజ్యపాలన చేయుచుండెను. అతడు ఒకనాడు ఉజ్జయినీ నగర పొలిమేరలో మృగవేట చేయు చుండగా, మృగమొకటి తప్పించుకొని పారిపోవుచూ నొక గుహలో చేరెను. భర్తృహరి మృగము వెంట పరుగిడుతూ గుహలోకి చనెను. దాగియున్న మృగమును బాణము వదలి చంపెను. మృగము గిలగిల తన్నుకొనుచు ఆ గుహయందే తపస్సు చేసుకొనుచున్న

సిద్ధుని పాదములవద్ద చేరి ప్రాణములు విడిచెను. సిద్ధుడు కనులు తెరచి చూడగా మరణించిన మృగము, విల్లు, బాణములు ధరించిన రాజు కనిపించిరి. ప్రశాంతవదనుడైన ఆ తపస్వి భర్తృహరి చక్రవర్తితో యిట్లనెను. "రాజా! నీకును, నాకును, ఈ మృగమునకునూ ప్రాణము లిచ్చినవాడు ఈశ్వరుడే. ప్రాణుల ప్రాణములు హరించువాడు కూడ ఈశ్వరుడే. ఈ మృగమును నీవు వేటాడుచూ, వెంటనంటివచ్చి దాని ప్రాణములు తీసితివి. తిరిగి ప్రాణములు పోయగలవా? నిష్కారణముగా మృగము ప్రాణము తీసినావు. అది నీకేమి అపకారము చేసినది. ప్రాణములు తీయుట సులభము. ప్రాణములు పోయుట దుర్లభము. ప్రాణము లిచ్చుటకునూ ప్రాణములు తీయుటకును ఈశ్వరుడే అధిపతి. ఇప్పుడీ మృగమునకు నీవు ప్రాణములు పోయగలిగినచో నేను హర్షింతును. లేనిచో శపింతును." భర్తృహరి వివశుడై, సిద్ధుని పాదములపై పడి, క్షమింపుడని వేడుకొనెను. సిద్ధుని మనసు కరిగి రాజును శపింపక, మృగమును బ్రతికించెను. రాజు నిర్ఘాంతపోయి తనకునూ అట్టి విద్యల ననుగ్రహింపమని వేడెను. ముని 'నీవిక గుహను వదలిపోను' అని మాట యిచ్చినచో నీకు సకల విద్యలకు మూలమగు ఉపదేశము ననుగ్రహింతు ననెను. భర్తృహరి తన అంగీకారము తెలుపగా, మునీశ్వరుడు అతని కుపదేశ మందించి తపస్సున నిలిపెను. కాలక్రమమున భర్తృహరి సిద్ధుడయ్యెను. అతడు మరల రాజసింహాసనమును అలంకరించక పోవుటచే, విక్రమాదిత్యుడు రాజయ్యెను. భట్టి అతనికి మంత్రిగా నిలచెను.

భర్తృహరి ఉపదేశము పొంది, సిద్ధుడై, అనేకానేక జ్ఞానపర మగు విషయములను బోధించెను. అందత్యంత ప్రాముఖ్యము వహించినవి భర్తృహరి సుభాషితములు. ఉజ్జయిని పుణ్యక్షేత్రము దర్శించు వారందరూ భర్తృహరి గుహలు కూడ తప్పక దర్శింతురు. బృందమంతయూ ఆ విధముగా దర్శనము కావించుకొని, గఢ కాళికా దేవాలయమునకు సాగినది.

**గఢ కాళిక :**

గఢకాళిక దేవాలయము కూడ అత్యంత ప్రాధాన్యము వహించిన దేవాలయము. అమాయకుడు, మూర్ఖుడునగు వ్యక్తి, మహాకవి కాళిదాసుగా మారిన మహాద్భుతము ఈ దేవాలయముననే జరిగినది. భరత భూమియందు జరిగిన అద్భుతములలో నిది యొకటి.

భారతదేశమున పన్నెండు కాళికా శక్తిపీఠములు కలవని త్రిపుర మహాత్మ్యము తెలుపుచున్నది. అందారవ శక్తిపీఠమే ఉజ్జయిని యందలి గఢకాళికా శక్తిపీఠము. ప్రస్తుత మీదేవాలయ మెచ్చట కలదో అచ్చటనే ప్రాచీన అవంతీనగర ముఖద్వార ముండెడిది. ఇప్పటికిని శరన్నవరాత్రులలో ఈ కాళికాదేవికి విశేష పూజలు జరుగుచుండును. ఈ ఆలయమున ముఖ్యముగా చాముండీ మంత్రమును నుపాసింతురు. "ఐం హ్రీం శ్రీం చాముండాయ విచ్చే" అను మంత్రము ఇచ్చటి కాళికామాతను ప్రసన్నము చేసుకొనుటకు వినియోగించు మంత్రము. ఆలయ ముఖద్వారమునకూడ ఈ మంత్రమును మకరతోరణమున

లిఖింపబడియున్నది. బృందమంతయూ లోనికి ప్రవేశించి దుర్గా సూక్తము, దుర్గా సప్తశ్లోకి పారాయణము గావించి అటుపైన 108 మార్లు చాముండీ మంత్రమును ధ్యానపూర్వకముగా నుచ్చ రించిరి. ఆలయమున కాళిక కిరుప్రక్కల శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి విగ్రహములు కలవు. కాళీమాతకు వెనుక గణేశుని విగ్రహము ఉన్ముఖముగ హనుమంతుని మందిరము కలవు. ఈ ఆలయమునకు కొద్ది దూరములోనే క్షిప్రానదీ తీర మున్నది. అచ్చట పూర్వకాలము సతీ సహగమనము జరుపుచుండెడి వారు.

**క్షిప్రానది :**

క్షిప్రానదీ వైభవమును గూర్చి స్కాంధపురాణమున నున్నది. ఈ నది పుట్టుకను గురించి చాలా కథలు యున్నవి. ఈ నది విష్ణు దేహమునుండి పుట్టినదని ప్రతీతి. సర్వపాపములు హరించు నని విశ్వాసము. "విష్ణుదేహ సముత్పన్నే క్షిప్రాహం పాపనాశిని" అనుచూ సాధుసజ్జనులు ఈ నదియందు స్నాన మాచరించెడి వారు. ఈ నదికి తూర్పు దిక్కుననే అవంతికా నగర ముండెడిదట. సూర్య చంద్ర గ్రహణముల సమయముననను, కార్తీక పూర్ణిమ నాడు, శనివారముగాని, సోమవారముగాని వచ్చు అమావాస్య తిథియందు ఈ నదియందు ఉదయము, సాయంకాలము వేలాది భక్తులు స్నానమాచరింతురు.

నదియందు నీటి ప్రవాహము అంతంత మాత్రముగనే యుండుటచే బృందము నదినీటిని హస్తములలోనికి గైకొని శిరస్సులపై జల్లుకొనిరి.

## హరసిద్ధిదేవి దేవాలయము :

ఉజ్జయిని యందు మహాకాళేశ్వర జ్యోతిర్లింగమునకు ఎంత ప్రాముఖ్యము కలదో దానికి సరిసమానమగు ప్రాముఖ్యము హరసిద్ధి దేవతకు కూడ కలదు. హరసిద్ధిదేవి అనగా, అన్ని సిద్ధులను అనుగ్రహించు దేవి అని అర్థము. జీవులయందు, ప్రపంచమునందు గల అసురులను సంహరించి సిద్ధులనొసగు మాతయని ఈ దేవత నిచ్చట పూజింతురు. ఈ దేవిని గూర్చి స్కాంధపురాణ మిట్లు వివరించుచున్నది. దక్షయజ్ఞ సమయమున సతీదేవి అగ్నిగుండమున బడగా ఆమె చితాభస్మము, అస్తికలు భరతభూమి యందలి పదునాలుగు ప్రదేశములలో పడినవట. అందు మోచేతి భాగము పడినచోట హరసిద్ధిదేవి వెలసినదని స్కాంధపురాణము తెలుపుచున్నది. ఇచ్చట ఏర్పడిన పీఠము సమస్త సిద్ధులను ప్రసాదించునని, ఈ పీఠమును 'సిద్ధిదా' పీఠ మని తంత్రగ్రంథములు తెలుపుచున్నవి.

జగత్ప్రసిద్ధి గాంచిన విక్రమాదిత్య చక్రవర్తి కులదేవత హరసిద్ధిదేవి. విక్రమాదిత్యుడు తంత్రవిద్యా పారంగతుడై అమ్మను పూజచేయు సమయమున 11 మార్లు తన శిరస్సును ఖండించి దేవి కర్పించెడివాడట. అట్లర్పించిన ప్రతి సందర్భమున దేవి ప్రత్యక్షమై అతని శిరస్సును మొండెముపై పునఃప్రతిష్ఠ గావించి సిద్ధులను అనుగ్రహించెనట. 11 మార్లుగా యిట్లు జరిపిన విక్రమాదిత్యుడు పరిపూర్ణ తంత్రసిద్ధుడై శ్రీ మహా విష్ణువువలె అవంతీ దేశమును పరిపాలించినాడు. దేవి విక్రమాదిత్యునికి నొక దివ్య ఖడ్గమును గూడ ప్రసాదించినదని యిచ్చట తెలుపుచుందురు.

హరసిద్ధిదేవి విగ్రహమునకు ఉపరిభాగమున అన్నపూర్ణా దేవి విగ్రహమును, అధో భాగమున మహాలక్ష్మి, మహా సరస్వతి దేవతలును ఏర్పాటు చేసినారు. పీఠము భూగర్భమున మాహాత్మ్య ముగల శ్రీ యంత్ర మున్నదట. ఆలయమునకు నలుదిక్కుల నుండి ప్రవేశము గలదు. ఆలయ ప్రాంగణమున రెండు ఎత్తైన దీపస్తంభములు గలవు. ఒక్కొక్క దీపస్తంభము నందు వెయ్యి ఎనిమిది దీపములు వెలిగించుటకు ఏర్పాటు కలదు. శుక్రవారము నాడు, ఏకాదశి తిథియందు, నవరాత్రులయందు ఈ దీప స్తంభముల యందుగల రాతి ప్రమిదలలో అష్టోత్తర సహస్ర (1,008) దీపములను రెండు స్తంభముల యందు (2,016) దీపములు ముహూర్తకాలమున (నాలుగు నిమిషములు) వెలి గించుట ఒక విశేషము. సంధ్యాసమయములో వీనిని పై తెలిపిన పర్వదినములలో వెలిగించుట ఆచారము.

బృందము అదృష్టవశాత్తు కార్తీక శుద్ధ ఏకాదశి, శుక్ర వారము హరసిద్ధి దేవాలయమునందు ప్రదోషకాల దర్శనము, విశేష పూజ కావించినది. ఆనాటి దీపాలంకృతి జగద్గురుపీఠం సోదరబృందము పేరున జరిగినది. బృందము సభ్యులు దీపా లంకరణము జరిగిన తరువాత ఉచ్చై స్వరముతో లలితా సహస్ర నామ పారాయణము గావించిరి. హరసిద్ధి మాతను విశేషముగా పూజించుకొనిరి.

**విక్రమాదిత్య చక్రవర్తి :**

ఉజ్జయిని రాజధానిగా అవంతీ దేశమును పరిపాలించిన వారిలో విక్రమాదిత్య చక్రవర్తి అత్యంత ప్రసిద్ధుడు. ఈ చక్రవర్తి

కాలముననే అవంతీ దేశము విశ్వవిఖ్యాతి గాంచినది. ఈ మహాత్ముని సంస్మరణార్థము క్రీస్తుశకము శాలివాహన శకమువలె, విక్రమాదిత్య శకము అని కూడ కాలమును లెక్కింతురు. ఈ మహాత్ముడు క్రీస్తు పూర్వము 57వ సంవత్సరము వరకు జీవించి యుండెను. శకులను జయించి 'శకారి' అను బిరుదము పొందిన చక్రవర్తి యితడు. ఇతనికాలమున భరత సంస్కృతి అత్యున్నత శిఖరములకు చేరి వ్యాప్తి చెందెను. ఇతడు 'శివ-శివాని' భక్తుడు. సర్వవిద్యాపారంగతుడు. ఇతని ఆస్థానముననే జగత్ప్రసిద్ధి గాంచిన కాళిదాసు మహాకవి, అనుపమాన జ్యోతిర్విద్యా పారంగతుడు, ద్రష్ట అయిన వరాహమిహిరుడు యుండెడివారు. ఇతని భక్తిప్రపత్తులకు మెచ్చి దేవత ఇతనికి ముప్పది రెండు సాలభంజికలతో కూడి, పదహారు సోపానములుగల (మెట్లు) నవరత్న ఖచిత సింహాసనమును ప్రసాదించినది. విక్రమాదిత్య చక్రవర్తి ఈ సింహాసనము నలంకరించి న్యాయ నిర్ణయములు చేయుచుండెడివాడట.

విక్రమాదిత్యుని ఆస్థాన వైభవము దేవేంద్రుని ఆస్థాన వైభవముతో పోల్చుచు ఎందరో కవులు అభివర్ణించినారు. ఈ చక్రవర్తి ఒక రాజర్షి. ఇతనితో సరిపోలు చక్రవర్తి కలియుగమున మరియొకడు లేడని చెప్పవచ్చును.

హరసిద్ధిమాత భక్తుడగు విక్రమాదిత్యుని వైభవమును హరసిద్ధి దేవాలయ ప్రాంగణముననే ఉజ్జయనివాసులు ఏర్పాటు గావించుకొనినారు.

**కాలభైరవ దేవాలయము :**

స్మశానమున వసించు శివప్రజ్ఞను తంత్ర విద్యలయందు కాలభైరవుడని పేర్కొందురు. ఇతడు దేవాలయ ప్రాంగణమున జాతికుక్క రూపమున కూడ తిరుగుచు నుండును. శివారాధన గావించు వారందరిని సాక్షీభూతుడుగా గమనించు చుండును. శివపీఠమున్నచోట కాలభైరవుడు కూడ నుండును. తంత్రములలో కాలభైరవ తంత్రము అత్యంత మహిమ గలిగినది. భారతదేశ మున తంత్రవిద్యలన్నియు ఉజ్జయినీ ప్రాంతముననే మిక్కుట ముగ ప్రాచుర్యము పొందినవి. ఉజ్జయిని నగరమునకు ఎనిమిది దిక్కుల యందును కాలభైరవ దేవాలయము లున్నవి. ఈ పవిత్రభూమియందే పాతాళభైరవి దేవాలయము కూడ నేటికినీ గలదు. బృందమంతయు కలసి భద్రసేనుడను మహారాజుచే ప్రారంభింపబడి, జయసింహుడనే మహారాజుచే పరిపూర్తి గావింప బడిన ఒక కాలభైరవ దేవాలయమును సందర్శించిరి. ఈ దేవాలయ మిప్పటికినీ తాంత్రికులచే నిర్వర్తింపబడు చున్నది. ఈ దేవాలయ ప్రాంగణమునగల నొక గుహాముఖమున ప్రవేశించి, పయనించినచో పాతాళభైరవి ఆలయములోనికి చేరవచ్చును.

భైరవుడు శివునియొక్క రుద్రరూపము. శివుని మూడవ కన్ను నుండి ఉద్భవించు అగ్నిరూపము. సృష్టించుటకును, దహించుటకును, ఉద్ధరించుటకును కూడ తాంత్రికు లితనిని ఆరాధింతురు. భైరవునకు ప్రసాదముగా మద్యము నిచ్చు సంప్రదాయము నేటికిని ఉజ్జయినియందు ఉన్నది. భైరవుని దర్శించిన బృందమునకు మాస్టరుగారు శివపురాణమునందు,

స్కాంధపురాణమునందుగల భైరవ తత్త్వమును క్లుప్తముగా వివరించినారు. అటుపైన బృందమంతయూ, కాలభైరవాష్టక మును పఠించిరి. అటనుండి బృందమంతయూ మంగళనాథుని దర్శనమునకు బయలుదేరినది.

**మంగళనాథ దేవాలయము :**

మంగళనాథు డనగా కుమార ప్రజ్ఞాంశగా ఏర్పడిన కుజుడు. మంగళు డనునది అతని బిరుదు. మంగళుడు మనయందు సంకల్పబలముగా నుండును. అది సత్సంకల్ప బలమైనచో సర్వమూ మంగళమే. లేనిచో భ్రష్టత్వమే. మంగళు డత్యంత శక్తివంతుడు. శక్తికి బుద్ధి తోడైనచో జీవుడు రాజర్షి కాగలడు. కుమారస్వామి గణపతి సాన్నిధ్యమున పరిపూర్ణుడయ్యెను గదా! అట్లే బుద్ధికి అధిపతియైన బృహస్పతి తోడైనచో సర్వము శుభప్రదము కాగలదు.

మంగళనాథుని ఆలయము అత్యంత ప్రాచీనము. అది క్షిప్రానదీ తీరమున గల కొండపై నున్నది. ఇచ్చట క్షిప్ర నిర్మలమై పారుచూ, స్నానయోగ్యమై యుండును. ఋణగ్రస్తులు, అశుభ ములచే పీడింపబడువారు, యిచ్చట మంగళునికి అభిషేకములు గావించుకొనుట పరిపాటి. మంగళవారమునాడు తండోప తండ ములుగా ఈ ఆలయమునకు వచ్చి, మంగళునికి అభిషేక ములు గావింతురు. బృందమంతయూ క్రమబద్ధముగా ఆలయ ప్రవేశము గావించి, మంగళుని దర్శించి, నమస్కరించుకొని సాందీపని ఆశ్రమమునకు జనినది.

**సాందీపని ఆశ్రమము :**

సాందీపని మహర్షి పరాశరమహర్షి శిష్యుడు. వేదవ్యాసుడు, మైత్రేయుడు, అక్రూరుడు, అతని సహాధ్యాయులు. పరాశర మహర్షి వద్ద సకలవిద్యల నభ్యసించిన వెనుక పరాశరుని ఆదేశానుసారము తంత్రవిద్యా పీఠమగు ఉజ్జయిని మహానగరము చేరెను. సాందీపని మహర్షి అవంతీనగరమును ప్రవేశించినపుడు, అవంతీ రాజ్య మంతయూ దుర్భిక్షమై యుండెను. ప్రజల కోరిక మేరకు సాందీపని మహర్షి అచట యజ్ఞము గావించెను. యజ్ఞ పరి సమాప్తి సమయమున దేశమంతయు వర్షములుపడి, దుర్భిక్షము అంతమొందెను. అతని శక్తి సామర్థ్యముల నెరిగిన అవంతీదేశ చక్రవర్తి మహర్షికి సకల సౌకర్యములతో కూడిన నొక గురు కులము నేర్పాటుచేసి ఆచార్యునిగా స్థిరపరచెను. ఆశ్రమమున సాందీపని తీవ్రమగు తపస్సు చేయగా, ఈశ్వరుడు ప్రత్యక్షమై, వరమునొక దానిని కోరుకొనమనెను. సాందీపని కైవల్యపదము కోరెను. అపుడీశ్వరు డిట్లనెను. ‘‘పరమ పురుషుడు అనతి కాలమున భూమిని అవతరించగలడు. నీవతనికి సంప్రదాయాను సారముగా విద్య నభ్యసింపజేయవలెను. వేదవేద్యుడే నీ వద్ద బాలుడై విద్య నేర్చుకొనును. అంతకన్నమించిన అనుగ్రహము లేదు. పూర్వమీ యనుగ్రహము బ్రహ్మర్షులగు వశిష్ఠ, విశ్వా మిత్రులకే దక్కినది. నీ కిపుడది అనుగ్రహించుచున్నాను. పిమ్మట కైవల్యము చేరగలవు.’’ సాందీపని మహదానందముతో గురుకుల విద్యాలయము, ఉజ్జయినీ నగర పొలిమేరలలో నిర్వర్తించెను. అందు శ్రీకృష్ణుడు, సుదాముడు, బలరాముడు విద్యలను నేర్చిరి.

కృష్ణ బలరాములను అరువదినాలుగు విద్యలతో పరిపూర్ణులను గావించిన ఘనత సాందీపని మహర్షికే దక్కినది. సాందీపని మహర్షి ఆధ్వర్యమున ఉజ్జయిని విశ్వవిఖ్యాత విద్యాలయముగా శోభిల్లినది. తక్షశిల, నలంద, వారణాశి వంటి విద్యాలయములతో సరిసమానముగా విరాజిల్లినది.

ఆశ్రమమున శ్రీకృష్ణుడు గోమతియను ఒక జలకుండము నేర్పరచెను. పురావస్తు పరిశోధనా శాస్త్రజ్ఞుల త్రవ్వకము నుండి ఈ గురుకులము మరల ప్రకాశములోనికి వచ్చినది. శాస్త్రజ్ఞుల కథనము ప్రకారము, ఈ ప్రదేశము 4 వేల సంవత్సరములకు పూర్వము నుండి యున్నదని యొక అవగాహన.

కార్తీక శుద్ధ ఏకాదశి, శుక్రవారము ముందు తెలిపిన విధముగా ఉజ్జయినీ పుణ్యక్షేత్రమందలి అతి ప్రాచీనమైన దేవాలయములను, పుణ్య ప్రదేశములను దర్శించుట జరిగినది. బృందము ఉదయము నాలుగు గంటల నుండి మధ్యాహ్నము రెండు గంటల వరకు ముందు తెలిపిన పుణ్య ప్రదేశములు, దేవాలయములు దర్శించిన వెనుక భోజనాదికములు గావించు కొని, విశ్రాంతిగొని సాయంకాలము మహాకాలేశ్వరుని పునః దర్శనము గావించుకొని, హరసిద్ధిదేవి ఆలయమున ద్విసహస్ర దీపాలంకరణము గావించుకొని, లలితా సహస్రనామ పారాయణము గావించి, రాత్రి భోజనము క్లుప్తముగ స్వీకరించి విశ్రమించిరి.

**ఏకాదశి - శుద్ధ ద్వాదశి, శనివారము 16-11-2002** ప్రాతః కాలముననే బృందమంతయూ మహాకాలేశ్వరుని దర్శనము

గావించి దేవాలయమునకు ఉన్ముఖముగ, దేవాలయ ప్రాంగణ ములో రుద్రాభిషేకము గావించుకొనినది. మహాకాలుని ఆలయ మున మూడుమార్లు రుద్రాభిషేకము జరిగినది. నాలుగుమార్లు విశేషమగు పూజ మహాకాలునకు జరిపించి, జ్యోతిర్లింగమును దర్శించి, స్పర్శించి బృందము పునీతమైనది.

తదుపరి ఉపాహారము గావించి ఓంకారేశ్వర క్షేత్రమునకు పయనమైరి. గం॥ 11-30 ని॥లకు మార్గమధ్యమున పరమపూజ్య సద్గురు శ్రీ భక్తరాజ్ మహరాజ్ (ఇండోర్) వారి ఆశ్రమమునకు బృందము చేరినది. కాళ్ళు, చేతులు కడుగుకొని అందరునూ ఆశ్రమ ప్రవేశము గావించిరి. భక్తరాజ్ మహరాజ్‌వారి పీఠమునకు వారసులైన శ్రీ రామానంద మహరాజ్ సాదరముగ నందరిని లోనికి ఆహ్వానించి, పానీయముల నందించిరి. అందరునూ ఆశ్రమమును దర్శించి, ప్రార్థనాలయమున సమావేశమైరి. ఆలయమున (Hall) భక్తరాజ్ మహరాజ్ గురుదేవుల విగ్రహము, వారి గురుదేవులగు అనంతానందసాయి వారి విగ్రహము మైనముతో చేయబడి సజీవముగా గోచరించినవి.

భక్తరాజ్ మహరాజ్ గారు అనన్య భక్తిమార్గమును సాధకుల కందించిరి. సాధకులయందు భక్తి, వినయము, ఆరాధనా భావము, సేవకు సంసిద్ధత, నిరుపమానమై గోచరించినది. బృందములోని వారందరిని భక్తరాజ బృందమువారు ప్రేమ, ఆప్యాయతలతో ముంచెత్తిరి. సోదరబృందమందలి సభ్యు లందరును కూడ మహరాజ్ గారి శిష్యుల సేవాతత్పరతను చూసి తమతో సరిపోల్చుకొని చిన్నబోయినారు. తరతమ భేదము

లేక, అప్రమత్తతో వారందించిన సేవలు, భారతీయ సంప్రదాయ మందలి ఆతిథ్యపు విలువలను బృందమునకు రుచి చూపించిరి. నిశితముగ పరిశీలించిననూ, విమర్శనాబుద్ధి గలవారికి గూడ వారి సేవాతత్పరత చాల సహజముగ గోచరించినది. సేవ విషయ మున భక్తరాజ్‌వారి శిష్యులను అనుసరించుట ఉత్తమమని భావించిరి.

భక్తరాజబృందము భజనకు గూడ పెట్టినది పేరు. మధ్యాహ్నము 12 గంటలు సమయము కాగా, ముందుగా నిర్ణయింపబడిన కార్యక్రమము ప్రకారము భజన కార్యక్రమము ప్రారంభమైనది. గంటన్నరసేపు మధురముగ భక్తిగీతములు భజన చేయుచుండగా బృందమంతయూ తన్మయత్వము చెందినది. జగద్గురుపీఠ సోదరబృందము కూడ గళములను కలిపి భగవద్భజన గావించిరి. బృందమున చాలమంది కనులలో అశ్రువులు ధారలు కట్టినవి. భజనానంతరము గం॥ 1-30 ని॥లకు భోజన కార్యక్రమము ప్రారంభమైనది. రెండున్నర గంటలకు అందరునూ కొంత తడవు విశ్రమించిరి. అటుపైన తేనీటి విందుకొని, మూడున్నర గంటలకు ఓంకార క్షేత్రమునకు బస్సులలో ప్రయాణము సాగించిరి.

ఇండోర్ నుండి ఓంకారమునకు పోవు మార్గమంతయూ పునీతమై గోచరించినది. మార్గమున వింధ్యారణ్య ప్రవేశము జరిగినది. అరణ్యము నందలి వృక్షములు చల్లదనము నిచ్చుచూ, ప్రశాంతత కలిగించినవి. వాతావరణమంతయు ఋషి ప్రదేశము లను తలపింపజేసినవి. వింధ్యారణ్యమున, వింధ్యపర్వత శ్రేణు

లలో జగన్మాత వింధ్యవాసినిగా తన సాన్నిధ్యమును ప్రసరింప జేయుచు నుండును. ఆ వింధ్యారణ్యములలో శతాధికవృద్ధులు కోకొల్లలుగా దిగంబరులై తపస్సు కావించుకొందురు. సహస్రాదిగా వర్షములు పైబడిన తపస్విజనులు కూడ తిరుగాడుచుందురని ప్రతీతి. భక్తరాజ బృందములోని సభ్యులు కొందరు ధైర్యమును వహించి, ఈ అరణ్యములో సంచరించి సిద్ధపురుషులను దర్శించుట, వారితో సంభాషించుట చేసిరట. ప్రయాణము సాగు చుండగా మహరాజ్‌గారి శిష్యులలో నొకరైన సోదరుడు శ్రీనివాస్ తపస్విజనులను గూర్చిన ఎన్నియో విషయములను వివరించెను.

క్రమముగ ప్రయాణము ఓంకారేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రమును సమీపించెను. కార్తీక శుద్ధ ఏకాదశి ఓంకార క్షేత్రమున ఒక మహా పర్వదినమట. పరిసర ప్రాంతమునందలి పల్లెవాసులు, ఆది వాసులు తండోపతండములుగా క్షేత్ర సమీపమున బహిరంగ ముగా గుడారముల నేర్పరచుకొని ఏడు దినములపాటు ఓంకార స్వరూపముగల పర్వతము చుట్టునూ ప్రదక్షిణములు గావించుచూ, ఓంకారేశ్వరుని దర్శించుచూ నుందురట. లక్షలాదిమందితో వాతావరణ మంతయూ అత్యంత కోలాహలముగా నున్నది. నిజమునకు ఓంకార క్షేత్రము అరణ్యమధ్యమున నిర్మాణుష్య ముగా, నిశ్శబ్దముగ నుండి యాత్రిక జనులకు ప్రశాంతత ప్రసాదించును. కాని, బృందము ఓంకార క్షేత్రము చేరిన సమయము అచ్చట ఆదిమవాసులకు తిరునాళ్ళకాలము. ఈ తిరునాళ్ళు మాసము రోజులు సాగును. కోలాహలమును పరికించిన బృంద సభ్యులకు మొదట కొంత నిరాశ కలిగిననూ,

సన్నివేశమునంతయూ ఈశ్వరుని విలాసముగా భావించుటకు ఎంతో సమయము పట్టలేదు.

ఓంకార క్షేత్రమున బృందము వసించుటకు కార్యకర్తలు గజానన్ మహరాజ్ శిష్యబృందముచే నిర్మింబడిన నూతనమగు రెండు విశ్రాంతి గృహములను ఏర్పాటు చేసిరి. సభ్యులందరూ సాయంకాలము వారివారికి కేటాయించిన గదులలో సామాను లను స్థిరపరచుకొని భోజనమున కుపక్రమించిరి. యాత్ర యంతయూ దక్షిణపథము కాకున్ననూ తొంభైశాతము ఆంధ్రుల భోజనమే ఏర్పాటు చేయబడినది. ఈ విషయమునందు ప్రత్యేక శ్రద్ధవహించిన వారు సోదరులు శ్రీ వల్లభజోశ్యుల రామకృష్ణశాస్త్రి గారు. విశ్రాంతి గృహములు చుట్టును ఆదివాసీయులు గుడారము లేర్పరచుకొని, రకరకములగు నృత్యవాద్యములతో రాత్రి రెండు గంటల వరకు ఉత్సాహముగ సందడి గావించినారు. బృందము గూడ క్రమముగా వారితో మూడు రోజులు సహజీవనమునకు మానసికముగ సన్నద్ధమైనది.

**ఓంకార జ్యోతిర్లింగక్షేత్రము :**

ఓంకార జ్యోతిర్లింగ క్షేత్రము ఓంకారరూపము గల పర్వతముపై వెలసినది. ఓంకార రూపమున పర్వతముండుట యొక సృష్టి వైభవము. ఆ పర్వతముపై జ్యోతిర్లంగము వెలయుట దివ్య వైభవమునకు ఒక పరాకాష్ట. పరిసర ప్రాంతమంతయూ అత్యంత పునీతమై గోచరించినది. పర్వతము చుట్టునూ ప్రదక్షిణము గావించువారు కొందరు. పర్వతమును చుట్టుచూ ప్రవహించుచున్న నదీ ప్రవాహమున పడవలలో ప్రదక్షిణము

గావించువారు మరికొందరు. పర్వతమునకునూ, నదికిని గూడ ప్రదక్షిణము గావించువారు యింకొందరు. తిరునాళ్ళ కారణముగా లక్షలాది సంఖ్యలో మూడు రకములుగనూ ప్రదక్షిణములు చేయువారు  కోకొల్లలుగా కన్పించిరి. ఆదిమ వాసుల నిర్మల భక్తి భావము చూసి బృందము నిశ్చేష్టితమైనది.

**క్షేత్రమాహాత్మ్యము :**

ఒకానొక సమయమున పూజ్యుడైన నారదమహర్షి - గోకర్ణ క్షేత్రమునకు వెడలి మహాబలేశ్వరుని భక్తితో సేవించియు వింధ్య పర్వతమునకు జనియుండ, వింధ్యుడు సముచితరీతిని నారదుని సత్కరించినవాడై "నా యందు సిద్ధ సాధ్య గంధర్వ కిన్నరాది దేవతా జాతులు నివసించుటయే గాక రత్న మణి వజ్ర సువర్ణాది సర్వస్వంబును కలదు గాన నాలో కొఱత యేమియు లేదు" అను భావమును మనస్సునందిడుకొని గంభీర స్వభావమున నగుపడినందున నారదుడు వింధ్యుని యాశయము గుర్తెరిగి నిట్టూర్పు విడిచెను.

అంత వింధ్యుడు "నా యందు కొఱత యెట్టిది? ఎందుకు నిట్టూర్పు విడిచితిరి?" అని యడుగగా నారదుడు "నీ యందు సువర్ణ వజ్రాది సమస్తంబు కలదుగాని మేరు పర్వతము నీ కన్న ఎత్తైనది. మరియు దేవతలలో మేరువునకు సభ్యత్వము కలదు. నీకు అట్టి యోగ్యత లేదు గదా!" అని వచించి తన యిచ్ఛ వచ్చిన చోటునకు వెడలెను. అంత వింధ్యుడు-

"నా జీవితము వ్యర్థము. నా సాటివాడు నన్ను మించి యున్నాడు. ఇప్పుడేమి చేయుదును?" అని చింతించి "విశ్వేశ్వరు

నారాధించి కృతార్థుడ నగుదు'' అని నిశ్చయించుకొనినవాడై ఓంకారేశ్వర క్షేత్రమునకుం జని యచ్చోట పార్థివలింగము నారాధించుచు శివధ్యాన మానసుడై ఆరునెలలు చలింప కుండెను. అట్టి వింధ్యుని తపంబును మెచ్చి యోగులకును చూడరాని స్వరూపమును శంకరుడు కనుపింపజేసినవాడై ''ప్రసన్నుడ నైతిని. వరము నడుగుము!'' అని యనుగ్రహించెను.

అంత వింధ్యుడు ''భక్తవత్సలా! స్వకార్యమును సాధించు బుద్ధినొసగు'' మని ప్రార్థింప పరమేశ్వరుడు ''పరులను బాధించు వరమును కోరు వింధ్యుడు మూర్ఖుడని చెప్పవచ్చును. వీనికి నీయబడు వరము శుభప్రదము కావలెను గదా!'' అని లోలోన చింతించి యెట్టకేలకు ''నీకు యిచ్చ వచ్చినట్లు చేయగలుగుదు'' వని వరమును ప్రసాదించెను.

ఇట్టి సమయమున అమరులు, మునులు నేతెంచి వినమ్రులై ''ప్రభో నీవిట నివసింపు''మని విన్నవింప మహాదేవుడు ''అటులే యగు గాక'' అని కరుణించెను. అట్టితరి ప్రణవాకార ముగ ఓంకారేశ్వరుడనియు, పార్థివ లింగాకారముగ పరమేశ్వరు డనియు రెండు రూపములలో వెలసిన దేవుడు భక్తుల యభీష్టము నెరవేర్చు వాడయ్యెను.

అట్టి ఓంకారేశ్వర పరమేశ్వరుల పూజించి శివకృపా పాత్రులై తమ కోర్కెల బడసి నిజస్థానములకుం జనిరి. వింధ్యుడును సంతోషస్వాంతుడై తన మనోగతమును సాధింప నుద్యుక్తు డయ్యెను.

ఓంకారేశ్వర (పరమేశ్వర) జ్యోతిర్లింగమును భక్తితో దర్శించి శ్రద్ధతో పూజించువారు తల్లికడుపున నివసింపజాలరు. అనగా జన్మరాహిత్యము నొందుదురని భావము. మరియు నభీష్టముల బడయుదురు. - *శ్రీ శివ మహాపురాణము*

ఓంకారేశ్వరమును మాంధాత ఓంకారేశ్వర మందురు. వింధ్యారణ్యమునందలి ఖాండవ వనమునందు ఓంకార పర్వతము వెలసినది. ఓంకారేశ్వర పర్వతము నర్మదానదిచే పరివేష్ఠింపబడి ద్వీపమువలె తేజరిల్లుచున్నది. మాంధాత ఇక్ష్వాకు వంశపురాజు. సూర్యవంశజుడు. ఆ వంశీయులలో అత్యంత ప్రసిద్ధుడు. అతడు ఖాండవ వనమున గల ఒక గుట్టపై ఈశ్వరుని గూర్చి తపస్సు గావించెను. ఈశ్వరుడతనికి ప్రత్యక్షమైనాడు.అతడు తపస్సు చేసిన గుట్ట ఓంకార రూపమున నుండెను. ఆ గుట్ట కొండకన్న పెద్దదిగను, పర్వతముకన్న చిన్నదిగను యున్నది. దేవర్షి నారదుడు వింధ్యారణ్యమునందు సంచరించుచూ, ఉదాసీనతను చెందెను. నారదుని ఉదాసీనతను గాంచిన వింధ్యుడు, నారదుని సమీపించి నమస్కరించెను. ఉదాసీనతకు కారణ మడిగెను. అపుడు నారదుడు వింధ్యునితో యిట్లనెను.

"నీ వొకప్పుడు హిమవంతునితో సరిసమానముగా పెరిగిన వాడవు. మేరు సమానుడవని కీర్తి కూడ పొందితివి. అగస్త్య మహర్షి ఆదేశము ననుసరించి నీవు వినయవంతుడవై ఒంగి యున్నావు. నీ వినయము దేవతలు, ఋషులు కూడ మెచ్చిరి. కాని హిమవత్పర్వత శ్రేణులలో సంచరించునపుడు కలిగిన ఆనందము, వింధ్య పర్వతశ్రేణులతో సంచరించునపుడు

కలుగుట లేదు. వినయవంతుడవేకాని, ఆత్మవంతుడవు కావని తెలియుచున్నది. వినయము మాత్రమే చాలదు. అది పునాదిగా తపస్స్వాధ్యాయములతో ఆత్మవంతుడవు కూడ కావలెను. హిమవత్పర్వత శ్రేణులలో, కైలాసము, మేరు పర్వతము దైవమునకు ఆలయములై యున్నవి. నీయందట్టి ఆవాసమే లేదు. అదియే నీ ఉదాసీనతకు కారణము. నీవు ఈశ్వరుని గూర్చి తపస్సు గావించి, సర్వదేవతా నిలయమగు ప్రదేశము నొకటి ఏర్పరచుకొనుము.''

పై విధముగా తెలిపి నారదు డదృశ్యుడయ్యెను. అపుడు వింధ్యుడు ఓంకారమే మంత్రముగ నియమనిష్ఠలతో తపస్సు గావించినాడు. అతని తపోమహిమ వలన, అతడు తపస్సుచేసిన ప్రదేశమంతయూ ఓంకారముతో నిండినది. దశదిశల ఓంకార ధ్వని తరంగములు వ్యాప్తి చెందినవి. ఈశ్వరుడు ప్రసన్నుడై దర్శనమిచ్చెను. వింధ్యుని మనసున గల వరము ప్రసాదించెను. ఓంకారముచే నిండిన తపోభూమియంతయు ఓంకార రూపమున ఒక కొండగ నేర్పడినది. ఇది యొక అద్భుతము. దానిని పరవశముతో నర్మద ప్రదక్షిణము గావించినది. నేటికిని అట్లే ప్రదక్షిణము గావించుచున్నది.

వింధ్యారణ్యమునందలి ఖాండవ వనము అహంకారమును దహింపజేయును. వింధ్యుడు వినయమును ప్రసాదించును. నర్మద పాపములను హరించును. ఓంకార పర్వతము ఈశ్వర సాన్నిధ్యము నిచ్చును. ఇట్లు చతుర్విధములుగా జీవుడు ఓంకార క్షేత్రమున ఉద్ధరింపబడుచున్నాడు. భరతభూమి నడి

బొడ్డు యందు గల ఓంకారక్షేత్రము భూమి జీవులకు ముక్తి ప్రదాతయై ఏర్పడినది. మాంధాత చక్రవర్తి కూడ ఓంకారేశ్వరమున ఈశ్వరుని ప్రసన్నుని చేసుకొనినాడు. ఈశ్వరుడు ప్రసన్నుడైన ప్రదేశమున జ్యోతిర్లింగము వెలసినది.

ఓంకార పర్వతమును వైఢూర్య పర్వతమని కూడ పురాణ ములు తెలుపును. ఆకాశము నుండి గమనించినచో పర్వతము యొక్క ఆకారము నేటికిని ఓంకార రూపమున దర్శనమిచ్చును. మంధాత చక్రవర్తి ఆసీనుడైన రాజసింహాసనము కూడ ఈ పర్వతముపైనే నిక్షిప్తము చేయబడినదని వినికిడి. కలియుగ మందు కొంతకాలము ఓంకారేశ్వరము ఆదిమవాసుడైన భిల్లుల సంరక్షణమున యుండెడిది. భిల్లులు సైతము శివుని ఆరాధించుచు ఓంకార జ్యోతిర్లింగమును సంరక్షించుకొనినారు. ఓంకారపర్వతమును పెద్దలు మూడు భాగములుగా దర్శించిరి. ప్రథమ భాగమును శివపురమందురు. రెండవ భాగమును బ్రహ్మ పురమందురు. మూడవ భాగమును విష్ణుపురమందురు. శ్రద్ధతో గమనించువారికి బ్రహ్మవిష్ణు పురముల మధ్యగా నొక జలధార ప్రవహించుట గోచరించును. జలధార ఒక గోముఖము నుండి ఉద్భవించునట్లుగా కూడ గోచరించును.

ఓంకార పర్వతముపై సిద్ధనాథుని దేవాలయ మొకటి పూర్వకాలమున నిర్మింపబడియుండెను. ఇది అత్యంత శిల్పకళా నైపుణ్యముతో నిర్మింపబడిన దేవాలయము. ఆంగ్లేయుల పాలనలో భరత దేశమున రక్షణాధికారులుగా నియమింపబడిన ఆంగ్లేయులు కొందరు భారతీయ సంస్కృతికి ముగ్ధులైన

వారున్నారు. అట్టివారిలో లార్డ్ కర్జన్ ఒకరు. ఆయన ఓంకారేశ్వర మును దర్శించి స్ఫూర్తి చెంది సిద్ధనాథుని ఆలయమును పరి రక్షించుటకు ఉత్తరువులు జారీ చేసిరి.

ఓంకార పర్వతమున జ్యోతిర్లింగముతో పాటు చూడ వలసిన క్షేత్రము లెన్నియో కలవు. అందు మొట్టమొదటిది రుణముక్తేశ్వర ఆలయము, రెండవది సూర్యచంద్రుల ముఖ ద్వారము. ఈ ముఖద్వారము నుండి సూర్యోదయము, చంద్రో దయముల కాంచుట సత్ఫలితముల నిచ్చునని ఆస్తికుల విశ్వాసము. అటుపైన గౌరీసోమనాథ దేవాలయము, ఆశాపురి దేవాలయము, గోవిందేశ్వర గుహ, కేదారేశ్వర ఆలయము, హను మంతుని ఆలయము యిత్యాదివి. హనుమంతుని ఆలయము నుండి ప్రారంభించి భక్తులు పర్వతమునకు ప్రదక్షిణము కావించి ఓంకారేశ్వర మందిరములోనికి ప్రవేశింతురు.

**కార్తీక శుద్ధ త్రయోదశి, ఆదివారం, ఉత్తరాభాద్ర నక్షత్రము, తేది 17-11-2002** ఓంకార క్షేత్రమున చేరి విశ్రమించిన బృందము ఉదయము 4 గంటలకే మేల్కొని స్నానాదికములు గావించుకొని నర్మద కిటువైపున నున్న అమరేశ్వరాలయము చేరినది. అమరేశ్వరా లయము గూడ జ్యోతిర్లింగ ప్రభావము కలిగి యున్నదని యిచ్చటి ప్రజల విశ్వాసము. ఓంకారేశ్వరుని చేరుటకు నర్మదా నదిని దాటుట తప్పనిసరి. పూర్వకాలమున నదులను నావలపై దాటుటయే యుండెడిదిగాని, వంతెన నిర్మాణములు, వాహన ముల ప్రయాణము ఉండెడిది కాదు. ఓంకార పర్వతము చుట్టునూ ప్రవహించు నర్మదానది పొంగి ఉధృతముగా

ప్రవహించునపుడు భక్తులకు జ్యోతిర్లింగ దర్శనము దుర్లభమై యుండెడిది. అట్టి సమయమున శివదర్శనము కాక, భక్తులు తల్లడిల్లు చుండెడివారు. భక్తుల వ్యధను గుర్తించిన ఆ దేశపు రాణి అహల్యాబాయి పరిష్కారమునకై శివుని గూర్చి తపస్సు గావించెను. ఆమె పరమ శివభక్తురాలు. పరమశివుడు స్వప్న దర్శన మనుగ్రహించి, అమరేశ్వర జ్యోతిర్లింగమును అహల్యా దేవికి సూచించెను. శివుని ఆజ్ఞ ననుసరించి అహల్యాదేవి పరివారముతో ఓంకారక్షేత్ర ప్రాంతమును పరికించిచూచి, నిగూఢమై అరణ్యమున ఉపస్థితుడైన అమరేశ్వరుని లింగమును దర్శించినది. పరిసర ప్రదేశమును పునీతము గావించి, సర్వాంగ సుందరముగా, ఆగమశాస్త్ర ప్రకారము దేవాలయము నేర్పాటు గావించెను. అప్పటినుండి ఓంకారేశ్వరుని దర్శనము గావింపలేని భక్తులు అమరేశ్వరుని దర్శించి, తత్ఫలితములు పొందుచుండిరి. కాలక్రమమున అమరేశ్వర లింగము కూడ జ్యోతిర్లింగముగా ప్రసిద్ధి గాంచినది. ఓంకారేశ్వరమునకు జనువారందరూ అమరే శ్వరుని తప్పక దర్శింతురు.

బృందము అమరేశ్వరాలయమున మూడుమార్లు తమతో గొనివచ్చిన శివలింగమునకు ఉదయమున, ప్రదోషకాలమున అభిషేకములు గావించిరి. ఆదివారము ఉదయం, సాయంత్రం అమరేశ్వర జ్యోతిర్లింగమును దర్శించి, ప్రాంగణమున రుద్రాభి షేకమును గావించిరి. ఆ ప్రాంగణమున చేసిన రుద్రాభిషేకము ఒక ప్రత్యేకమగు అనుభూతిని సభ్యులకు అందించినది. మూడు పర్యాయములును కూడ పూజాభిషేకములు చేయుచున్న మాస్టరు

గారి దంపతికి భస్మధారి, తేజోమూర్తియగు బ్రాహ్మణుడు తన యిద్దరి అనుచరులతో ఛత్రము పట్టినట్లు సభ్యులలో కొందరికి గోచరించినది. అభిషేకానంతరము ఉపాహారమును గొని బృంద మంతయూ పడవలాధారముగ జేసుకొని నర్మదను దాటి ఓంకార పర్వతమును చేరిరి. పర్వతము నధిరోహించి, ఆలయ ప్రవేశము కావించి, పంచాక్షరీనామము నుచ్చరించుచూ, ఓంకారేశ్వరుని దర్శించి, స్పర్శించి, పూజించిరి. అటుపిమ్మట దేవాలయపు ఐదంతస్తులలో ఏర్పరచిన శివలింగమును గూడ దర్శించి పరితృప్తులైరి. తిరిగి వచ్చునపుడు ఆదిశంకరులు నిజగురు దర్శనము కావించిన గుహను కూడ దర్శించి, నావలపై నది దాటి, విశ్రాంతి గృహములను చేరిరి. భోజనాదికములు గావించు కొని విశ్రాంతి గొనిరి.

సాయంకాలము ప్రదోష సమయమున మరల అమరేశ్వ రాలయమున చేరి, అమరేశ్వరుని దర్శించి రుద్రాభిషేక సహిత షోడశోపచార పూజను గావించిరి. దేవాలయమంతయు దీపా లంకరణము గావించి, బారులుగా కూర్చొని లలితా సహస్ర నామ పారాయణము కావించిరి. బారులుగ దీపముల నేర్పరచి, ప్రాంగణమున చేసిన సహస్రనామ పారాయణ బృందమున కత్యంత మధురానుభూతిని కలిగించినది. పిమ్మట అందరునూ విశ్రాంతి గృహములు చేరి, భోజనాదికములు గావించి విశ్రమించిరి.

**కార్తీక శుద్ధ చతుర్దశి, సోమవారం, 18-11-2002** గజానన్ మహరాజ్ వారి ఆశ్రమమున బృందమంతయు ఉదయమునే

మేల్కొంచి ప్రార్థనాదికములను గావించుకొనిరి. ఉపాహారానంతరము మోర్‌టక్కా గ్రామమున గల భక్తరాజ్ మహరాజ్ గురుదేవుల ఆశ్రమమును చేరిరి. ఈ ఆశ్రమముననే భక్తరాజ్ మహరాజ్ గారిని, గురుదేవులు మాస్టర్ ఇ.కె. గారు దర్శించుట జరిగినది. ఈ ఆశ్రమము ప్రత్యేకముగ నర్మదా తీరమున మహరాజుగారు ఏర్పాటు గావించినారు. ఆశ్రమము నుండి నర్మద తీరమునకు ఒక ఫర్లాంగు దూరము. ఆశ్రమము చేరు సమయమునకు మహరాజుగారి ప్రధాన శిష్యులు ప్రస్తుతము ఆశ్రమమును నిర్వర్తించుచున్న రామానంద్ మహరాజ్ గారు ఎదురువచ్చి స్వాగతము పలికిరి. మహరాజువారి భక్తబృందము ఈ క్రింది విధముగ భక్తిని నాదము గావించిరి.

"పరమ పూజ్య భక్తరాజ్ మహరాజుకు జయము. పరమ పూజ్య రామానంద్ మహరాజునకు జయము. పరమ పూజ్య పార్వతీకుమార్ మహరాజునకు జయము. నర్మదానది మా పాపములను శమింపుగాక!"

ఆశ్రమము చేరిన బృందమునకు ఆశ్రమవాసులు స్వాగతము పలికి తేనీరు, కాఫీ అందించిరి. ఆ ఆశ్రమమును మాస్టరుగారు 1979 డిసెంబరు 27వ తేదీన ఉదయం 10 గంటలకు సందర్శించుట జరిగినది. భక్తరాజ్ మహరాజుగారిని గూర్చి విని, వారిని సందర్శించుటకు, మాస్టర్ ఇ.కె.గారు సంకల్పించినారు. జనగాం జిల్లా కలక్టర్ శ్రీ రామారావుగారి ఆహ్వానముపై మాస్టరుగారు షిరిడి, ఓంకారేశ్వరము తదితర పుణ్యక్షేత్రములు దర్శించు సందర్భమున, మహరాజుగారి

భాషణము చదువుటచే, మాస్టరుగారు మోర్టక్కా ఆశ్రమము చేరిరి. అది ఉదయం 10 గంటల సమయం, మహరాజుగారు అప్పటికి స్నానము గూడ చేయలేదు. మంగలి ఒకడు అప్పుడే మహరాజుగారికి గడ్డము గీచి చనుచున్నాడు. మహరాజుగారు పంచ, పైన బనియను ధరించి యున్నారు. ఆశ్రమమున ఒక భోజనాలయము, ఒక విశ్రాంతి గది, ఒక బావి ఉన్నవి. కట్టడము లతి సామాన్యముగ నున్నవి. మహరాజుగారు కూడ అట్లే గోచరించినారు. మాస్టరు ఇ.కె. గారు మహరాజుగారి కన్నుల లోనికి నిశితముగ చూచిరి. అది కనిపెట్టిన మహరాజుగారు మందహాసముతో ఇట్లనిరి.

“అది ఇచ్చుట పదిలముగ నున్నది.” ఆ పలుకులు విన్న మాస్టరుగారు భక్తరాజ్ మహరాజుగారి పాదములకు నమస్కరించిరి. మహరాజుగారు కూడ లేచి మాస్టరుగారి పాదములకు నమస్కరించినారు. ప్రసంగవశమున మహరాజుగారు, మాస్టరు గారితో నిట్లనిరి.

“మీరు తూర్పు తీరములో వసింతురు. దైవ ధ్యానముతో పాటు ఆచారకాండ కూడ మిక్కుటముగ నుండును. మేము పశ్చిమమున వసించుచున్నాము. దైవ ధ్యాస ఉన్ననూ, ఆచార మంత యుండదు. మీవలె ఉదయముననే స్నానము గావించుట, సంధ్యాదికములు నిర్వర్తించుట యుండదు. ధ్యాస ఉండును. దైవ మెప్పుడును యుండును. ఆచారముండదు. మీరు నర్మద స్నానము గావించుకొని రండు. ఈ లోపున నేను మీకు భోజనాది

కము లేర్పరుతును. నేనే స్వయముగ వండెదను. భారద్వాజ గోత్రీకుడనే!"

మహరాజుగారి పలుకులకు మాస్టరుగారు పరమానంద భరితులైరి. "దైవమే వసించియున్న స్థానమున ఆచారము ఆశించుట మూర్ఖత. మీరెట్లు వండిననూ, వడ్డించిననూ మీ అతిథ్యము స్వీకరించి చనుదును."

మాస్టరుగారు నర్మదానది స్నానము గావించి, ఆశ్రమమున భోజనము గావించి విశ్రాంతిగొనిరి. వీడ్కోలు సమయమున వారిరువురును ఒకరినొకరు ఆలింగనము గావించుకొనిరి. అప్పుడు మాస్టరుగారు మరల నిట్లనిరి. "తూర్పు తీరమున మీకొక నివాస మున్నది. వీలు వెంబడి రాగలరు" అని పలికిరి.

పై విశేషము లన్నియు మాస్టర్ పార్వతీకుమార్‌గారు మోర్టక్కా ఆశ్రమమున ఇరుబృందములకు వివరించినారు. అటుపైన ప్రక్కనేగల 'శ్యామసాయి' ఆశ్రమమునకు బృందము చనినది. 12 గంటల సమయమున ఓంకారము గావించిరి. అటుపైన శ్యామసాయి ఆశ్రమ వివరములు మాస్టరుగారు అందరికీ, ఈ క్రింది విధముగ వివరించినారు.

"శ్యామసాయి, షిరిడి సాయి భక్తులు మహాసిద్ధులు. స్వచ్ఛంద మరణమును పొందినవారు.

నర్మద నదీతీరమున కిరుప్రక్కల ఎన్నియో సిద్ధ సమాధు లున్నవి. ఎందరో సిద్ధులు జీవుల నుద్ధరించు కార్యక్రమము సలిపి, స్వచ్ఛందముగ దేహత్యాగము చేసినారు. వీరి జీవితము

లను పరిశీలించుట, అధ్యయనము చేయుట ఒక జీవిత కాల సాధన. రెండు వందల నుండి మూడు వందల సంవత్సరముల వరకు జీవించి, ఎందరెందరినో ఉద్ధరించి దేహత్యాగము చేసినవారు వీరందరును. ఎన్నియో సద్గురు పరంపరలు ఈ నదీతీరమునందు నివసించి తపస్సులు గావించి, అనుయాయు లకు మార్గము చూపి, స్వచ్ఛందముగ దేహత్యాగము చేసినారు. వీరి జీవితములయందు ప్రత్యేకాకర్షణ, తమ మరణము తమకు తెలియుట. తదనుగుణముగ శిష్యులకు దేహత్యాగానంతరము, తమ దేహమును ఎట్లు పరిష్కరించవలెనో తెలిపి మరణింతురు. కొందరు తమ దేహములను నర్మదలోని జలచరముల కర్పింపు డని తెలుపుదురు. మరికొందరు తమకు పెద్ద గుదిబండ లేర్పరచి నర్మదలో పడవేయుడని తెలుపుదురు. ఇంకొందరు నర్మద నదీతీరమున సమాధి నేర్పరపుడని తెలిపి, అందు ప్రవేశించి దేహము విడుతురు. అందరునూ తమ మరణమును గూర్చి తెలిసినవారే. తెలిసి మరణించుట, మరణించుట కాదు. అది మరణమును జయించుట. యోగసిద్ధులే అట్లు గావింపగలరు.

**శ్యామసాయి :**

శ్యామసాయి అట్టి సిద్ధులు. షిరిడి సాయిబాబా నుండి తపస్సునకు దీక్షపొందిన వారిలో వీరొకరు. స్వాతంత్ర్య పోరాట సమయమున మహరాష్ట్రలో స్వాతంత్ర్య సమరము గావించిన యోధులలో శ్యామసాయి ఒకరు. బ్రిటీషు వారిపై అకస్మాత్తు దండయాత్రలు చేయుచు, ప్రభుత్వ విధానములపై విరుద్ధముగ ప్రవర్తించుచు, జోరుగ ఉద్యమములను నడుపుచున్న శ్యామ

సాయి ఒకానొక సందర్భమున షిరిడీ కేతెంచి, శ్రీ షిరిడీ సాయి బాబా వారి ఆశీర్వచనములు కోరెను. షిరిడీ సాయిబాబా, శ్యామ సాయికి హితవు పలికెను. తపస్సు చేసి, ఆత్మదర్శనము గావించు కొనవలెనని, ఉన్మాదము, ఉద్వేగములతో కూడిన పోరాటములు అతని జన్మప్రయోజనము కాదని తెలిపెను. షిరిడీసాయి పలికిన పలుకులు హృదయ కవాటములు తెరువగా శ్యామసాయి షిరిడీ సాయి పాదములపై బడి తపస్సునకు దీక్షగొనెను. సద్గురువాదేశ ముగా నర్మద తీరమును చేరి అచ్చట తపస్సాచరించి సిద్ధు డయ్యెను. అచ్చటనే సమాధి నిర్మాణము గావించుకొని ప్రవేశించెను. శ్యామసాయి భక్తరాజ్ మహరాజు గారికి ఆశ్రయము ఇచ్చుచుండెడి వారు. వారి దేహత్యాగానంతరము శ్రీ భక్తరాజ్ మహరాజుగారు ప్రతి సంవత్సరము అచట గురుపూజలు నిర్వర్తించుచు, భజన కార్యక్రమమును అహోరాత్రము గావించు చుండెడివారు.

బృందమంతయు ఆశ్రమమును చేరి శ్యామసాయి మందిరమును, సమాధి మందిరమును దర్శించిరి. దేహము నందున్న రోజులలో వారున్న పడకగది, వారు వాడిన వస్తువులు కూడ ఆశ్రమమున పదిలముగ నుండుటచే, వానిని గూడ దర్శించిరి.

**అనంతానంద సాయి :**

అటు పిమ్మట బృందమంతయు అనంతానంద సాయి ఆశ్రమమును చేరిరి. అనంతానందసాయి భక్తరాజ్ మహరాజు గారి గురువుగారు. పరమగురువులు. షిరిడిసాయి సమకాలికులు.

వారు పూర్వాశ్రమమున బ్రిటీషు పాలనలో రెవెన్యూ కార్యాలయమునందు శిస్తు వసూలు చేయు అధికారిగ నుండెడివారు. ఖాండవవన ప్రదేశము అంతయు నొక ప్రాంతముగ పరిపాలన చేయబడుచుండెడిది. ఆ ప్రాంతముననే ఓంకారేశ్వరము, మోర్టక్కా ఇత్యాది గ్రామము లుండెడివి. నది కావలిదిక్కున ఇండోర్ పట్టణ ముండెడిది. శిస్తు వసూలు అధికారిగ అనంతానందులు గ్రామములు పర్యటనము గావించుచుండెడివారు. కరువు కాలమున కూడ, శిస్తు వసూలుకై ఆంగ్లేయాధికారులు ఒత్తిడి పెంచుచుండగా అనంతానందులు అచ్చటి నర్మద తీరమందుగల గ్రామములలో శిస్తు వసూలుకై బయలుదేరిరి. కరవునకు గురియైన ప్రజల వద్ద శిస్తు వసూలు చేయుచున్న అనంతానందులకు హృదయము బరువయ్యెను. తాను చేయుచున్న పని అధర్మమని, మహాపాపమని అంతరంగమున ఘోష ప్రారంభమయ్యెను. ఆత్మ ప్రబోధము మెండుకాగా, వారు వసూలు చేసిన శిస్తును తిరిగి గ్రామములో పంచివేసిరి. ఇక ఉద్యోగ మెటునూ లేనట్లేనని భావించి, నర్మద తీరమందు గల చంద్రశేఖరానంద అను సిద్ధులను చేరి పేరు చెప్పుకొని, తన దుస్థితిని వివరించుకొని శరణుకోరిరి. వారివద్ద సన్యాస దీక్షను స్వీకరించి, వారి ఆశీర్వచనముతో తపస్సు గావించుచుండిరి. భక్తిశ్రద్ధలతో సద్గురువునకు శుశ్రూషలు చేయుచు సద్గురువనుగ్రహమునకు పాత్రులైరి. తమ సహాధ్యాయి, తమకన్న ముందునుండి చంద్రశేఖరానందుల వారిని సేవించుచున్న సన్యాసియొకరు, కించిత్ కాలము అసూయచే, కలత చెందియుండుట గమనించిన చంద్ర

శేఖరానందులు, తన ప్రథమ శిష్యుని మనోవ్యధను గుర్తించి, అనంతానందుని పిలిచి, నర్మదా నదీతీరమున కావలి గట్టున, తన ఆశ్రమమునకు ముఖాముఖిగ, మరియొక ఆశ్రమ మును ఏర్పాటు గావించుకొని తపస్సు గావింపుమని, వారు అనంతా నందులకు తెలిపిరి.

ఈ లోపుననే ప్రభుత్వాధికారమును ధిక్కరించి శిస్తులు వసూలు చేయక సన్యాసదీక్షనొందిన అనంతానందులను బంధించి, శిక్షించుటకై, పోలీసులు దర్యాప్తు గావించుచు, ఒకనాడు చంద్రశేఖరానంద ఆశ్రమమున కేతెంచిరి. అది తెలిసిన అనంతానందులు చంద్రశేఖరానందస్వామి పాదముల నాశ్రయించి "*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ । అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥*" అను శ్లోకమును పఠించిరి. చంద్రశేఖరానందులు అభయ మిచ్చి, అనంతుని తనవద్దనే కూర్చుండ బెట్టిరి. ఆశ్రమమున ప్రవేశించిన పోలీసు అధికారులు అనంతునికై వెదికి చంద్రశేఖరుల నిట్లు ప్రశ్నించిరి.

"మీ ఆశ్రమమునకు అనంతుడను రెవెన్యూ అధికారి వచ్చి, సన్యాసము పుచ్చుకొని యిచ్చట దాగియున్నాడని తెలిసినది. అతడు శిక్షార్హుడు. అతనిని మేము బంధించుటకు వచ్చితిమి. అతడు ఆశ్రమమున నెచట కలడో తెలుపవలెను" అని పలికిరి. ప్రక్కనే ఉన్న తనను పోలీసులు గమనించకపోవుట అనంతున కాశ్చర్యము కలిగించినది. చంద్రశేఖరులు పోలీసువారితో ఇట్లు పలికిరి. "మీ కతడాశ్రమమున గోచరించినచో, తప్పక బంధించి గొనిపొండు." పోలీసులు ఆశ్రమమును క్షుణ్ణముగ మరల వెదికి,

అనంతుడు ఆశ్రమమున కనిపించక పోవుటచే, చంద్రశేఖరుల వద్దకువచ్చి నమస్కరించి అనంతుడు ఆశ్రమమున లేడని నిర్ధారణ చేసుకొని జనిరి. అనంతునకీ మొత్తము అమితాశ్చర్యము, ఆనందము కలిగించినది. తాను చంద్రశేఖరుల ప్రక్కననే కూర్చుండియున్నాను, కాని పోలీసులు తనను చూడకపోవుట యేమి? సద్గురు కృపాకటాక్షము అతనిని భక్తిపారవశ్యమున నింపగ, చంద్రశేఖరులు నవ్వుచూ "ఈశ్వర కటాక్షము నీ యందున్నది. అందువలన పోలీసు అధికారులకు నీవు గోచరింప లేదు. ఇది దైవ విలాసముగ జరిగినది. నీవు యిక యథేచ్ఛగా తపస్సు గావించుకొనవచ్చును" అని పలికిరి.

"పోలీసులు ప్రాంగణమున తిరుగుచుండగా వారికి నేనగ పడకుండుటకు కారణము, మీ సంకల్పమే" అని పాదములపై పడి అనంతుడు నమస్కరింపగా, చంద్రశేఖరానందులు "సర్వ ధర్మములను పరిత్యజించి, సద్గురువు నాశ్రయించిన వానిని రక్షించువాడు జగదీశ్వరుడే. నీవు నాకు సమర్పణము చెందితివి. నేను నా గురువైన వేదవ్యాసునకు సమర్పణ చెందితిని. అతడు జగద్గురువైన జగన్నాథుని శరణుజొచ్చినవాడు. అందరికి శరణు యిచ్చు వాడే నీకునూ శరణు యిచ్చినాడు. సర్వలోక శరణ్యుడగు పరమాత్మతో అనుసంధానము చెందుటకే తపస్సు. నీవిక ఆ దిశగ జనుము." అని చంద్రశేఖరానందులు పలికిరి.

అనంతానందులు హుటాహుటిన బయలుదేరి, తన సద్గురువు ఆశ్రమమునకు అభిముఖముగా, నర్మద ఆవలి తీరమున, ఆశ్రమము నేర్పరచుకొని తపస్సు గావించుకొని మహా

సిద్ధులైరి. ప్రతి దినము త్రిసంధ్యల యందు నర్మదయందు స్నానము గావించెడివారు. ఆవలి ఒడ్డునగల తన సద్గురువాశ్రమమును దర్శించి నమస్కరించెడివాడు. తపస్సు గావించుచుండెడివాడు. నర్మద జలములే ఆహారముగ జీవించెడివాడు. తన వద్దకు వచ్చిన ఆర్తులకు నర్మద జలములతోనే పరిష్కారములు గావించెడివారు. సద్గురువనుగ్రహముతో పరమార్థమును పొంది, తన స్వస్థలమైన మీరట్ గ్రామము చేరి, అనంతానందులు సమాధి పొందినారు. ఈ గ్రామము రాజస్థాన్ రాష్ట్రమున గలదు.

అనంతానందులు, అనంతానందసాయి అని పిలువబడుటకు కారణమున్నది. వారినుండి భక్తరాజ్ మహరాజు గారికి సాయి దర్శనమగుట వలన, వారు అనంతానంద సాయీశులైరి. అదియునూ ఒక రమ్యమగు గాథ. అది ఈ క్రింది విధముగ నున్నది.

భక్తరాజ్ మహరాజుగారు పూర్వాశ్రమమున ఒక గృహస్థు. వారికి బట్టల వ్యాపారముండెడిది. కుటుంబ సంప్రదాయమునను సరించి వారు ప్రతి సంవత్సరము శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము నాచరించుచుండెడివారు. తీరిక సమయములలో భక్తిపాటలు, సినిమాపాటలు, భజనలు చేయుచుండెడివారు. వారిది భరద్వాజ గోత్రమునకు సంబంధించిన బ్రాహ్మణ కుటుంబము. క్రమముగ వారికి శ్రీ షిరిడీ సాయిబాబాయందు భక్తి కుదిరినది. షిరిడి సాయిబాబా నిర్మలత్వము, సామాన్యత్వము వారిని మిక్కిలి ఆకర్షించుట ఆరంభమైనది. ఒక సంవత్సరము సత్యనారాయణ స్వామి వ్రతము చేయు సందర్భమున, షిరిడి

బాబా ప్రతినిధిగా నొక ఫకీరును యింటికి గొనివచ్చి, సకల మర్యాదలు గావించి, స్వహస్తములతో భోజనము పెట్టి, వస్త్రము లతో సత్కరింపవలెనను భావన, భక్తరాజ్ మహరాజు వారికి కలిగినది. వారు ఆ సమయమున ఇండోర్‌లో నివసించు చుండెడివారు. దగ్గరలో గల ఒక దర్గాకు పోయి, తన కోరికను అక్కడి ఫకీరులకు తెలుపగా, వారు నర్మదానదీ తీరమున ఒక ఫకీరు ఉన్నారనియు, మహా మహిమాన్వితు డనియు, వారికి అతిథి సత్కారములు గావించినచో, తప్పక బాబా అనుగ్రహము పొందవచ్చునని తెలిపిరి. మహరాజుగారట్లే, హుటాహుటిని నర్మదా తీరము చేరి, అనంతానందుల వారిని కలిసిరి. తన ప్రార్థనను తెలిపిరి. ప్రాధేయపడిరి. శిరస్సు వంచి పాదములకు నమస్కరించి వేడుకొనగా, అనంతానందులు తానెవరి యింటికి రానని, యిష్టమైనచో భోజనము తన ఆశ్రమమునకే తెచ్చి వడ్డించినచో భుజింతునని తెలిపిరి. భక్తరాజ్ మహరాజుగారట్లే గావించి, వారి నుండి సాయి అనుగ్రహము పొందుటయే గాక, సాయి దర్శనమును గూడ పొందిరి.

నిజమునకు మహరాజుగారు అనంతానందుల వారిని కలియుటకు ముందు రోజుననే షిరిడీసాయి, అనంతానందు లకు తమ తేజోరూపమును దర్శనమిచ్చి, తన భక్తుడొకడు చనుదెంచుననియు, అతడందించు ఆతిథ్యమును స్వీకరించి అనుగ్రహింపుమనియు, అనంతానందులను కోరిరి. మొదట అనంతానందులవారు శ్రీ షిరిడీ సాయిబాబా కోరికను మన్నించు టకు నిరాకరించిరి. కాని పది క్షణములలోనే, షిరిడీసాయి

తేజము, తన తేజము ఒకే తేజమునకు సంబంధించిన రెండు రూపములని గ్రహించి, అనంతానందులవా రంగీకరించుట జరిగినది. ఇది గురుమైత్రికి నిదర్శనము. సద్గురువు లొకరి కార్యములను మరియొకరు చక్కబెట్టుట కూడ నిదర్శనము. భక్తరాజ్ మహరాజుగారు అనంతానందుల దర్శనమున, షిరిడీ సాయి స్పర్శను పొందుట పై తెలిపిన అమరిక సద్గురువుల యందేర్పడుటయే కారణము. అప్పటి నుండి అనంతానందుల వారి యందు సాయిని దర్శించుట, మహరాజు గారికి అలవాటగుటచే వారు అనంతానందులను, అనంతానందసాయీశు లుగా అభివర్ణించిరి. అనంతానందులనుండి సమస్త గురువను గ్రహమును పొందిన మహరాజుగారు, నిరుపమానమగు గురు భక్తిని ప్రదర్శించిరి. దైవ మీయలేని అమూల్యమగు విషయ మును తన గురువు తన కందించెనని, వేనోళ్ళ కీర్తించిరి. మహరాజుగారి భక్తికి పరవశులైన అనంతానంద సాయీశులు మహరాజుగారికి, ‘‘భక్తరాజ్’’ అను బిరుదును ప్రదానము గావించిరి.

పై విధముగా ఒక పరిపూర్ణమగు గురుపరంపర ఏర్పడి, భక్తులకు స్థిరమగు మార్గమొకటి ఏర్పడినది. ఈ మార్గమునకు భక్తరాజ్ మహరాజుగారు ముఖద్వారము. వారిపైన అనంతానంద సాయీశులు పరమగురువు. వారిపైన చంద్రశేఖరానందుల వారు పరమేష్ఠిగురువు. వారిపైన వేదవ్యాసులు మూలపురుషులు. ఇట్లు నాలుగుతరముల గురుపరంపరతో భక్తియోగ మార్గము అలరారు చున్నది.

పై విషయములన్నియు అనంతానంద సాయీశులవారి ఆశ్రమమున, మాస్టర్ పార్వతీకుమార్‌గారు అందరికిని వివరించిరి. అటుపైన కొంతసేపు అందరును, ఆశ్రమమున ధ్యానము గావించి, భక్తిగ భజన గావించిరి. మోర్టక్కా ఆశ్రమమునకు తిరిగివచ్చి, భోజనాదికములు గావించిరి. మధ్యాహ్నము చంద్ర శేఖరానందులవారి ఆశ్రమమును దర్శించిరి. సాయంకాలము నర్మదానదీ స్నానము గావించిరి. అటుపైన భక్తరాజ్ మహరాజు గారి మోర్టక్కా ఆశ్రమములో సంకీర్తనము గావించి, రాత్రికి ఓంకార క్షేత్రమును చేరిరి. ఉదయము నుండి సాయంత్రము వరకు మహత్తరమగు సద్గురువుల ఆశ్రమములను, సమాధులను దర్శించి, వారి జీవితములను సంగ్రహముగ తెలుసుకొని ప్రార్థనలు, ధ్యానములు, కీర్తనములు గావించిన బృందము పొంగిన హృదయములు గలవారై, ఓంకార క్షేత్రమును జేరి విశ్రమించిరి.

**కార్తీక శుద్ధ పౌర్ణమి, మంగళవారం, 19-11-2002** న బృంద మంతయు యథాప్రకారము ఉదయముననే కాలకృత్యములు గావించుకొని, గురుప్రార్థనము పిదప అందరునూ ఓంకార పర్వతమును చేరిరి. దేవస్థానమువారు ప్రత్యేకమగు అనుమతి నీయగా ఓంకార జ్యోతిర్లింగ దేవాలయముననే బృందమంతయు ముఖప్రాంగణమున ఆశీనులైరి. ఒక వేదికపై హోమగుండము నేర్పరచిరి. ఖాండవ వనమందలి సమిధలతో అగ్నికార్య మారంభించిరి.

ఓంకారేశ్వర దేవాలయమున అగ్నికార్యము చేయుట

దైవముయొక్క విశిష్ట అనుగ్రహముగా బృందమంతయు భావించిరి. అగ్నికార్యము చాల వివరముగ నిర్వర్తింపబడినది. క్రతుమధ్యమున శ్రీసూక్త ఋక్కులతోను, పురుషసూక్త ఋక్కుల తోను, రుద్రసూక్త ఋక్కులతోను స్వాహాకారములు జరిగినవి. అటుపైన విష్ణు సహస్రనామములతో కూడ అగ్ని నారాధించుట జరిగినది. ఈ అగ్నికార్యమొక ప్రత్యేక అనుభూతి నందిరికిని కలిగించినది. అటుపై నందరును 11 గంటలకు దేవస్థానము వారి ప్రత్యేక అనుమతితో దేవాలయ ప్రాంగణముననే ఉపాహార మును, కాఫీ, టీ పానీయాదులను దైవ ప్రసాదముగా స్వీకరించిరి.

అగ్ని ఆరాధన జరిగిన పిమ్మట అందరునూ జ్యోతిర్లింగ దర్శనము గావించి నర్మదనదిలో ఓంకార పర్వత ప్రదక్షిణమునకై ముందుగా ఏర్పాటు చేసుకొనిన మోటారు పడవల నెక్కిరి. ఓంకారము గావించుచు, బృందము పడవలలో ప్రదక్షిణమున కుపక్రమించినది. నదీమార్గమున ప్రదక్షిణ ఆరంభము చేయుట గూడ హనుమంతుని ఆలయము వద్దనే ప్రారంభింపబడెను. ప్రదక్షిణమున కావేరీనది సంగమము జరిగిన చోట రుణముక్తేశ్వర మందిరము గోచరించినది. అటు పైనుండి ప్రదక్షిణముగా తిరిగి నపుడు గౌరీసోమనాథ మందిరము దర్శనము జరుగగా, నది లోతు తక్కువగా నుండుటచే తీరమున బృందములోని సభ్యులు కాలినడకన కొంత దూరము నడచిరి. మరల సూర్య చంద్ర ద్వారము వద్ద అందరునూ పడవల నెక్కిరి. రుణముక్తేశ్వర దేవాలయము నుండి గౌరీ సోమనాథ దేవాలయము, సూర్య చంద్రద్వారము, సిద్ధనాథ మందిరము వరకు ప్రవహించు

నదియందు పడవ ప్రయాణము చేయుచున్న సభ్యులకు దాదాపు గంటసేపు ఓంకారము వినుపించుట జరిగినది. ఓంకారము పర్వతమునుండి, నది నుండి కూడ అనుస్యూతముగ వినబడు టచే ఓంకార పర్వతము సార్థక నామధేయము కలిగినదని సభ్యులు ఆనందపడి, అట్టి సత్యదర్శనము పిలువని పేరంట ముగా దక్కినందులకు వినమ్రులై పర్వతమునకు నమస్కరించిరి. నదిలో నావతో చేసిన ప్రదక్షిణము మూడు గంటలు పట్టినది. అందరునూ విశ్రాంతి గృహములకు మధ్యాహ్నము మూడు గంటలకు చేరిరి. భోజనానంతరము 4-30 గంటలకు బృంద మంతయూ మరల బయలుదేరి సూర్యాస్తమయ మగుచుండగా నర్మదానదీ స్నానము పర్వతము పూర్వముఖముగా చేసిరి. నది ఒరవడి వలన కలుగు అపాయము తొలగించుటకై స్నానఘట్టము లలో చక్కని సదుపాయములు కావించిరి. నదిలో దిగి స్నానము చేసిన సోదరబృందమునకు దేహము తేలిక అయిన భావము ఏర్పడినది.

కార్తీక శుద్ధ పౌర్ణమినాడు జ్యోతిర్లింగ దర్శనము, ఆలయ ముఖ ప్రాంగణమునందే జరిగిన వేదోక్తహోమము, పర్వత ప్రదక్షిణము, నదీస్నానము సోదరబృందము నందు చైతన్యమును ఇనుమడింప జేసినది. అందరునూ మరల ఉత్సాహముతో అమరేశ్వర జ్యోతర్లింగమును దర్శించి, శ్రద్ధాభక్తులతో మాస్టరు గారు గొనివచ్చిన జగద్గురు మందిర పూజాపీఠము నేర్పరచి మరొక్కమారు రుద్రాభిషేకము కావించుకొనిరి.

లక్షలాది ప్రజలు తండోపతండములుగా క్షేత్రము

నందున్ననూ, నిరాటంకముగా తమ కార్యక్రమము సాగుట, అందునా అత్యంత పుణ్యప్రదమగు కార్తీక శుద్ధ పౌర్ణమినాడు సర్వపుణ్యప్రద కార్యములు ఒక్కసారిగా జరుగుట సోదరబృంద మును ఉక్కిరిబిక్కిరి గావించినది. అంతయూ గురుకృప యని, దైవకృపయని అందరియందు భావము స్థిరపడినది.

పర్వదినమును పురస్కరించుకొని బృందమంతయు సంకల్పించి విశ్రాంతి గృహము చుట్టునూ గుడారములలో నివసించుచున్న ఆదివాసులకు ఒక వెయ్యిమందికి నారాయణ సేవగా పులిహోర పొట్లములు కూడ పంచుట జరిగినది. ఆదివాసులు కూడ భక్తి తత్పరతతో ఆహారము స్వీకరించి, భుజించిరి.

చిత్రభాను నామ సంవత్సర కార్తీక పౌర్ణమి బృందసభ్యుల జీవితములో మరువరాని పుణ్యదినమై నిలచినది.

నర్మదయాత్రలో భాగంగా, ఉజ్జయిని క్షేత్రదర్శనం, గఢకాళీ, హరప్రియ అమ్మవార్ల దర్శనము, బఢాగణేష్, కుమార స్వామి (మంగళనాథ్) ఆలయదర్శనము, క్షిప్రానది, భర్తృహరి గుహ దర్శనము, అష్టభైరవులలో ప్రధాన భైరవ దర్శనము, అత్యంత భక్తిశ్రద్ధలతో గావింపబడినవి.

ఓంకార క్షేత్రమున జ్యోతిర్లింగ దర్శనము అమలేశ్వర లింగదర్శనము, నర్మదస్నానము, క్షేత్ర ప్రదక్షిణము, అనుభూతి పరముగ జరిగినవి.

భక్తరాజ్ మహరాజ్‌వారి ఇండోర్ ఆశ్రమము, మోర్టక్కా ఆశ్రమము, శ్యామసాయి ఆశ్రమము, అనంతానందసాయి

ఆశ్రమము, చంద్రశేఖరానంద ఆశ్రమము, మరల నర్మదస్నానము గురుభక్తి పూర్వకముగా జరిగినవి.

హోమములు, రుద్రాభిషేకములు, దైవదర్శనములు సభ్యులకు అత్యంత దైవస్ఫూర్తి కలిగించినవి. అందరునూ తిరుగు ప్రయాణ సందర్భమున, ఉదయమున మాస్టర్ శ్రీ పార్వతీ కుమార్ దంపతికి భక్తిశ్రద్ధలతో పాదపూజ గావించుకొనిరి. అటుపై అందరు ఉపాహారము గావించి, బస్సులలో ఇండోర్ చేరుకొనిరి. మహరాజు గారి బృందము అందించిన మధ్యాహ్న భోజనము గావించుకొని, భోపాల్ రైల్వేస్టేషనుకు ప్రయాణమై చనిరి.

సాయంకాలము 5 గంటలకు స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 21, నవంబరు 2002న హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణములకు చేరిరి. పరితృప్తులైన సోదరబృందము మరల కార్తీకమాసమునకై ఎదురు చూచుదుమని పలుకుచు, మాస్టరు గారికి వీడ్కోలు తెలిపిరి.

# OTHER BOOKS THROUGH
## MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKS :**

| | | |
|---|---|---|
| 1. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 2. | THE AQUARIAN MASTER | E/G/S |
| 3. | SOUND –The Key & its Application | E/G/S |
| 4. | ASHRAM LEAVES | E/G/S |
| 5. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 6. | VENUS –The Path to Immortality | E/G/S |
| 7. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 8. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 9. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 10. | THE MASTERS OF WISDOM | S |
| 11. | MEDITATION & GAYATRI | S |
| 12. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 13. | ON HEALING | E/G/S |
| 14. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 15. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 16. | THE AQUARIAN CROSS | E/G/S |
| 17. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 18. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 19. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 20. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 21. | JUPITER –The Path of Expansion | E/S |
| 22. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 23. | AMANASAKUDU | T/K |
| 24. | VRUTRASURA RAHASYAM | T |
| 25. | THE DOCTRINE OF ETHICS | E |
| 26. | DHANAKAMUNI KATHA | T |
| 27. | ANTARDARSANA DHYANAMULU | T |
| 28. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 29. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 30. | ASANGUDU | T |
| 31. | SARASWATHI - THE WORD | E |
| 32. | MANA MASTARU GARU | T |
| 33. | GEETOPANISHAD (Sankhya Yogamu) | T |

| | | |
|---|---|---|
| 34. | GEETOPANISHAD (Karma Yogamu) | T |
| 35. | 'OM'KARAM | T |
| 36. | JYOTIRLINGA YATRA | T |
| 37. | SRI LALITHA | T |
| 38. | KATHA DEEPIKA | T |
| 39. | MASTER C.V.V. (Birthday Message) | T |
| 40. | MAITREYA MAHARSHI BODHALU | T |
| 41. | MARUVU MAHARSHI BODHALU | T |
| 42. | DEVAPI MAHARSHI BODHALU | T |
| 43. | HIMALAYA GURU PARAMPARA | T |

## BOOKLETS :

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME, THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |
| 14. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 15. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 16. | MANA SAMPRADAYAMU | T |

## ధనిష్ఠ ఇతర ప్రచురణలు :

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము